thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 168 కరీంనగర్ మంగళవారం, 26 ఆగష్టు 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## సిగరెట్లపై జీఎస్టీ 40 శాతానికి పెంపు!

న్యూఢిల్లీ : సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులపై జీఎస్టీని 40 శాతానికి పెంచాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఈ ఉత్పత్తులపై జీఎస్టీ ప్రస్తుతం 28% ఉంది. దీంతోపాటు కాంపెన్సేషన్ సెస్, ఇతర చార్జీలు కలిపి 53 శాతం దాకా అవుతున్నాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న కాంపెన్సేషన్ సెస్ గడువు 2026 మార్చి 31తో ముగుస్తుంది. అయినప్పటికీ మొత్తం పన్నుపై దీని ప్రభావం పడకుండా ఉండేందుకు జీఎస్టీని పెంచాలని భావిస్తోంది. కాగా, సిగరెట్లపై పన్ను 75%దాకా ఉండాలన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫారసు కన్నా తక్కువే కానుంది. ఇదిలా ఉండగా.. కాంపెన్సేషన్ సెస్ స్థానంలో హెల్త్‌సెస్‌ను ప్రవేశపెట్టే యోచనలో కూడా కేంద్ర ప్రభుత్వం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.




## బీఆర్ఎస్‌కు సవాల్‌గా మారిన...
# జూబ్లీహిల్స్ బై ఎలక్షన్!

హైదరాబాద్ : జూబ్లీహిల్స్ : మాగంటి గోపినాథ్ మరణంతో ఖాళీ అయిన జూబ్లీహిల్స్ అసెంబ్లీ సీటు ఇప్పుడు తెలంగాణ రాజకీయా ల్లో హాట్‌టాపిక్‌గా మారింది. వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన గోపినాథ్ రెండు సార్లు బీఆర్ఎస్ పార్టీకి విజయం సాధించి, ఈ నియోజకవర్గాన్ని బీఆర్ఎస్ పార్టీకి బలమైన కోటగా మార్చారు. ఆయన ఆకస్మిక మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటుగా మారింది.

**సానుభూతి వేవ్..** గోపీనాథ్ సతీమణి మాగంటి సునీతకు పార్టీ టికెట్ ఖరారు చేసే అవకాశాలపై బలమైన ప్రచారం కొనసాగుతోంది.

కుటుంబానికి సానుభూతి వేవ్ పార్టీకి అనుకూలంగా మారుతుందని అధిష్టానం అంచనా వేస్తున్నట్లు సమాచారం. అదే సమయంలో గోపీనాథ్ అన్నయ్య మాగంటి వజ్ర నాథ్ కూడా తనకే టికెట్ ఇవ్వాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

**అనుభవజ్ఞుల పోటీ..** మాగంటి కుటుంబం మాత్రమే కాకుండా, స్థానికంగా పార్టీకి దీర్ఘకాలం సేవలందించిన అనుభవజ్ఞులు కూడా టికెట్ కోసం ముందుకు వచ్చినట్లు తెలిసింది. మాజీ కార్పొరేషన్ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి, పార్టీ స్టేట్ సోషల్ మీడియా కన్వీనర్ దినే ష్ చౌదరి, వెంగళరావు నగర్ కార్పొరేటర్ దేదీప్యా రావు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో భేటీ అయ్యి తమ అభ్యర్థిత్వాన్ని బలపరిచినట్లు సమాచారం.

**పార్టీ వ్యూహం..** బీఆర్ఎస్ అధిష్టానం ఈ బై ఎలక్షన్‌ను అత్యంత కీలకంగా పరిగణిస్తోంది. ఎవరు గెలిపించగలరు..? ఎవరు ప్రజల్లో ఆదరణ పొందుతారు..? అన్న దానిపై సర్వేలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తు న్నది. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం మాగంటి కుటుం బానికి ఉన్న సానుభూతి వేవ్ పెద్ద పాజిటివ్. కానీ స్థానికంగా బలమైన అనుభవజ్ఞులకు టికెట్ ఇస్తే గెలుపు అవకాశాలు పెరిగే అవకాశం కూడా ఉందనే టాక్ వినబడుతోంది. జూబ్లీహిల్స్ బై ఎలక్షన్ బీఆర్ఎస్ పార్టీకి ఒక ఇంజన్ సీటుగా భావిస్తున్నారు.

ఇక్కడ గెలిస్తే రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలలోనూ, రాష్ట్ర రాజకీయాల్లోనూ పార్టీ పుంజుకునే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.




నల్గొండ: ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. పంపిణీ కేంద్రాల వద్ద తెల్లవారుజాము నుంచే బారులు తీరారు. త్రిపురాంతకం, శాలిగౌరారం పీఏసీఎస్‌ల వద్ద క్యూలైన్లలో ఆధార్ కార్డులు, చెప్పులుపెట్టి నిరీక్షిస్తున్నారు. మరోవైపు సూర్యాపేట జిల్లా అనంతగిరిలో ఉదయం 5 గంటల నుంచే రైతులు క్యూ కట్టారు. పలు కేంద్రాల వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో పోలీసులు పహారా కాస్తున్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ప్రతి రైతుకూ యూరియా బస్తాలు అందేలా చర్యలు చేపడుతున్నారు.




హైదరాబాద్: ఉస్మానియా వర్సిటీ అనే పదం తెలంగాణకు ప్రత్యామ్నాయమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ రెండు అవిభక్త కవలలు లాంటివన్నారు. ఉస్మానియా వర్సిటీలో రూ.90 కోట్లతో నిర్మించిన భవనాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. దుందుభి, బీమా వసతి భవనాలను ప్రారంభించిన అనంతరం.. డిజిటల్ లైబ్రరీ, రీడింగ్ రూమ్‌లకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, వేం నరేందర్‌రెడ్డి, కోదండరామ్, ఓయూ వీసీ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. “పీవీ నరసింహారావు, చెన్నారెడ్డి, జైపాల్‌రెడ్డి, ఉస్మానియా వర్సిటీ నుంచి వచ్చిన వారే. తెలంగాణలో ఏదైనా సమస్య వచ్చినా, ఉద్యమానికి పురిటిగడ్డ ఉస్మానియా వర్సిటీయే. చదువుతోపాటు పోరాటాన్ని నేర్పింది ఉస్మానియానే. యాదయ్య.. తెలంగాణ కోసం అమరులయ్యారు. ఈ వర్సిటీ ఐపీఎస్, ఐఏఎస్‌లను అందించింది. ఈ వర్సిటీకీ గొప్ప చరిత్ర ఉంది. వందేళ్లలో ఓయూకు వీసీగా దళితుడిని నియమించింది కాంగ్రెస్ ప్రభుత్వమే. గత పాలకులు కుట్రపూరితంగా ఓయూను నిర్వీర్యం చేయాలని చూశారు. ఉస్మానియా వర్సిటీలో చదువుకున్న వారికి చాలా అవకాశాలు వచ్చాయి. యువ నాయకత్వం దేశానికి అవసరం ఉంది. దేశానికి అతిపెద్ద సంపద యువతే. విద్యార్థులకు నేను ఇచ్చేది నాణ్యమైన విద్య మాత్రమే. తలరాతలు మారాలంటే చదువు ఒక్కటే మార్గం. నేను సీఎం అయ్యాక సామాజిక బాధ్యతగా వర్సిటీలకు వీసీలను నియమించాను. చదువు ఒక్కటే అన్నింటికీ పరిష్కారం. ఉస్మానియా వర్సిటీ చదువులకే కాకుండా పరిశోధనలకు వేదిక కావాలి. విద్యార్థుల కోసం పని చేయని వారిని వ్యతిరేకించండి. డిసెంబర్‌లో ఆర్ట్స్ కళాశాల వద్ద సభ పెడితే నేను వస్తా. అన్ని పనులు మంజూరు చేస్తా. ఒక్క పోలీసును కూడా క్యాంపస్‌లో ఉంచొద్దు. ఒక వేళ విద్యార్థులు నన్ను అడ్డుకొని ప్రశ్నిస్తే చిత్తశుద్ధితో సమాధానం చెబుతా. ఉస్మానియా వర్సిటీని ఆక్స్‌ఫర్డ్ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు నేను సిద్ధం. సకల వసతులు చేకూర్చేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయండి. అందుకోసం నిపుణులతో కమిటీ వేయండి. నిధులు సమకూర్చేందుకు ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉంది.” అని రేవంత్‌రెడ్డి అన్నారు.




హైదరాబాద్: సీఎం ఓయూ పర్యటన దృష్ట్యా విద్యార్థులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. అరెస్టు చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సమాజంపై నిషేధాజ్ఞలు విధిస్తారా? అని ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్‌ను జాబ్ లెస్ క్యాలెండర్ చేశారని ఎద్దేవా చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.




## ‘రాజ్యాంగ సవరణ’పై విపక్షాలకు
# అమిత్ షా కౌంటర్

దిల్లీ: ముఖ్యమంత్రి అయినా.. ప్రధానమంత్రి అయినా జైలు నుంచే పరిపాలన చేయడం మంచి విషయమేనా? అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశ్నించారు. మన ప్రజాస్వామ్యానికి అది మర్యాదపూర్వకంగా ఉంటుందా? అంటూ విపక్షాలపై మండిపడ్డారు. ప్రముఖ జాతీయ మీడియా సంస్థ ‘ఏఎన్ఐ’కి అమిత్ షా ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈసందర్భంగా 130వ రాజ్యాంగ సవరణ బిల్లు సహా పలు అంశాలపై ఆయన మాట్లాడారు. మాజీ ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్ రాజీనామా అంశం పైనా స్పందించారు.

“విపక్షాలు ఇప్పటికీ కూడా జైలుకు వెళ్తే సులభంగా ప్రభుత్వాలు ఏర్పాటుచేయగలమని అనుకుంటున్నారు. వారు జైలునే సీఎం, పీఎం అధికారిక నివాసాలుగా మార్చేస్తారు. అప్పుడు డీజీపీ, చీఫ్ సెక్రటరీ, కేబినెట్ సెక్రటరీ వంటి ఉన్నతాధికారులు జైలు నుంచే ఆదేశాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి సిద్ధాంతాలను నేను, మా పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. జైలు నుంచే ప్రభుత్వాలను నడిపే పరిస్థితి మన దేశంలో రాకూడదు” అని అమిత్ షా అన్నారు.

**వాదోపవాదాల్లేకుంటే చట్టసభలు జీవంలేని రాతి భవనాలే...** “ప్రధాని గానీ, ముఖ్యమంత్రి గానీ లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్న ఏ నేత అయినా సరే.. ఏదైనా కేసులో అరెస్టయితే 30 రోజుల్లో బెయిల్ పొందాలి. లేదంటే తమతమ పదవులకు రాజీనామా చేయాలి. అలా చేయకపోతే.. చట్టమే వారిని తప్పించేలా 130వ రాజ్యాంగ సవరణను తీసుకొస్తున్నాం. చట్టమేదైనా ప్రభుత్వం, ప్రతిపక్షానికి ఒకేలా అమలవుతుంది. ఈ నిబంధన ప్రధాని పదవికి కూడా వర్తించేలా స్వయంగా నరేంద్రమోదీనే దీన్ని సవరణలో చేర్చారు. ఆయనకు కూడా ఇది వర్తిస్తుంది. ప్రధాని జైలుకెళ్తే ఆయనైనా రాజీనామా చేయాల్సిందే. ఎన్నికైన ప్రభుత్వం రాజ్యాంగ సవరణను తీసుకొస్తే దానిపై అభ్యంతరాలు లేవనెత్తే హక్కు అందరికీ ఉంటుంది. అంతేగానీ, పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు కూడా అవకాశం లేకుండా ఆందోళనలు చేస్తే ఎలా?” అని ప్రతిపక్షాలపై హోంమంత్రి మండిపడ్డారు. ఈ బిల్లు కచ్చితంగా పార్లమెంట్‌లో ఆమోదం పొందుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

**నైతికత గురించి నాకు చెప్పొద్దు..** 130వ రాజ్యాంగ సవరణ బిల్లుపై విపక్షాల ఆరోపణలను అమిత్ షా తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా 2013 నాటి ఉదంతాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై ధ్వజమెత్తారు. “రాజ్యాంగ సవరణ బిల్లులో నైతికత లేదని విపక్షాలు అంటున్నాయి. నాడు లాలూ యాదవ్‌ను కాపాడేందుకు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ పత్రాలను రాహుల్ గాంధీ చింపేశారు. ఆ రోజే ఆయన నైతికతతో వ్యవహరిస్తే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదు.

ఈ రాజ్యాంగ సవరణపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తోంది. వరుస వైఫల్యాలతో ఆ పార్టీ ఆలోచనావిధానం మందగించి ఉంటుంది” అని కేంద్రమంత్రి ఎద్దేవా చేశారు.

**ధన్‌ఖడ్ రాజీనామా.. ఎక్కువగా లాగొద్దు...** ఈ సందర్భంగా మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా అంశాన్నీ ఆయన ప్రస్తావించారు. “ధన్‌ఖడ్‌జీ రాజ్యాంగ పదవిలో కొనసాగారు. ఆయన పదవీకాలంలో ఎన్నో మంచి పనులు చేశారు. వ్యక్తిగత అనారోగ్య సమస్యల కారణంగా ఇప్పుడు రాజీనామా చేశారు. ఈ విషయాన్ని మరీ ఎక్కువగా లాగొద్దు. కేవలం ప్రతిపక్షాల ఆరోపణల ఆధారంగా దీనిపై ఓ అంచనాకు రావడం సరికాదు” అని అమిత్ షా స్పష్టం చేశారు. త్వరలో జరగబోయే ఉపరాష్ట్రపతి ఎన్నిక గురించి ప్రస్తావిస్తూ.. “రాష్ట్రపతిని తూర్పు భారతం నుంచి ఎన్నుకున్నాం. ఇప్పుడు ఉపరాష్ట్రపతి దక్షిణాది నుంచి ఉండాలని అనుకున్నాం. దీనికి, తమిళనాడు ఎన్నికలకు ఎలాంటి సంబంధం లేదు” అని తెలిపారు.

చురకలు

మంగళవారం 26 ఆగష్టు 2025




## ప్రధాని విద్యా రికార్డును బహిర్గతం చేయరు: ఢిల్లీ హైకోర్టు తీర్పు

ఢిల్లీ, ఆగస్టు 25: ప్రధాని నరేంద్ర మోదీ బ్యాచిలర్ డిగ్రీకి సంబంధించిన సమాచారాన్ని బహిర్గతం చేయడం కుదరదని ఢిల్లీ హైకోర్టు తీర్పునిచ్చింది. దీనికి సంబంధించి ప్రధాన సమాచార కమిషన్ ఇచ్చిన ఆదేశాన్ని ఢిల్లీ హైకోర్టు పక్కన పెట్టింది. సమాచార హక్కు పిటిషన్‌కు ప్రతిస్పందనగా ఢిల్లీ విశ్వవిద్యాలయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ డిగ్రీ వివరాలను బహిర్గతం చేయాలని పేర్కొంటూ ప్రధాన సమాచార కమిషన్ ఇచ్చిన ఆదేశాన్ని ఢిల్లీ హైకోర్టు నిలిపివేసింది. ప్రధాని మోదీ విద్యా రికార్డ్, డిగ్రీ గురించిన సమాచారం బహిర్గతం చేయాల్సిన అవసరం లేదని ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్ సచిన్ దత్తా తెలిపారు. అయితే, ఈ అంశంపై ఇరు పార్టీలు సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చని పేర్కొన్నారు. ప్రధానమంత్రి మోదీ విద్యా రికార్డులను బహిర్గతం చేయడంపై దాదాపు దశాబ్ద కాలంగా ఈ న్యాయ పోరాటం కొనసాగుతోంది. వాస్తవానికి 1978లో DU (ఢిల్లీ యూనివర్శిటీ) నుంచి BA పరీక్షలో ఉత్తీర్ణులైనట్టు ప్రధాని మోదీ తన ఎన్నికల అఫిడవిట్ లో చూపించారు. ప్రధాని మోదీ విద్యా రికార్డు కోసం 2016లో RTI దరఖాస్తుతో ఈ వ్యవహారం ప్రారంభమైంది. మూడో పక్షానికి సంబంధించిన సమాచారాన్ని పంచుకోకూడదనే నియమాలను పేర్కొంటూ విశ్వవిద్యాలయం దానిని తిరస్కరించింది. అయితే, ప్రధాన సమాచార కమిషన్ ఈ వాదనను అంగీకరించలేదు. అంతేకాదు, డిసెంబర్ 2016లో DU తనిఖీని అనుమతించాలని ఆదేశించింది. ప్రజాప్రతినిధి, ముఖ్యంగా ప్రధానమంత్రి విద్యార్హతలు పారదర్శకంగా ఉండాలని చెప్పింది. అలాగే ఈ సమాచారాన్ని కలిగి ఉన్న రిజిస్టర్‌ను ప్రజాపత్రంగా పరిగణిస్తారని కూడా CIC పేర్కొంది. దీంతో ఆ ఉత్తర్వునకు వ్యతిరేకంగా హైకోర్టును ఢిల్లీ విశ్వవిద్యాలయం ఆశ్రయించింది. భారత సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ కేసులో తన వాదనలు వినిపిస్తూ, వేలాది మంది విద్యార్థుల గోప్యత హక్కు ప్రజలు తెలుసుకునే హక్కు కంటే విలువైందని వాదించారు. డేటాను విడుదల చేయడం ప్రమాదకరమన్నారు. విశ్వవిద్యాలయం రికార్డును కోర్టు పరిశీలన కోసం సమర్పించడానికి సిద్ధంగా ఉంటుందని, కానీ దానిని బహిరంగపరచకూడదని ఆయన చెప్పారు. రికార్డును కోరుకునే వాళ్లు.. ప్రచారం కోసమో.. లేదా రాజకీయ ఉద్దేశ్యాలతోనో కోరుతున్నారని అన్నారు. అయితే, RTI తరఫు న్యాయవాది దీనికి భిన్నంగా తన వాదన వినిపించారు. మోదీ విద్యా రికార్డును కోరుతున్న కార్యకర్తల ఉద్దేశాన్ని తాము పరిగణనలోకి తీసుకోమని వాదించారు. డిగ్రీ అనేది రాష్ట్రం మంజూరు చేసే అర్హత. ఇది ప్రైవేట్ విషయం కాదని, ప్రధానమంత్రి విద్యార్హతలు ముఖ్యమైన ప్రజా ప్రయోజనానికి సంబంధించిన విషయమని కోర్టుకు విన్నవించే ప్రయత్నం చేశారు. ఈ మేరకు హైకోర్టు తీర్పునిచ్చింది.




## దిల్లీ సీఎంను కత్తితో పొడవాలనుకొని.. 'దాడి ఘటన'లో కీలక విషయాలు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై దాడి జరగడం ఇటీవల తీవ్ర చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో నిందితుడు సకారియా రాజేశ్‌భాయ్ ఖిమ్జీభాయ్(41)ను పోలీసులు అరెస్టు చేశారు. అతడిని విచారించగా.. పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. సీఎంను కత్తితో పొడవాలని నిందితుడు ప్లాన్ చేసుకున్నట్లు సమాచారం. అయితే భారీ భద్రత కారణంగా తన ప్రణాళికను విరమించుకున్నట్లు సకారియా చెప్పినట్లు తెలుస్తోంది. "దిల్లీలో వీధి కుక్కలను తరలించాలని నేను చాలాసార్లు అభ్యర్థించా. దీని గురించి సీఎం పట్టించుకోకపోవడంతోనే ఆమెపై దాడి చేయాలని నిర్ణయించుకున్నా. సీఎం అధికారిక నివాసానికి వెళ్లడానికి ముందు సుప్రీంకోర్టుకు వెళ్లా. న్యాయస్థానం బయట సెక్యూరిటీని చూసి అక్కడి నుంచి వచ్చేశా. అనంతరం సివిల్ లైన్స్‌లో ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లా. తొలుత ఆమెను కత్తితో పొడవాలని ప్లాన్ చేశా. కానీ, భద్రత ఎక్కువగా ఉండటం చూసి కత్తిని బయటే పడేశా" అని నిందితుడు సకారియా విచారణలో చెప్పినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఆగస్టు 20న సివిల్ లైన్స్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో రేఖా గుప్తా 'జన్ సున్వాయ్" కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఫిర్యాదుదారు ముసుగులో వచ్చిన దుండగుడు... పత్రాలను అందిస్తూ.. సీఎంపై ఒక్కసారిగా దాడికి తెగబడ్డాడు. పెద్దగా కేకలు వేస్తూ.. చెంపదెబ్బ కొట్టాడు. ఆమెను వెనక్కి తోసేయడానికి ప్రయత్నించాడు. ఆమె జుట్టును గట్టిగా పట్టుకున్నాడు. తక్షణమే భద్రతా సిబ్బంది జోక్యం చేసుకొని అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ అనూహ్య ఘటనలో ముఖ్యమంత్రి తల, భుజం, చేతులకు గాయాలయ్యాయి.

**మరో నిందితుడి అరెస్ట్..**

ఇక, ఈ ఘటనలో మరో నిందితుడు తహసీన్ సయ్యద్‌ను దిల్లీ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. ఇతడు ప్రధాన నిందితుడు సకారియాకు స్నేహితుడిగా గుర్తించారు. దాడి ఘటనలో సకారియాకు సయ్యద్ సాయం చేశాడని, కొంత డబ్బు కూడా పంపించాడని పోలీసులు తెలిపారు. దాడికి ముందు సీఎం నివాసానికి సంబంధించిన వీడియోలను సకారియా తన స్నేహితుడు సయ్యద్‌కు పంపించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు.

**రేఖా గుప్తాకు మునుపటి భద్రత..** కాగా.. దాడి ఘటన కారణంగా ఇటీవల సీఎం రేఖా గుప్తాకు సీఆర్పీఎఫ్ జవాన్లతో జడ్ కేటగిరీ భద్రత కల్పించిన సంగతి తెలిసిందే. తాజా దాన్ని తొలగించారు. మునుపటిలాగే దిల్లీ పోలీసులు ఆమెకు భద్రత కల్పిస్తారని అధికారిక వర్గాలు సోమవారం వెల్లడించాయి.




హైదరాబాద్, ఆగస్టు 25: ప్రొఫెసర్ కోదండరామ్‌ను మరో 15 రోజుల్లో మళ్లీ ఎమ్మెల్సీని చేసి శాసన మండలికి పంపిస్తానని సీఎం రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. తమ ప్రభుత్వం ప్రొఫెసర్ కోదండరామ్‌ను ఎమ్మెల్సీ చేసిందని గుర్తు చేశారు. కానీ బీఆర్ఎస్ నేతలు.. సుప్రీంకోర్టు వరకు వెళ్లి ఆయన పదవిని తీయించేశారని విమర్శించారు. ప్రొ. కోదండరామ్ ఎమ్మెల్సీ పదవిని ఊడకొట్టేందుకు రూ.కోట్లు ఖర్చు చేశారంటూ బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు రేవంత్ రెడ్డి. అయినా.. మీకు ఎందుకంత శునకానందం అంటూ.. బీఆర్ఎస్ పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకా ఆయన మాట్లాడుతూ 1938 సాయుధ రైతాంగ పోరాటానికి ఊపిరిలూదిన గడ్డ ఉస్మానియా యూనివర్సిటీ అని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన శివరాజ్ పాటిల్, పీవీ నరసింహారావు ఈ యూనివర్సిటీ విద్యార్థులేనన్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందిన జైపాల్ రెడ్డి సైతం ఈ యూనివర్సిటీ విద్యార్థేనని పేర్కొన్నారు. తెలంగాణ నలుమూలల్లో ఏ సమస్య వచ్చినా మొదట చర్చ జరిగేది యూనివర్సిటీలోనే అని తెలిపారు. చదువుతోపాటు పోరాటాన్ని సైతం నేర్పించే గడ్డ ఉస్మానియా యూనివర్సిటీ అని అభివర్ణించారు. రాజకీయ నాయకులు తమ ప్రయోజనాల కోసం చేతులెత్తేసినప్పుడు.. తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లింది ఈ యూనివర్శిటీనే అని వివరించారు. మలి దశ తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడు శ్రీకాంతాచారిది ఉస్మానియా యూనివర్సిటీనే అని తెలిపారు రేవంత్. అలాగే యాదయ్య, ఇషాన్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి తదితరులు రాష్ట్ర సాధనలో భాగంగా సమిధలయ్యారని పేర్కొన్నారు. ఎంతో మంది మేధావులను అందించిన ఘనత ఉస్మానియా యూనివర్సిటీదన్నారు. గత పదేళ్ల పాలనలో ఉస్మానియా యూనివర్సిటీని నిర్వీర్యం చేసే కుట్ర జరిగిందంటూ మండిపడ్డారు. ఉస్మానియా యూనివర్సిటీకి పూర్వ వైభవం తీసుకురావాలని తాము ఆలోచన చేశామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలోని యూనివర్సిటీలకు వీసీలను నియమించామని గుర్తు చేశారు. చదువుకుని చైతన్యం ఉన్న వారిని వీసీలుగా నియమించామని వివరించారు.

సోమవారం సీఎం రేవంత్ రెడ్డి.. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి విచ్చే శారు. ఈ సందర్భంగా యూనివర్శిటీకి సంబంధించిన పలు నూతన భవనాలను ప్రారంభించారు. అలాగే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో విద్యార్థులను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.

## జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతున్న సీఎం రేవంత్: హరీష్ రావు



హైదరాబాద్, ఆగస్టు 25: ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు కౌంటర్ ఇచ్చారు. సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ఆందోళన చేస్తున్న ఆశ వర్కర్లకు మాజీ మంత్రి హరీష్ రావు సంఘీభావం ప్రకటించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని హరీశ్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దమ్ముంటే పోలీసులు లేకుండా ఓయూకి వెళా అంటూ సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సీఎం రేవంత్ రెడ్డి తెలుగుదేశం పార్టీలో ఉన్నాడని గుర్తు చేశారు. ఆ సమయంలో రేవంత్ రెడ్డి .. ఓయూకి వస్తే విద్యార్థులు ఇయ్యర మయ్యర అందుకున్నారని వివరించారు. అప్పుడు సందులో పడి రేవంత్ రెడ్డి ఉరికాడని చెప్పారు. కానీ ఇప్పుడు.. తాను ఓయూకు వచ్చానని అంటున్నాడన్నారు. విద్యార్థులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఓయూ సాక్షిగా క్షమాపణలు చెప్పాలంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన డిమాండ్ చేశారు. ఎప్పటి లోగా విద్యార్థులకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తావో చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డికి సూచించారు. ఓయూకు వెళ్తున్నాడని గత మూడు రోజుల నుంచి విద్యార్థులను అరెస్టులు చేయించారని మండిపడ్డారు. వారిని పోలీసు స్టేషన్లలో పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గజానికో పోలీసుని పెట్టారంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఓయూలో మంత్రి సబిత కొబ్బరికాయ కొట్టిన బిల్డింగ్‌ను ప్రారంభించేందుకు సీఎం రేవంత్ వెళ్లారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నిర్మించిన దానికి రేవంత్ రెడ్డి రిబ్బన్ కత్తిరించాడని ఎద్దేవా చేశారు. కత్తెర జేబుల పెట్టుకొని తిరుగుతున్నాడంటూ సీఎం రేవంత్ రెడ్డిని వ్యంగ్యంగా విమర్శించారు. హైదరాబాద్ ఫ్లైఓవర్లు కేసీఆర్ కట్టించినివేనని.. వాటికి రిబ్బన్ కట్ చేసేందుకే వెళ్తాడంటూ ఆయన వ్యంగ్యంగా అన్నారు. బీఆర్ఎస్ హయాంలో కట్టినవి ఓపెన్ చేయడమే కానీ.. కొత్తగా ఒక్క దవాఖాన కూడా నిర్మించలేదన్నారు. ఒక బ్రిడ్జి కానీ.. ఒక బిల్డింగ్ కానీ కట్టలేదని మండిపడ్డారు.




హైదరాబాద్, ఆగస్టు 25 : ఈగల్ టీం.. గచ్చిబౌలి పోలీసులు సంయుక్త ఆపరేషన్ నిర్వహించి రేవ్ పార్టీ భగ్నం చేశారు. మాదాపూర్ డీసీపీ వినీత్ దీనికి సంబంధించి మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ రైడ్ కు సంబంధించి డీసీపీ ఏమన్నారంటే, 'రాజేశ్వరి నిలయం అనే సర్వీస్ అపార్ట్మెంట్‌లో రైడ్ నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నాము. అరెస్ట్ అయిన వారిలో డ్రగ్ ఫెడ్లర్లు తేజ, విక్రమ్ తోపాటు, ముగ్గురు వినియోగదారులు నీలిమ, పురుషోత్తం, భార్గవ్ ఉన్నారు. ట్రాన్స్‌పోర్టర్ చందన్ కూడా వీరిలో ఉన్నారు. అని డీసీపీ చెప్పారు. నిందితుల నుండి డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నామని, 20 గ్రాముల కొకైన్, 08 ఎక్స్టసీ పిల్స్, మూడు గ్రాముల ఎండిఎంఏ సీజ్ చేశామని డీసీపీ తెలిపారు. ఈ కేసులో బెంగళూరుకు చెందిన రాహుల్, మణిదీప్ ఇద్దరు పరారీలో ఉన్నారని డీసీపీ అన్నారు. 'విక్రమ్, తేజ, నీలిమ డ్రగ్స్ ప్రొక్యూర్ చేసి గోవా, రాజమండ్రిలలో రేవ్ పార్టీలు నిర్వహించేవారు. తేజ న్యూ ఇయర్ సందర్భంగా గోవాలో ఒక రేవ్ పార్టీ ఏర్పాటు చేశారు. అందులో నీలిమ కూడా ఉన్నారు. పట్టుబడ్డ నిందితులు ప్రతిసారి రేవ్ పార్టీకి రాహుల్ వద్ద డ్రగ్స్ కొనుగోలు చేసేవారు. ఈ కేసులో పట్టుబడ్డ డ్రగ్ ఫెడ్లర్ విక్రమ్.. మల్నాడు రెస్టారెంట్ సూర్యకు స్నేహితుడు.' అని డీసీపీ తెలిపారు. ఈ కేసులో మరో నిందితుడు మణిదీప్ డిప్యూటీ తహసిల్దార్ గా పని చేస్తున్నాడు. మణిదీప్ రాజమండ్రిలో ఉంటూ, రాజమండ్రితో పాటు గోవాలో పార్టీలు అరెంజ్ చేస్తాడు. రాజమండ్రిలో మణిదీప్‌కు సొంత ఫాంహౌస్ ఉంది. అక్కడ కూడా రేవు పార్టీలు ఏర్పాటు చేశాడు. నీలిమకు, తేజకు మణిదీప్ డ్రగ్స్ అలవాటు చేశాడు. విక్రమ్, నీలిమ ఐటీ ఉద్యోగులు. తేజకు క్లౌడ్ కిచెన్ బిజినెస్ ఉంది. బిజినెస్‌లో లాభాలు రాకపోవడంతో రేవు పార్టీ అరెంజ్ చేస్తున్నారు. బెంగళూరుకు చెందిన రాహుల్ కు నైజీరియన్ మైక్ డ్రగ్స్ సప్లయ్ చేసాడు. తేజా డబ్బులు ఇస్తే చందన్ డ్రగ్స్ తీసుకు వస్తాడు. బ్లూటో థియాన్ ఇంజెక్షన్ మాటున ఈ డ్రగ్స్ తీసుకు వచ్చారు.' అని డీసీపీ తెలిపారు.




హైదరాబాద్: విద్యుత్ స్తంభాలపై ఇంటర్నెట్, కేబుల్ వైర్ల తొలగింపుపై సోమవారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఇటీవల రామంతాపూర్ విద్యుత్ ప్రమాద ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుళ్ల వల్లనే ప్రమాదం చోటు చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధరించారు. ఈ క్రమంలో జీహెచ్ఎంసీ వ్యాప్తంగా విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుళ్లను సిబ్బంది తొలగిస్తున్నారు. దీంతో ఎయిర్‌టెల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అనుమతి తీసుకున్న కేబుళ్లను సైతం తొలగిస్తున్నారని సంస్థ తరఫు న్యాయవాది కోర్టుకు వివరించారు. ఏయే స్తంభాలకు అనుమతి తీసుకున్నారో చూపించాలని టీజీఎస్పీడీసీఎల్ తరఫు న్యాయవాది కోరారు. వాదనలు విన్న ధర్మాసనం అనుమతిలేని కేబుళ్లను తొలగించొచ్చని ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



తిరుమల: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజామున శ్రీవారి సుప్రభాత సేవలో ఆయన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. తితిదే అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయంలోకి వెళ్లిన కిషన్‌రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. తితిదే అధికారులు ఆయనకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశమంతటా మంచి వర్షాలు పడ్డాయని తెలిపారు. రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని శ్రీవారిని ప్రార్థించినట్లు చెప్పారు. సైనికులు పట్టుదలగా, అంకితభావంతో ?పనిచేస్తున్నారన్నారు. సైనిక శక్తి, దేశ భద్రత మరింత శక్తిమంతంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.

హైదరాబాద్, ఆగస్టు 25: బడే భాయ్, చోటే భాయ్ ఇద్దరూ కలిసి పనిచేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం రేవంత్‌రెడ్డి కలిసి ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీని ఆటలో అరటిపండుగా మార్చారని ఎద్దేవా చేశారు. ఇవాళ(సోమవారం) తెలంగాణ భవన్‌లో మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. పెద్ద మోదీ, చిన్న మోదీ (రేవంత్ రెడ్డి) ఒకే రకంగా ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు కేటీఆర్. ఇద్దరూ కలిసి రాహుల్‌కు పెద్ద షాక్ ఇవ్వటం ఖాయమని జోస్యం చెప్పారు. దేశంలో ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని ప్రధాని మోదీ, తెలంగాణలో రెండు లక్షల ఉద్యోగాలని సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగులను మోసం చేశారని ధ్వజమెత్తారు. పేదల ఖాతాల్లో రూ.15లక్షలు వేస్తామని మోదీ.. రైతు భరోసా కింద రూ.15 వేలు ఇస్తామని రేవంత్ చెప్పి మాట తప్పారని విమర్శించారు. ఇద్దరూ కలిసి ఒక్క హామీని కూడా ఎందుకు అమలు చేయలేదని మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు.


**కాంగ్రెస్, బీజేపీ తెలంగాణకు ద్రోహం చేశాయి...** 'ఉస్మానియాలో రేవంత్ రెడ్డి, కేసీఆర్ ప్రభుత్వం పునాది వేసిన భవనాలను ప్రారంభించారు. రేవంత్ రెడ్డి వికృత మాటలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. గత ముఖ్యమంత్రులతో పోల్చి చూస్తూ ప్రజలు రేవంత్ రెడ్డిని బండ బూతులు తిడుతున్నారు. రేవంత్ రెడ్డి జేబులో కత్తెర పెట్టుకొని తిరుగుతున్నారు. మా ప్రభుత్వం నిర్మించిన భవనాలకు రిబ్బన్ కట్ చేయడానికి తాపత్రయ పడుతున్నారు. తెలంగాణ రాష్ట్రానికి ద్రోహం చేసిన పార్టీలు కాంగ్రెస్, బీజేపీ. రెండూ దొందూ దొందే. పెట్టుబడులు, పరిశ్రమలు, విభజన హామీలు – అన్నింటిలోనూ బీజేపీ తెలంగాణకు మోసం చేసింది' అని ధ్వజమెత్తారు మాజీ మంత్రి కేటీఆర్.

**రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారు..** 'కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత, ఎన్నికల హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తోంది. 20 నెలల కాంగ్రెస్ పాలన నచ్చకుంటే, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేయాలి. కాళేశ్వరం ప్రాజెక్టుకు అవసరమైన మరమ్మతులు ఈ ప్రభుత్వం చేయించడం లేదు. మోదీ, చంద్రబాబు ఆదేశాల మేరకు గోదావరి నీళ్లను దిగువకు పంపించేందుకు రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారు. గోదావరి నీళ్లు బకనకచెర్ల ప్రాజెక్టుకు, అక్కడి నుంచి తమిళనాడుకు వెళ్లాలని బీజేపీ ప్రభుత్వం రేవంత్‌కు ఆదేశాలిచ్చింది. అందుకే రేవంత్ కాళేశ్వరం ప్రాజెక్టుపై పగ పట్టారు. మోదీకి, రేవంత్‌కి అనేక పోలికలు ఉన్నాయి. కాంగ్రెస్ పాలన వల్లే తెలంగాణలో యూరియా సంక్షోభం వచ్చింది. ఒకవైపు యూరియా సంక్షోభం ఉంటే, రేవంత్ రెడ్డి సినిమా వాళ్లతో మీటింగ్ పెట్టుకున్నారు. రేవంత్‌పై మాట పడకుండా బీజేపీ కాపాడుతోంది' అని మాజీ మంత్రి కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు.



చురకలు


# బహుముఖ ప్రజ్ఞాశాలి ఏల్చూరి - ఆగస్టు 26...ఏల్చూరి సుబ్రహ్మణ్యం జయంతి



ఏల్చూరి సుబ్రహ్మణ్యం ( ఆగష్టు 26, 1920 – ఫిబ్రవరి 25, 1995) ప్రసిద్ధ కవి, రచయిత, పాత్రి కేయులు. సహజ కవిగా, గొప్ప వక్తగా, ఉద్యమ ప్రవక్తగా, ప్రగతి శీల భావుకునిగా, తెలుగు సాహితీ లోకానికి సుపరిచితులు. ఆయన తెలుగు సాహిత్యంలో ప్రాముఖ్యత వహించిన అభ్యుదయ కవిత్వో ద్యమ ఆద్యుల్లో ఒకరు. అభ్యుద య కవితా యుగంలో ప్రగతి శీల భావ దురంధరులైన బెల్లం కొండ రామదాసు, కుందుర్తి ఆంజనేయ లుతో కూడి, ఏల్చూరి సుబ్రహ్మ ణ్యం వెలువరించిన తొలి కావ్యం నయా గరా కవితల సంపుటి. అలా ముగ్గురు అభ్యు దయ నయాగరా కవులలో ఏల్చూరి ఒకరుగా నిలిచారు. తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఏల్చూరి సుబ్రహ్మణ్యం ఆగష్టు 25, 1920న రామయ్య. సుబ్బాయమ్మ దంపతులకు జన్మించారు. మద్దులపల్లి గురుబ్రహ్మశర్మ, భాగవతుల వెంకట సుబ్బారావు, అక్కిరాజు రామాపతి రావు, నాయని సుబ్బారావు తదితరుల వద్ద చిన్ననాడు విద్యా బుద్దులు నేర్చారు. కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ ఇంట్లోనే ఉండి, విజయవాడ యస్.ఆర్.ఆర్ కళాశాలలో బి.ఎ. డిగ్రీ చేశారు. కవి సామ్రాట్ శిష్యుడు అయిన నందమూరి తారక రామారావు తో చిన్ననాటి నుండి స్నేహం ఉంది. అలాగే కొంగర జగ్గయ్య, ఏల్చూరి సుబ్రహ్మణ్యం ప్రాణ స్నేహితుల్లా మెదిలారు. కుందుర్తి ఆంజనే యులు, బెల్లంకొండ రామ దాసు, ఏల్చూరి సుబ్రహ్మణ్యం ముగ్గురు విద్యార్థి దశలో చదువుతున్న రోజులలో పరిచయస్తులై, తరువాతి కాలంలో "నయాగరా" కవితా సంకలనం సమ కూర్పుకు కారకులు అయినారు. .'త్రివేణి' ఆంగ్లపత్రిక సంపాదకులు కోలవెన్ను రామకోటేశ్వరరావు, దేశిరాజు కృష్ణశర్మ, బెల్లంకొండ రాఘవరావు, గుడిపాటి వెంకట చలం, గుఱ్ఱం జాషువాల స్ఫూర్తిని పొంది, పులుపుల శివయ్య, కొల్లా వెంకయ్యల వల్ల కమ్యూనిస్టు ఉద్య మంలో కాలూనారు. 1940 లో నరసరావుపేటలో 'సన్యాసి' అన్న పత్రికను స్థాపించి అనిసెట్టి సుబ్బా రావు, దండమూడి కేశవరావు, బెల్లంకొండ రామదాసు, దేవరకొండ బాలగంగాధర తిలక్ మొదలైన కవుల తొలి రచనలను ఆ పత్రికలో ప్రచురించారు. అదే సంవత్సరంలో 'చిత్ర' అనే పత్రికను ప్రారంభిం చారు. 1941 లో నవ్యకళా పరి షత్తును స్థాపించి అనిసెట్టి సుబ్బా రావు, కుందుర్తి ఆంజనేయులు, బెల్లంకొండ రామదాసు, సముద్రాల రామానుజాచార్య, దేవరకొండ బాల గంగాధర తిలక్, రెంటాల గోపాలకృష్ణ మొదలైన అభ్యుదయ కవులు సభ్యులుగా కొనసాగారు. అలా ఆయా కవుల రచనలతో 1943 లో 'మాఘ్యమాల' కవితా సంపుటాన్ని వెలువరించారు. శ్రీశ్రీ కవిత్వ ప్రభావ స్ఫూర్తితో 1944 ఆగస్టులో బెల్లంకొండ రామదాసు, కుందుర్తి ఆంజనేయులు, ఏల్చూరి సుబ్రహ్మణ్యం ముగ్గురి కృషితో కవితా సంకలనం 'నయాగరా' వెలువడి అభ్యుదయ సాహిత్యోద్య మంలో అచ్చయిన తొలి కవితా సంపుటంగా నిలిచి పోయింది. అనిసెట్టి సుబ్బారావు, లక్ష్మీదేవిల పెళ్ళి కానుకగా గుంటూరులో విశ్వనాథ సత్యనారాయణ చేతుల మీదుగా ఆవిష్కృతం అయింది. నయాగర కవితా సంకలనంలో బెల్లంకొండ, ఏల్చూరి, కుందుర్తి ఒక్కొక్కరూ మూడేసి ఖండ కావ్యాలను రచించి 9 ఖండ కావ్యాల సంకలనంగా ప్రచురిం చారు. ఈ సంకలనంలో ...కుందుర్తి ఆంజనేయులు మూడు రచనలు... జయిస్తుంది, తరువాత, మన్యంలోబీ బెల్లంకొండ రామదాసువి... చెరసాల, నా గీతం, ఈ రోజునబీ అలాగే ఏల్చూరి సుబ్రహ్మణ్యం సంబంధిత....ప్రజాశక్తి, ఠాగూర్ చంద్ర సింగ్, విజయ ముద్ర ఖండ కావ్యాలు చేర్చ బడ్డాయి. 1956 లో తెలుగు సాహిత్యంలో ఏల్చూరి తొలి దీర్ఘ కవిత 'నవంబరు 7' విశాలాంధ్ర పత్రికలో వెలువడింది. తల్లావఝ్ఝుల శివశంకర శాస్త్రి తో ఉన్న సాన్నిహిత్యం వల్ల ఏల్చూరి నవ్య సాహిత్య పరిషత్తు సభ్యునిగా చేరి, సమావే శాలకు హాజరయ్యారు. ప్రగతిశీల ఉద్యమాలలో పాల్గొ న్నారు. వందలాది రష్యన్ కవితలను ఆంగ్ల మాధ్యమం ద్వారా అనువదించారు. నృసింహ స్వామి పై శతకం కూడా రాశారు. శ్రీరంగం శ్రీనివాసరావు, ఆరుద్ర, అబ్బూరి వరదరాజేశ్వర రావు సంయుక్తంగా రాసిన "మేమే" కావ్యాన్ని సుబ్రహ్మణ్యంకు అంకితం ఇవ్వడం విశేషం. ఆంగ్లంలో వచ్చిన వందలాది రష్యన్ కవితలను తెలుగులోకి అనువదించారు. సోవియట్ భూమి పత్రికలో సుమారు 40వేల పేజీల అనువాద రచన చేశారు అంటే ఆయన గొప్పతనం స్పష్టం అవుతుంది. అభ్యు దయ కవిగా, అంతకు మించి కృషి పాత్రికేయుడిగా ఆయన చేసిన కృషి సాటిలేనిది. 1940 లో నరసరావుపేటలో 'సన్యాసి' అనే పత్రికను స్థాపించి, ప్రముఖ కవుల రచనలు ప్రచురిం చారు. పొగాకు లోకం' (గుంటూరు) పత్రిక సంపాదకులుగా, 1941 – 42లో ఆంధ్ర సర్వస్వము సహాయ సంపాదకునిగా, 1954–56లో ఆకాశ వాణిలో స్క్రిప్టు రైటరుగా... రాయప్రోలు రాజశేఖర్, జలసూత్రం రుక్మిణనాథశాస్త్రి లతో కలిసి ఆకాశవాణికి ఎన్నో స్క్రిప్ట్ లందించారు. మద్రాస్‌లో సినిమా లకు పాటలు కూడా రాశారు. 1952లో సోషలిస్టు పత్రికలో, 1956లోనేత' పత్రిక సంపాద కులుగా, 1961–1988లో సోవియ ట్ భూమి పత్రిక సంపాదక వర్గంలో, తర్వాత మద్రాసులో అభ్యుదయ పత్రిక నిర్వాహకసభ్యునిగా పని చేశారు.ప్రముఖ వేణుగాన విద్వాంసులు ఏల్చూరి విజయ రాఘవరావు ఆయన సోదరులు కాగా, సాహితీవేత్త ఏల్చూరి మురళీధరరావు ఆయన కుమారుడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# కీర్తిచక్ర' పొందిన మొదటి సైనికేతరుడు వాడపల్లి

## ఆగస్టు 26....వాడపల్లి వెంకటేశ్వరరావు జయంతి




భారత దేశంలో విశిష్ట సేవలకు గుర్తింపుగా బహూకరించే అత్యున్నత పురస్కారాలలో 'కీర్తిచక్ర' రెండవది. అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించిన సైనికాధికారులకు మాత్రమే ఇచ్చే ప్రతిష్టాత్మక పురస్కారం అది. అయితే... ఓ సైనికేతర పౌరుడైన వాడిపల్లి వెంకటేశ్వరరావు మొట్ట మొదటి సారిగా ఆ పురస్కారాన్ని పొందడం వెనుక...ఆయన చేపట్టిన పదవీ బాధ్యతలు, అందించిన సేవలు, అన్నింటినీ మించి త్యాగనిరతి కారణాలు. భారతదేశంలో కీర్తిచక్ర పొందిన మొట్టమొదటి సైనికేతర పౌరుడైన వి.వి. రావు గా వాసికెక్కిన వాడపల్లి వెంకటేశ్వరరావు (ఆగష్టు 26, 1963 – జూలై 7, 2008) 1963 ఆగష్టు 26వ తేదీన తూర్పు గోదావరి జిల్లా ఆలమూరు మండలం నర్సిపూడి గ్రామంలో వాడపల్లి అప్పలాచార్యులు, సుభద్ర దంపతులకు జన్మించారు. పుట్టిన చోటే ఎస్.ఎస్.సి. వరకు చదివిన ఆయన.. ఎ.పి.ఆర్.జె.సి. నాగార్జున సాగర్ లో ఇంటర్మీడియట్ పూర్తిచేశారు.సివిల్ సర్వీసెస్ లో టాపర్ గా నిలవడమే తన ధ్యేయమని తన సిల్వర్ జూబ్లీ కళాశాల మిత్రులతో వి.వి.రావు చెప్పడం వల్ల అందరూ వి.వి.రావును పేరుతో కాకుండా "టాపర్" అని పిలిచేవారు. వాడ్రేవు చినవీరభద్రుడు కూడా ఆయన సహాధ్యాయి. చిన్నప్పటి నుంచే చదువులో చురుకుగా ఉండే ఆయన.. ప్రవేశ పరీక్ష రాసి, తద్వారా కర్నూలులో వుండే సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బి.ఎ.గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 1983 నుండి 1985 సం.లో హైదరాబాదులోని కేంద్రీయ విశ్వ విద్యాలయంలో రాజనీతి శాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. ఆ తర్వాత ఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయం నుండి ఎం.ఫిల్ పూర్తి చేశారు. తర్వాత అదే విశ్వ విద్యాలయం నుండి ఆసియా దేశాలతో భారతీయ సంబంధాలు అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ సంపాదించారు. వెంటనే 1990 సంవత్సరంలో సివిల్ సర్వీస్ పరీక్షలకు హాజరై ఆప్షంస్ లో ఐ.పి.ఎస్./ఐ.ఎఫ్.ఎస్. లకు అవకాశం వుండగా ప్రపంచ దేశాలతో భారత సంబంధాలపై పరిశోధన ద్వారా మంచి పట్టు వుండడంతో, రిటైర్డ్ హెల్త్ ఎక్స్ టెన్షన్ అధికారి అయిన తండ్రి వాడపల్లి అప్పలాచార్యులు సూచన ద్వారా ఇండియన్ ఫారిన్ సర్వీస్ ను ఎంపిక చేసుకున్నారు. తొలుత ఆయన జర్మనీలోని భారత రాయభార కార్యాలయంలో ఉద్యోగంలో చేరారు. ఆ తర్వాత శ్రీలంక, నేపాల్, భూటాన్, ఇండియా, అమెరికా వంటి దేశాలలో 1990 నుండి 2005 వరకు పనిచేశారు. ఆఫ్ఘనిస్తాన్ లోని రాయబార కార్యాలయంలో పని చేయడానికి చాలా మంది అయిష్టత వ్యక్తం చేయడంతో... ఆ స్థితిలో భారత ప్రభుత్వం ఆ పదవికి వి.వి.రావును నిర్ణయించింది. విధి నిర్వహణలో మంచి పట్టుదల, సమర్థత కలిగిన అధికారిగా గుర్తింపు పొందిన ఆయన.. ప్రభుత్వం తనకు నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను ప్రతిష్టాత్మకంగా, ప్రత్యేకించి సవాలుగా తీసుకొని అక్కడ విధులలో చేరారు. అక్కడి కాబూల్ లోని భారత రాయబార కార్యాలయంలో కన్సులేట్ గా 3 సంవత్సరాలు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. ఆఫ్ఘనిస్తాన్ లోని ముఖ్యమైన భాషలలో ఒకటైన "దారి" భాషలో చక్కటి పట్టువున్న వి.వి.రావు భారత్, ఆఫ్ఘన్ ఇరుదేశాల సంబంధాలను, మైత్రీ బంధాన్ని ఇనుమడింప జేశారు. 2008 జూలై 7వ తేదీన కాబూల్ లోని భారత రాయబార కార్యాలయం ముందు జరిగిన తీవ్రవాదుల ఆత్మాహుతి దాడిలో మొత్తం 41 మంది మృతి చెందగా... ఆ దూరదృష్ట అవాంఛిత దుర్ఘటనలో భారత రక్షణ విభాగానికి చెందిన బ్రిగేడియర్ మెహతాతో పాటు మరో ముగ్గురు కార్యాలయ సిబ్బంది మరణించారు. అలా మరణించిన వారితో పాటుగా, భారతీయ దౌత్యవేత్త అయిన 44 యేళ్ళ వాడపల్లి వెంకటేశ్వరరావు కూడా వున్నారు. ఆ విధంగా విధి నిర్వహణలో అసువులు బాసి, అమరులైన ఆయనకు అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శించిన సైనికాధికారులకు ఇచ్చే కీర్తిచక్ర పురస్కారాన్ని భారత ప్రభుత్వం ప్రకటించింది. ఆ విధంగా కీర్తిచక్రతో గౌరవించబడిన మొట్టమొదటి సైనికేతర భారతీయుడిగా ఆయన గుర్తింపు పొందారు. వి.వి.రావు పదవికి సమానమైన హోదా కలిగిన భారతీయ సాంస్కృతిక సంస్థ, బ్యాంకాక్ కు డైరెక్టర్ గా పదవీ బాధ్యతలను ఆయన ధర్మపత్ని వాడపల్లి మాలతీరావుకు భారత ప్రభుత్వం అప్పగించి గౌరవించింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# భారత 'అగ్ని-5'కి చుచ్చుపోసుకుంటున్న పాకిస్తాన్.. కాళ్లబేరం




భారత్ ఇటీవల అగ్ని–5 క్షిపణిని విజయవంతంగా పరీక్షించిన తర్వాత పాకిస్తాన్ రాజకీయ వర్గాల్లో ఆందోళన మొదలైంది. భారత్ సైనిక శక్తిని చూసి ఒకవైపు భయపడుతూ.. మరోవైపు చర్చల కోసం విజ్ఞప్తి చేయడం పాకిస్తాన్ ద్వంద్వ వైఖరిని స్పష్టం చేస్తోంది.

**–భద్రతా ఆరోపణలు, ఆందోళన....** అగ్ని–5 పరీక్ష తర్వాత పాకిస్తాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి షఫ్కత్ అలీ ఖాన్ మాట్లాడుతూ ఈ క్షిపణి కేవలం పాకిస్తాన్‌కే కాకుండా ప్రపంచ శాంతి, స్థిరత్వానికి కూడా ముప్పు అని ఆరోపించారు.

అంతర్జాతీయ సమాజం భారత్ సైనిక శక్తి పెరుగుదలపై మౌనం వహించడం సరికాదని ఆయన విమర్శించారు. పాకిస్తాన్ భయం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తుంది, ఎందుకంటే అగ్ని–5 క్షిపణి దాదాపు 5,000 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించగలదు.

**–చర్చల కోసం మృదువైన స్వరం...** భారత్ శక్తిని చూసి భయపడుతున్న పాకిస్తాన్, మరోవైపు తమ వైఖరిని మార్చుకున్నట్లుగా వ్యవహరిస్తోంది. పాకిస్తాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ మాట్లాడుతూ కాశ్మీర్‌తో సహా అన్ని అంశాలపై భారత్‌తో మాట్లాడటానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఉగ్రవాదం నుంచి వాణిజ్యం వరకు అన్ని రంగాల్లో సహకారం కావాలని ఆయన కోరారు. ఇది పాకిస్తాన్ రాజకీయ నాయకులు తమ దేశ ప్రజలకు, అంతర్జాతీయ సమాజానికి ఒక వైఖరి చూపించడానికి, అసలు విషయానికి దూరంగా మాట్లాడటానికి ప్రయత్నిస్తున్నారని విశ్లేషకులు చెబుతున్నారు.

**–భారత్ స్పష్టమైన వైఖరి...** పాకిస్తాన్ ద్వంద్వ వైఖరిపై భారత్ చాలా స్పష్టంగా ఉంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే ఏ దేశంతోనూ భారత్ చర్చలు జరపదు అని స్పష్టం చేశారు. చర్చలు జరగాలంటే ముందుగా ఉగ్రవాదం ఆగిపోవాలని ఆయన అన్నారు. అలాగే పాక్ ఆక్రమిత కాశ్మీర్ సమస్య, సరిహద్దు ఉగ్రవాదం సమస్య పరిష్కారం అవ్వాలని భారత్ పదేపదే చెబుతోంది.

**–పాక్ మాయగాళ్ల ఆట...** పాకిస్తాన్ తరచుగా క్రీడలు, సంస్కృతి, రాజకీయాలను కలపవద్దని చెబుతూ ఉంటుంది. కానీ షాంఘై సహకార సంస్థ సమావేశంలో భారత్–పాక్ నేతల మధ్య ఎలాంటి ద్వైపాక్షిక సమావేశం జరగదని భారత్ స్పష్టం చేసింది. భారత్ యొక్క బలమైన సైనిక శక్తి, దౌత్య వైఖరి పాకిస్తాన్‌పై ఒత్తిడిని పెంచుతోంది. పాక్ ఎన్ని చర్చల పిలుపులు ఇచ్చినా ఉగ్రవాదాన్ని ఆపకుండా, PoK ఆక్రమణను వదులుకోకుండా ఆ పిలుపులు కేవలం రాజకీయ మాయగాళ్ల ఆటగానే మిగిలిపోతాయి. భారత్ శక్తి ప్రదర్శన పాకిస్థాన్‌ను గట్టిగా కుదిపేసింది. ఒకవైపు భారత్‌పై ఆరోపణలు చేస్తూనే, మరోవైపు చర్చలు కోరుకోవడం పాక్ నిజ స్వరూపాన్ని బయటపెడుతోంది.

# పుతిన్ మంట.. రగిలిపోతున్న ట్రంప్

ఉక్రెయిన్–రష్యా యుద్ధం మరింత సంక్లిష్ట దశలోకి ప్రవేశించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా చేసిన వ్యాఖ్యలు ఇందుకు నిదర్శనం. పుతిన్ తీసుకుంటున్న నిర్ణయాలతో తాను సంతోషంగా లేనని ఆయన స్పష్టం చేశారు. రష్యా%–%ఉక్రెయిన్ అధ్యక్షులు పుతిన్, జెలెన్‌స్కీల మధ్య శాంతి చర్చలు జరిపించడం చాలా కష్టమైన పని అని ట్రంప్ పేర్కొన్నారు. "నూనె, వెనిగర్‌లను కలపడం లాంటిదే ఈ ప్రక్రియ" అని ఆయన వ్యాఖ్యానించారు. రాబోయే రెండు వారాల్లో పుతిన్, జెలెన్‌స్కీ వైఖరిని సమీక్షిస్తానని, అప్పటికీ శాంతి ఒప్పందం కుదరకపోతే తానే నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. ఆ నిర్ణయం భారీ ఆంక్షల రూపంలోనా.. లేక సుంకాల రూపంలోనా ఉంటుందో తరువాత ప్రకటిస్తానని ట్రంప్ హెచ్చరించారు. రష్యా ఉక్రెయిన్‌లోని అమెరికా సంస్థలపై దాడి జరిపిన



విషయంపై కూడా ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలు కొనసాగితే మాస్కోకు మరింత గట్టి ఆంక్షలు తప్పవని ఆయన అన్నారు.

**–ఫర్నీచర్ దిగుమతులపై సుంకాల పరిశీలన...** అంతర్జాతీయ యుద్ధ పరిస్థితులపై హెచ్చరికలు జారీ చేసిన ట్రంప్, ఆర్థిక రంగంలో కూడా దూకుడు చూపిస్తున్నారు. అమెరికాలోకి దిగుమతి అవుతున్న ఫర్నీచర్‌పై భారీ సుంకాలు విధించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్టు ఆయన ప్రకటించారు. "మేము ఫర్నీచర్ దిగుమతులపై సుంకాల విధింపు అంశంపై దర్యాప్తు ప్రారంభించాం. 50 రోజుల్లో విచారణ పూర్తవుతుంది" అని ట్రంప్ తన సోషల్ మీడియా పోస్టులో వెల్లడించారు. అయితే సుంకాల శాతం ఎంతమేరకు ఉంటుందన్నది ఇంకా నిర్ణయించలేదన్నారు.నార్త్ కరోలినా, సౌత్ కరోలినా, మిషిగన్‌లలో తిరిగి ఫర్నీచర్ పరిశ్రమకు ఊపునిచ్చేందుకే ఈ చర్యలు చేపడుతున్నామని ట్రంప్ వివరించారు. పుతిన్ చర్యలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ట్రంప్.. రష్యా, ఉక్రెయిన్ మధ్య శాంతి చర్చలు విఫలమైతే భారీ ఆంక్షలు తప్పవని హెచ్చరించారు.

మరోవైపు అమెరికా అంతర్గత పరిశ్రమలకు మద్దతుగా దిగుమతులపై సుంకాలు విధించే ప్రయత్నాలు ప్రారంభించారు. అంతర్జాతీయ, ఆర్థిక రంగాలలో ట్రంప్ కొత్త దూకుడు రాబోయే రోజుల్లో మరిన్ని పరిణామాలకు దారితీయనుంది.

# భారత్ - చైనా వాణిజ్యంలో పెరుగుదల

భారత్, చైనాల మధ్య వాణిజ్యం కొత్త పుంతలు తొక్కుతోంది. 2025–26 ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లో (ఏప్రిల్–జూలై), భారత్ నుంచి చైనాకు ఎగుమతులు గణనీయంగా పెరిగాయి. ఇది ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు బలపడుతున్నాయని స్పష్టం చేస్తోంది.

**–ఎగుమతుల్లో గణనీయమైన పెరుగుదల....** అధికారిక గణాంకాల ప్రకారం, ఏప్రిల్ నుంచి జూలై వరకు భారత్ నుంచి చైనాకు ఎగుమతులు 20 శాతం పెరిగి $5.76 బిలియన్లకు (సుమారు రూ.50,112 కోట్లు) చేరుకున్నాయి. ఈ పెరుగుదల గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే స్థిరంగా ఉంది. మే నెలలో అత్యధికంగా %వి%1.63 బిలియన్ల ఎగుమతులు నమోదయ్యాయి, ఇది భారత్ వాణిజ్య వృద్ధికి సానుకూల సంకేతం.

**– ముఖ్య రంగాల్లో వృద్ధి...** ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో చైనాలో భారతీయ ఉత్పత్తుల డిమాండ్ పెరిగింది. ముఖ్యంగా కొన్ని కీలక రంగాల్లో అసాధారణమైన వృద్ధి కనిపించింది. పెట్రోలియం ఉత్పత్తులు దాదాపు రెట్టింపు పెరిగి $883 మిలియన్లకు చేరుకున్నాయి. ఎలక్ట్రానిక్స్



మూడు రెట్లు పెరిగి $521 మిలియన్లకు చేరాయి. రసాయనాలు 16.3% వృద్ధితో $335.1 మిలియన్లకు పెరిగాయి. జెమ్స్ అండ్ జ్యువెలరీ 72.7% పెరుగుదలతో అత్యధిక వృద్ధి సాధించాయి. ఈ గణాంకాలు భారత్ ఎగుమతుల సామర్థ్యం బలోపేతం అవుతోందని, అంతర్జాతీయ మార్కెట్లో భారత్ పోటీ పడుతోందని సూచిస్తున్నాయి.

**– దిగుమతులు, దౌత్య సంబంధాలు...** భారత్ చైనా నుంచి దిగుమతులు కొనసాగిస్తోంది. ముఖ్యంగా ఫార్మాస్యూటికల్స్, సెమీకండక్టర్లు, యంత్రాలు, ఎలక్ట్రానిక్స్ వంటి కీలక వస్తువుల కోసం కొనసాగుతున్నాయి. ఇటీవల భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ మధ్య జరిగిన చర్చలు సానుకూలంగా జరగడం, భవిష్యత్తులో ఇరు దేశాల మధ్య ఆర్థిక, రాజకీయ సంబంధాలు మరింత బలపడతాయని సూచిస్తున్నాయి. ప్రపంచ వాణిజ్య అనిశ్చితుల మధ్య కూడా భారత్–చైనా వాణిజ్యం కొత్త అవకాశాలను సృష్టిస్తోంది. ఈ వృద్ధి ధోరణి కొనసాగితే, రాబోయే రోజుల్లో ఇరు దేశాల ఆర్థిక సంబంధాలు మరింత స్థిరపడతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

చురకలు

## సంపాదకీయం

# భారత్‌ను దూరం చేసుకోవడం అమెరికాకు చేటు!


అమెరికా మాజీ విదేశాంగ మంత్రి జాన్ కెర్రీ, రిపబ్లికన్ నేత నిక్కీ హేలీ చేసిన వ్యాఖ్యలు భారత్–అమెరికా సంబంధాల ప్రాముఖ్యతను మరింతగా ఎత్తిచూపాయి. భారత్ లాంటి వ్యూహాత్మక మిత్రదేశాన్ని అమెరికా దూరం చేసుకోవడం సరికాదని వారు హెచ్చరించారు. జాన్ కెర్రీ తాజాగా మాట్లాడుతూ.. "అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దౌత్యంలో సహకారం కంటే ఆదేశాలు, ఒత్తిడి ఎక్కువ చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. భారత్, అమెరికా వంటి మహా దేశాలు ప్రజలకు అల్టిమేటంలు ఇవ్వడం ద్వారా కాదు, పరస్పర గౌరవంతో, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలి. ఒబామా పాలనలో సహకారం ప్రధానంగా ఉండేది. కానీ ఇప్పుడు విభేదాలు పెరుగుతున్నాయి" అని వ్యాఖ్యానించారు.

**– నిక్కీ హేలీ సూచన...** రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై ట్రంప్ చేసిన అభ్యంతరాలను భారత్ సీరియస్‌గా తీసుకోవాలని నిక్కీ హేలీ సూచించారు. "అమెరికా–భారత్ మధ్య ఉన్న దశాబ్దాల స్నేహం, విశ్వాసం ఇలాంటి ఒడిదుడుకులను అధిగమించే బలమైన పునాది. వాణిజ్యం, చమురు వంటి అంశాల్లో బలమైన చర్చలు జరగాలి. చైనాను ఎదుర్కోవడంలో అమెరికాకు భారత్ మిత్రుడిగా ఉండటం అత్యంత కీలకం" అని ఆమె ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థ. యువ జనాభాతో భవిష్యత్తులో చైనాను అధిగమించగలదు. ఇలాంటి మిత్రదేశాన్ని ఆంక్షలతో, ఒత్తిడితో దూరం చేసుకోవడం అమెరికాకు విపత్కరం అవుతుంది" అని వ్యాఖ్యానించారు.

**–ట్రంప్ వైఖరిపై విమర్శలు....** రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులపై అమెరికా తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. "ఈ చమురు సొమ్ము ఉక్రెయిన్ యుద్ధానికి ఉపయోగపడుతోందని" ట్రంప్ సలహాదారు పీటర్ నవారో ఆరోపించారు. అంతేకాక భారత్ దిగుమతులపై ట్రంప్ 25 శాతం పెనాల్టీలు విధించడం ఉద్రిక్తతలకు దారి తీసింది. దీనిపై భారత వాదన ఏమిటంటే చమురు ధరలు పెరిగితే 150 కోట్ల మంది ప్రజలపై భారం పడుతుంది. తమ అవసరాల కోసం చమురు కొనుగోలు చేయడం తప్పు కాదని న్యూఢిల్లీ స్పష్టం చేస్తోంది. భారత్–అమెరికా సంబంధాలు కేవలం వ్యాపార, వాణిజ్య అంశాలకే పరిమితం కావు. ఇవి వ్యూహాత్మక భాగస్వామ్యం, భద్రతా సహకారం, ప్రజాస్వామ్య విలువలపై ఆధారపడి ఉన్నాయి. ఇలాంటి సమయంలో ట్రంప్ విధానాలు ఉద్రిక్తతలకు దారితీస్తే, చైనాకు మాత్రమే లాభం చేకూరుతుంది. భారత్‌ను మిత్రదేశంగా నిలుపుకోవడం అమెరికాకు కూడా అత్యంత అవసరం అని నిపుణులు ఏకాభిప్రాయంతో చెబుతున్నారు.

# పురాణ పురుషులు... మల్లాది చంద్ర శేఖరులు

## భాద్రపద శుక్ల తృతీయ... అభినవ వ్యాస మల్లాది చంద్రశేఖర శాస్త్రి జయంతి సందర్భంగా



ఆయన పురాణ ప్రవచనం గావిస్తుంటే పండిత పామరులు మంత్రముగ్ధులయి తీరాల్సిందే. ధర్మసందేహాలు కార్యక్రమంలో శ్రోతల సందేహాలకు సమాధానాలు చెబుతుంటే కార్యక్రమంలో లీనం కావాల్సిందే. భద్రాచాల సీతారాముల కల్యాణానికిగాని, తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలకు గాని, శ్రీశైలంలో భ్రమరాంబా మల్లికార్జునుల కల్యాణానికి గానీ వ్యాఖ్యానం చేస్తుంటే శ్రోతలు తమ చెవులు అప్పగించాల్సిందే. ఆయన గళం నుంచి వెలువడే ప్రతిమాటా సప్రామాణికం, సవ్యాఖ్యాన సహితం...ఆయనే అభినవ వేదవ్యాస మహర్షిగా లబ్ద ప్రతిష్టులైన పౌరాణిక సార్వభౌమ మల్లాది చంద్ర శేఖర శాస్త్రి. మల్లాది ప్రముఖ పండితులు, పురాణ ప్రవచకులు. ఆయన స్వరంలోని మాధుర్యం, రామాయణ, భారత, భాగవతాలపై ఆయనకున్న పట్టు కారణంగా పురాణ ప్రవచన ప్రముఖులలో ఆయన ప్రత్యేకతను సంతరించు కున్నారు. తన పదిహేనవ ఏట నుంచి ప్రారంభించిన ఈ ప్రవచన యజ్ఞం అసిధారావ్రతంగా కొనసాగుతునే ఉంది. సహస్ర చంద్ర దర్శనం చేసుకున్నా, శత జయంతి వేడుకల సమయాన్ని సమీపిస్తున్నా, జీరవోని గొంతుతో, ఉపన్యాసం, హరికథ, నాటకం, పురాణం కలిపి శ్రోతలను ఆకట్టుకునే విధంగా చేస్తున్న ప్రవచనాలు ఆయన అసమాన ప్రతిభకు నిదర్శనాలు. మల్లాది దక్షిణామూర్తి దంపతులకు 1925 ఆగస్టు 22న భాద్రపద శుక్ల తృతీయ నాడు అర్ధరాత్రి, అంటే తెల్లవారితే వినాయక చవితి అనగా సనాతన సత్సంప్రదాయం గల కుటుంబంలో ఆయన జన్మించారు. తాతగారు మల్లాది రామకృష్ణ విద్వత్ చయనుల వద్ద పెరిగిన క్రమంలో, నాయనమ్మ కృష్ణవేణి సోమిదమ్మ సాకగా, తాతగారే ఉపనయన సంస్కారం చేశారు. ఆయన వద్దనే తర్క ప్రకరణాలు, శ్రౌతస్మార్తాలు అభ్యసించారు. ఆయన పితృదేవులు దక్షిణామూర్తి శాస్త్రి పుష్పగిరి ఆస్థాన పండితులు. ఆర్షసంప్రదాయాన్ని ఆయన వద్దనే అలవరచుకున్నారు. పెత్తండ్రి వీరరాఘవ శాస్త్రి తర్కవేదాంత పండితులు. పినతండ్రి హరిశంకర శాస్త్రి తెనాలిలో వేదవిద్యా పరీక్షాధికారిగా పని చేసేవారు. పినతండ్రి వద్దే వేదాధ్యయనం గావించి, కంభంపాటి రామ్మూర్తి శాస్త్రి వద్ద పూర్వ మీమాంస, వ్యాకరణం నేర్చుకున్నారు. తెలుగు మాత్రం వీధిబడిలో చదువు కున్నారు. తాతగారికి, మనమడు పురాణ ప్రవచనం చెప్పాలని కోరిక. ఆంగ్ల విద్య అభ్యసిస్తే, ఉద్యోగం చేస్తానంటారని ఎలాంటి పరీక్షలు రాయ నివ్వకుండా తాత జాగ్రత్త పడ్డారు. అయితే శాస్త్రికి పురాణాలు చెప్పడం ఇష్టం ఉండేది కాదు. అది గ్రహించిన తాతగారు "చూడు నాయనా, పురాణ ప్రవచనం చెప్పాలంటే సంస్కృత వ్మాయం తెలిసి ఉండాలి. నిశిత పరిశీలన కావాలి. అన్వయం చెప్పగలిగి ఉండాలి. వేదాంతం, తర్కం, ఛందస్సు తెలిసుండాలి. కాబట్టి దీన్ని అంత తేలికగా తీసేయకు" అని చెప్పేవారు. పదిహేడవ యేట తాత కాలం చేశారు. ఆయన దూరమైనా ఆయన సంకల్పం మాత్రం ఎప్పుడూ చంద్రశేఖర శాస్త్రిని అంటిపెట్టుకునే ఉంది. కొంత కాలం తరువాత బెజవాడ వెళ్లి వేదాంత శాస్త్రం చదవాలనే కోరికతో అమరావతి నుంచి గుంటూరు వెళ్ళారు. బస్టాండు కొచ్చాక పరిచయస్థులు కొందరు కనిపించి "పుష్పగిరి పీఠాధిపతులు ఇప్పుడు నరసరావు పేటలో ఉన్నారు. త్వరలో ఆయన మకాం మార్చేస్తారట. ఈలోగా నువ్వొకసారి వెళ్లి ఆయన దర్శనం చేసుకోవచ్చు" అని సలహా ఇచ్చారు. దాంతో వెంటనే నరసరావు పేటకు వెళ్ళి, స్వాములవారి దర్శనం చేసుకోగానే పీఠాధిపతులు 'నువ్వు అమరావతిలో పురాణ ప్రవచనం చక్కగా చెప్పావని తెలిసింది. నాకు కూడా వినాలని ఉంది, ఇవ్వాళ ఇక్కడ పురాణం చెప్పు" అన్నారు. ఆ మాటలను ఆదేశంగా తీసుకుని ఆయన ముందు వాల్మీకి రామాయణం చెప్పారు. స్వామివారు చాలా సంతోషించి, నెలకు 40 రూపాయల గ్రాసం మీద పుష్పగిరి ఆస్థానంలో పురాణ పండితునిగా నియమించారు. ఆయనతో పాటే ఊరూరా తిరుగుతూ ఏడాదిన్నర పాటు చంద్ర శేఖర శాస్త్రి పురాణ ప్రవచనం చెప్పారు. తర్వాత పెత్తండ్రి మల్లాది వీరరాఘవశాస్త్రి బెజవాడలో బ్రహ్మ సత్రయాగం జరుపుతుంటే ఆయన కోరిక మేరకు అక్కడ సుమారు సంవత్సరం పాటు ప్రవచనం చేశారు. ఆయన ఇరవై అయిదవ ఏట సీతారామ ప్రసన్నతో వివాహం జరిగింది. సరిగ్గా ఏడాది తర్వాత అంటే 1951లో ఆయనకు కొడుకు పుట్టాక తాతపై గల గౌరవంతో, జ్ఞాపకార్థం రామకృష్ణ అని పేరుపెట్టు కున్నారు. దివంగత ప్రధాని పాముల పర్తి నరసింహారావు, దివంగత ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, వంటి రాజకీయ ప్రముఖులతో పాటు చిత్తూరు వి.నాగయ్య, ఘంటసాల, ఎస్వీరంగారావు, కన్నాంబ వంటి వెండితెర నటీ నటులు ఆయన ప్రవచనాలను ఎంతో ఇష్టపడేవారు. ఒక సందర్భంలో చిత్తూరు నాగయ్య ఇంటికి పిలిచి భోజన వస్త్రాలతో సత్కరించి, చేతికి స్వర్ణకంకణం తొడగడం శాస్త్రి మరచి పోలేని జ్ఞాపకం. చాలామంది సినిమాలలో నటించమని అడిగితే ఇష్టం లేక తిరస్కరించారు. ఆయన ప్రవచనం చెబుతుండగా శ్రోతలు వింటున్నట్లుగా ఉండే దృశ్యాన్ని చిత్రీకరించాలని కొందరు దర్శకులు ప్రయత్నాలు చేసినా, ఎందుకనో అది కూడా వీలు పడక పోవడం యాదృచ్ఛికం. వందలాది రామాయణ, మహాభారత, భాగవత ప్రవచనాలూ నిర్వహించడమే కాకుండా, ప్రతియేటా ఉగాది నాడు పంచాంగ శ్రవణం చేసేవారు. దూరదర్శన్‌లో, సప్తగిరి చానల్‌లో ప్రవచనాలు కొనసాగించే ప్రయత్నం చేశారు. వయసు మీద పడుతుండడంతో, శారీరిక శక్తి సన్నగిల్లి, ప్రయాణాలు చేయ లేకుండా ఉన్న కారణంగా 2011 జనవరి నుంచి పురాణ ప్రవచనాలు చెప్పడం క్రమంగా తగ్గించారు. శ్రీవేంకటేశ్వర భక్తిచానల్, సప్తగిరి చానల్ వారు తమ చానల్‌లో ప్రవచనం చెప్పవలసిందే అని పట్టుబట్టడంతో తమ ఇలవేల్పు పట్ల ఉన్న భక్తి, గౌరవం మేరకు వారిని కాదనలేక పోయారు. శోకరసమైతే దుఖంలో దుఃఖ సాగరంలో, హర్ష దాయకమైతే ఆనందంతో మమేకమై పరవశించి పోయే ఆయన ప్రవచనంలో లీనమయ్యే తీరు దశాబ్దాల ప్రవచన కాలంలో శ్రోతల, ప్రేక్షక జన బాహుళ్యానికి సన్నిహితంగా ఉంచింది. మల్లాది చంద్రశేఖరశాస్త్రి సుదీర్ఘ పురాణ ప్రవచన ప్రస్థానంలో ఎందరో ప్రముఖులు, ప్రముఖ సంస్థలతో లెక్కలేనన్ని సన్మానాలు, సత్కారాలు, బిరుదులు పొందారు. అందులో ప్రముఖంగా తిరుమల తిరుపతి దేవస్థానాలలో శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో స్వామి వారి కల్యాణ వ్యాఖ్యాతగా అభినవ వ్యాస బిరుదును పొందారు. శృంగేరి పీఠాధిపతి చంద్రశేఖర స్వామి ఆశీర్వచనంతో సవ్యసాచి బిరుదును, భీముని పట్నం సద్గురు శివానందమూర్తి నెలకొల్పిన సనాతన ధర్మట్రస్ట్ ద్వారా ఎమినెంట్ సిటిజన్ అవార్డును అందుకోవడమే కాక మాజీ ప్రధాని పి.వి నరసింహారావుతో సత్కారం అందుకున్నారు. 2005లో ప్రతిష్ఠాత్మక రాజా–లక్ష్మీ అవార్డు ద్వారా వచ్చిన లక్ష రూపాయల నగదును సనాతన ధర్మట్రస్టుకు విరాళమిచ్చారు. పురాణ ప్రవచన సాంప్రదాయం కొనసాగాలనే తపనతో, ఎందరో శిష్యులను తమ ఆశయానికి అనుగుణంగా తీర్చిదిద్దిన పరమ భాగవతో త్తములు చంద్రశేఖర శాస్త్రి... 96 ఏళ్ళ వయసులో 14, జనవరి, 2022న వయోభారంతో పాంచభౌతిక కాయాన్ని వదిలి శివైక్యం చెందారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# సమస్త పాప హారిణి గౌరీ దేవి - సమస్త పాప హారిణి హారితాళికా గౌరీ వ్రతం




భారతావనిలో అనాదిగా వివిధ పండగలతో పాటు, వ్రతాల, నోముల ఆచరణ సత్సాంప్ర దాయంగా ఉంది. ప్రతి వ్రతం ప్రత్యేకతను సంతరించుకుని, ప్రత్యేక ఆచారాలు ఏడాది పొడుగునా ఆచరించ బడతాయి. అలాంటి వాటిలో కుటుంబికులు సౌభాగ్యవతులు, కన్యలు ఆచరించే హరి తాళికా గౌరీ వ్రతం ఒకటి. శ్రమ లేకుండా సంపూర్ణ ఫలమిచ్చే వ్రతం గురించి చెప్పా లని కోరగా, శంకరుడు, పార్వతికి ఈవ్రత విధానాన్ని ఉపదేశించినట్లు పురాణ కథనం. ఈ వ్రతాచరణ ద్వారానే గిరి పుత్రిక తనను పొందినట్లు పరమేశ్వరుడు, పార్వతికి స్పష్టం చేసినట్లు కథనం. సమస్త పాపాలను హరించ గలిగే హరితాళిక వ్రతాచరణ గురించి ధర్మసింధు వివరిస్తుంది. మహా రాష్ట్రలో, స్మార్త తెగకు చెందిన స్త్రీలు, రాజపుటానాలో భాద్రపద శుద్ధ తదియ నాడు సౌభాగ్య వంతులు, హరితాళిక వ్రతం శాస్త్ర విధిగా చేస్తుండగా, వంగ దేశంలో ఈ వ్రతాన్ని మాఘ మాసంలో వరద చతుర్థి పేరున చేస్తారు. ఉండ్రాళ్ళ తద్దిలో హరితాళికా ప్రతి అనురూపం ఉంది. వ్రతోత్సవ చంద్రిక ఆధారంగా వట సావిత్రి వ్రతం ఉన్న శిక్షే ఇందులో ఉంది. పార్వతీ దేవికి ఒక రాచ కూతురు, పూర్తి చేయని నోమును పూర్తి చేయడానికి, భాద్రపద శుద్ధ తదియ నాడు పదహారు కుడుములు వండి నైవేద్యం పెట్టి, నోము పట్టినందున ఈదినానికి "పదహారు కుడుముల తద్ది"యని పేరు తెలుగు నాట వచ్చింది. భాద్రపద శుద్ధ తృతీయ సందర్భంగా ఉదయాత్పూర్వమే నిద్ర లేచి, సువాసినులు మంగళ స్నానాలు ఆచరించి, పూజా గృహాన్ని గోమయంతో శుద్ధి చేసి, ముగ్గులు పెట్టి, సఖీ యుక్తమైన పరమ శివుని చిత్ర పటాన్ని, లేదా శివలింగాన్ని ఉంచి, అక్షతలు, పసుపు, తమల పాకులు, వక్కలు, వత్తులు, దారాలు, అగరువత్తులు, పంచామృతాలు, నాణేలు తదితర పూజా సామగ్రితో ఉత్తరేణి ఆకుల కంకణాలు ధరించి, ఉత్తరేణి ఆకులతో ప్రత్యేక పూజలు నిర్వహించడం అచారం. ముఖ్యంగా ఈరోజు చప్పిడి వంటకాలు ఉప్పు, పులుపు, కారం, నూనె రహిత తిను బండారాలు మాత్రమే ఆరగించే సాంప్రదాచారణలో భాగంగా, ముత్తయి దువలను ఆహ్వానించి, విధివిధాన సామూహిక పేరంటాలు జరుపు కుంటారు.

రాత్రి జాగరణ చేస్తారు. భాద్రపద శుక్ల తదియ నాడే మునువులలో నాలుగవ వాడై, సమస్త భూమండలాలాన్ని జయించి, మనువైన తామస మనువు పేరు తామస మన్వంతర రాది పేరు వచ్చిందని భావించ బడుతూ, గజేంద్ర మోక్ష కథ తామస మన్వంతర మందే జరిగి నట్లు భాగవత పురాణం తెలుపు తున్నది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# పోలియో టీకా ఆవిష్కర్త సాబిన్ - ఆగష్టు 26...ఆల్బర్ట్ బ్రూస సాబిన్ జయంతి

పోలియో అని సాధారణంగా పిలవబడే 'పోలియోమైలెటిస్' అనే వ్యాధి వైరస్ ద్వారా కలిగి, నాడీ మండలాన్ని దెబ్బ తీసే ఒక వ్యాధి. పోలియో పేరు అందరికీ సుపరిచితమైందే. మనం ఇది మెదడు లోతుల లోనూ, వెన్నుపాము లోనూ ఉండే నాడీకణాలకు వచ్చే వ్యాధి. ఈ వ్యాధిని కలిగించేది "పోలియో మైలేలిటీస్" వైరస్. ఇవి చాలా సూక్ష్మమైన వైరస్లు. ఈ వైరస్లు నోటిద్వారా శరీరంలోకి చేరతాయి. నాడీ కణా లలో స్థావరం ఏర్పరచుకుంటాయి. మెదడులో, వెన్నుపాములో ఉండి శరీరానికి ఆదేశాలు పంపే చాలా కణాలను నాశనం చేయటానికి ప్రయత్ని స్తాయి. వైరస్ల వల్ల కొద్దిగా జ్వరం, గొంతునొప్పి, తలనొప్పి, వికారం, వాంతులు, బేదులు మొదలైన లక్షణాలు ముందుగా కనిపిస్తాయి. దీనిని "పసిపిల్లల పక్షవాతం" అని కూడా అంటారు. దీనిని రాకుండా నిరోధించ వచ్చు. అందుకే చిన్న పిల్లలకు టీకాలు వేస్తారు. అంగవైకల్యం కలిగించే ఈ వ్యాధి రాకుండా ఉండటానికి టీకామందు కనిపెట్టిన వైద్యశాస్త్రవేత్త ఆల్బర్ట్ బ్రూస్ సాబిన్. ఆల్బర్ట్ బ్రూస్ సాబిన్ (జననం అబ్రామ్ శాపర్‌స్టీన్ బీ 1906 ఆగస్టు 26 – 1993 మార్చి 3) ఒక పోలిష్ అమెరికన్, వైద్య పరిశోధకుడు, నోటి పోలియో వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసి ప్రసిద్ధి చెందిన వ్యక్తి. ఇది పోలియో వ్యాధిని నిర్మూలించడంలో కీలక పాత్ర పోషించింది. 1969–72లో, అతను ఇజ్రాయెల్‌లోని వైజ్మాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అధ్యక్షుడిగా పనిచేశాడు. 1930 లో, అతను యునైటెడ్ స్టేట్స్ పౌరుడు అయ్యాడు. 'సాబిన్ న్యూయార్క్ యూనివర్సిటీలో చదివి 1931లో మెడికల్ డిగ్రీ తీసుకున్నాడు. 1931–1933 వరకు న్యూయార్క్ నగరంలోని బెల్లేవ్ హాస్పిటల్‌లో అంతర్గత మెడిసిన్, పాథాలజీ, శస్త్రచికిత్సలో శిక్షణ పొందాడు. 1934 లో ఇంగ్లాండ్‌లోని ది లిస్టర్ ఇన్స్టిట్యూట్ ఫర్ ప్రివెంటివ్ మెడిసిన్‌లో పరిశోధనలు జరిపాడు. తరువాత రాక్‌ఫెల్లర్ ఇన్స్టిట్యూట్ ఫర్ మెడికల్ రీసెర్చ్ లో చేరాడు. ఆ సమయంలో, అతను ముఖ్యంగా అంటు వ్యాధుల పరిశోధనపై, తీవ్రమైన ఆసక్తిని పెంచుకున్నాడు. 1971లో సిన్సినాటి యూనివర్సిటీలో ఎమెరైటిస్ ప్రొఫెసర్ అయ్యాడు. 1974 నుండి 1982 వరకు సౌత్ కరొలినాలో ఉన్న చార్లెస్టన్ యూనివర్సిటీలో పరిశోధక ప్రొఫెసర్ గా పని చేశాడు. ఆకాలంలో పోలియో ఎంతో మందిని వికలాంగులను చేయడం చూసి, ఆ వ్యాధి కలిగించే వైరస్ల మీద పోరాడాలని నిశ్చయించు కున్నాడు. పోలియో వ్యాధిని కలిగించే వైరస్ మూడు రకాలుగా ఉంటుంది. సాబిన్ మిలియన్ల కొద్దీ పోలియో వైరస్ లను పెంచి, మొదట దానిని కోతుల మెదళ్లలో ఎక్కించి పరిశీలించాడు. చంపిన వైరసన్ను ఇంజెక్షన్ ద్వారా ఎక్కించటం కంటే సజీవమైన, బలహీన పరచ బడిన వైరసన్ను నోటి ద్వారా ఇచ్చేందుకు వీలుగా పరిశోధనలు చేశాడు. పోలియో వైరస్ యొక్క ఉత్పరివర్తన జాతుల ఆధారంగా సాబిన్ నోటి ద్వారా వేసే టీకాను అభివృద్ధి చేశాడు. ఇది యాంటీబాడీ ఉత్పత్తిని ప్రేరేపించింది, కాని పక్షవాతం కలిగించలేదు. అతని నోటి టీకా తీఉకున్న వాళ్లలో స్వయంగా తాను, తన కుటుంబం, అతడి సహచరులూ ఉన్నారు. సాబిన్ యొక్క మొట్టమొదటి క్లినికల్ ట్రయల్స్ 1954 చివరలో చిల్లికోథే ఓహియో రిఫార్మేటరీలో జరిగాయి. 1956 నుండి, అతను రష్యన్ సహచరులతో కలిసి నోటి టీకాను పరిపూర్ణం చేయడానికీ, దాని అసాధారణ ప్రభావాన్ని, భద్రతనూ నిరూపించడానికీ పనిచేశాడు. ఈ టీకా పేగులలో పనిచేసి, పోలియో వైరస్ రక్తప్రవాహంలోకి రాకుండా నిరోధించింది. 1957 నాటికి మూడు దురకాల పోలియో వైరస్ను వేరుచేయ గలిగాడు. దానితో పోలియో మందును తయారు చేశాడు. దానిని స్వచ్ఛంద సేవకులపైన, అలాగే తనపైన ప్రయోగించి చూశాడు. ఆ పరీక్షలు విజయవంతమైనాయి. సాబిన్ తయారుచేసిన టీకా మందును 1960లో అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రభుత్వం ఆమోదించింది. సాబిన్ టీకాలో సజీవమైన వైరస్లుంటాయి. దీనిని చుక్కల మందుగా నోటిద్వారా ఇస్తారు. సంవత్సరంలోపు చిన్నపిల్లలకు ఆరు వారాలకొకసారి మూడుసార్లు టీకాలను ఇస్తారు. 1 1/2 నుండి 2 సంవ త్సరాల లోపువారికి రెండవసారి ఇస్తారు. ఈ టీకాలు వేయటానికి పెద్ద ఎత్తున ప్రచారం చేస్తారు. టీక ధర ఎక్కువ అవుతుందని సాబిన్ తన టీకాకు పేటెంట్ తీసుకోడానికి నిరాకరించాడు. మానవాళికి మహోపకారం చేశాడు. సాబిన్ మెదడు వాపు, డెంగ్యూతో సహా ఇతర వైరల్ వ్యాధులకు కూడా టీకాలను అభివృద్ధి చేశాడు. వైరస్లు, కొన్ని రకాల క్యాన్సర్ల మధ్య సంబంధాలను కూడా పరిశోధించాడు. బలహీన పడిన లేదా మృత వ్యాధికారక బ్యాక్టీరియాను వ్యక్తి శరీరంలోకి ప్రవేశ పెడితే, శరీరంలోని తెల్లరక్తకణాలు ప్రేరేపితమై, వ్యాధిపై పోరాడేందుకు



యాంటీబాడీలను ఉత్పత్తి చేస్తాయి. 1957లో ప్రారంభం కాగా, 1962లో దీనికి లైసెన్స్ దొరికింది. పోలియో వ్యాధికి పూర్తిగా టీకాలు వేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేసింది. యునైటెడ్ స్టేట్స్ లో చిట్టచివరి పారలైటిక్ పోలియోమైఎలిటిస్ కేసు 1979లో నమోదైంది. 1994 నాటికి ఈ వ్యాధి అమెరికా ఖండంలో పూర్తిగా నిర్మూలించ బడింది. 2000 నాటికి చైనా, ఆస్ట్రేలియాతోపాటుగా 36 పాశ్చాత్య పసిఫిక్ దేశాలలో పోలియో నిర్మూలించబడినట్లు అధికారికంగా ప్రకటించబడింది. భారతదేశంలో పోలియోను నిర్మూలించే లక్ష్యంతో భారత ప్రభుత్వం 1995లో దేశవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించింది. 1.5 లక్షల మంది సూపర్ వైజర్ల ఆధ్వర్యంలో 24 లక్షల మంది వైద్య వాలంటీర్లు పాల్గొని మొదటిసారిగా ఓరల్ పోలియో వ్యాక్సిన్ అందించారు. 2011 నుంచి 2014 వరకు దేశంలో ఒక్క పోలియో కేసు కూడా నమోదు కాకపోవడంతో 2014, మార్చిలో ప్రపంచ ఆరోగ్య సంస్థ పోలియో రహిత దేశంగా ప్రకటించింది. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

చురకలు



# సాగునీరు వృథా.. ఎవరికీ పట్టదా?

ఎల్లారెడ్డిపేట : ఎగువ ప్రాంతంలో కురిసే వర్షాలకు వరదనీరు పారే కాలువలు అస్తవ్యస్తంగా మారాయి. అనేకచోట్ల ప్రధాన కాలువల్లో భారీగా పూడిక పేరుకుపోయింది. పనికిరాని మొక్కలు, గడ్డి ఏపుగా పెరిగింది. దీంతో ఎక్కడికక్కడే నీరు వృథాగా బయటకు వెళుతోంది. శిథిలావస్థకు చేరిన కాలువల గుండా నీరు సక్రమంగా రాకపోవడంతో నీటి వనరులకు శాపంగా పరిణమిస్తోంది. చెరువులు, కుంటలు నిండే పరిస్థితి కనిపించడంలేదు. కాలువల మరమ్మతులపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

**ఆయకట్టు భూములకు ఆధారం**

2 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఎగువ మానేరు ప్రాజెక్టు పూర్తిస్థాయిలో జలకళను సంతరించుకొని నిండుకుండను తలపిస్తోంది. మత్తడి దూకుతుండటంతో అత్యధికంగా నీరు మానేరు వాగులో కలిసిపోతోంది. అయితే ఎగువ మానేరు మత్తడి పారితే వచ్చే నీటిని సముద్రలింగాపూర్ శివారులోని సింగసముద్రం చెరువులోకి మళ్లించేందుకు గొల్లకేతమ్మ ఆలయ ప్రాంతంలో రెండు గేట్లను అమర్చారు. సింగసముద్రం చెరువు కింద 2232 ఎకరాల ఆయకట్టు ఉంది. ఆ చెరువుకు రెండు తూములుండగా.. ఒకదాని ద్వారా రాచర్ల



బొప్పాపూర్ శివారులోని జక్కుల చెరువుకు, మరొక తూము ద్వారా ఆయకట్టు భూములకు సాగునీరు వెళుతుంది.

**మూడు తటాకాలకు ఊపిరి**

ఇంతటి ప్రాధాన్యమున్న నీటి వనరులకు మరమ్మతు చేసిన దాఖలాలు లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జక్కుల చెరువు మత్తడి పారితే గొల్లపల్లి పరిధిలోని గాలం చెరువు, అక్కడి నుంచి ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని 600 ఎకరాల ఆయకట్టు ఉన్న గిద్దె చెరువుకు వరద నీరు ప్రవేశిస్తుంది. **అధికారులు స్పందించాలి– బాలయ్య, రైతు, రాచర్ల బొప్పాపూర్** ఎగువమానేరు మత్తడి పారితే గొల్లకేతమ్మ ఆలయం వద్ద తూము నుంచి సింగసముద్రంలోకి నీటిని విడుదల చేయొచ్చు. ప్రస్తుతం ఒక తూము ద్వారా నీరు వస్తోంది. కొన్నేళ్లుగా కాలువల నిర్వహణ లేక నీరంతా వృథా అవుతోంది. గొల్లకేతమ్మ ఆలయం వద్దనున్న తూము వద్ద నీరు అనవసరంగా బయటకు పారి మానేరు వాగులో కలుస్తోంది. అధికారులు వెంటనే సింగసముద్రం చెరువులోకి నీరు వచ్చేలా చూడాలి.

# వంతెన నిర్మాణం.. ఇంకెంత కాలం

గంభీరావుపేట : గంభీరావుపేట పరిధిలోని హై లెవల్ వారధి నిర్మాణానికి నిధులు మంజూరై దాదాపు రెండేళ్లు గడుస్తున్నా గుత్తేదారు నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఉన్న మట్టి రోడ్డు మానేరు మత్తడి దూకడంతో కొట్టుకుపోయింది. మూడు రోజుల నుంచి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

**రూ.10 కోట్లతో పనులు**

గంభీరావుపేట నుంచి లింగన్నపేటకు వెళ్లే ప్రధాన రహదారిలో మానేరు వాగుపై లో లెవల్ వంతెన ఉంది. ప్రతి ఏటా వానాకాలంలో మానేరు మత్తడి దూకడంతో అది మునిగిపోతుంది. దీంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కేటీఆర్ హైలెవల్ వంతెనకు రూ.10.60 కోట్లు నిధులు మంజూరు చేసి.. 2023, సెప్టెంబర్‌లో పనులకు శంకుస్థాపన చేశారు.

**సిద్దిపేటకు ఇదే మార్గం**

చాలాచోట్ల వాగులపై హైలెవల్ వంతెన నిర్మాణం జరిగే సమయంలో లోలెవల్ వంతెనను అలాగే ఉంచి పక్కన నిర్మిస్తారు. ఇక్కడ అలా చేయకుండా ఉన్న లోలెవల్ వంతెనను పూర్తిగా తొలగించారు. పైపులు వేసి పక్కన మట్టి రోడ్డు వేశారు. గతేడాది వర్షాకాలం అది పూర్తిగా



కొట్టుకుపోయి దాదాపు 15 రోజులపాటు రాకపోకలు నిలిచిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు సైతం అదే పరిస్థితి నెలకొంది. ఈనెల 19న మానేరు జలాశయం మత్తడి దూకడంతో మట్టి రోడ్డు రెండు చోట్ల తెగిపోయింది. దీంతో సిద్దిపేట, ముస్తాబాద్, కొత్తపల్లి, లింగన్నపేటకు రాకపోకలు నిలిచిపోయాయి.

**రెండేళ్లుగా పిల్లర్ల దశలోనే..**

రెండేళ్లుగా పనులు పిల్లర్ల దశలోనే ఉండటం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని వాహనదారులు మండిపడుతున్నారు. 11 పిల్లర్లకుగాను ఎనిమిది పిల్లర్ల పనులు మాత్రమే జరుగుతున్నాయి. వర్షాలు పడటంతో గుత్తేదారు పనులను నిలిపివేశారు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని వారధి నిర్మాణ పనులు పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

**ప్రవాహం తగ్గగానే రోడ్డు నిర్మిస్తాం**

– నిఖిల్, ఆర్‌అండ్‌బీ ఏఈ

వరద ప్రవాహం పూర్తిగా తగ్గగానే తెగిన చోట మళ్లీ మట్టి రోడ్డు వేసి.. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం. వారధి నిర్మాణం వెంటనే పూర్తయ్యేలా గుత్తేదారుతో మాట్లాడుతాం. పూర్తి చేయించేలా చొరవ తీసుకుంటాం.

# వరద గోదారి.. ఆయకట్టు తడారి!



సారంగాపూర్ : గోదావరి వృథా నీటిని అడ్డుకునేందుకు బ్యారేజీల నిర్మాణాలు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీర్‌పూర్‌లోని పలు ప్రాంతాల్లో అనువైన ప్రాంతాలను అధికారులు సర్వే చేసి ప్రతిపాదనలు తయారు చేశారు. నీటికి అడ్డుకట్ట వేస్తే కలిగే ప్రయోజనాలపై మాజీ మంత్రి జీవన్‌రెడ్డి పలుమార్లు సీఎం, సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అయినప్పటికీ నిధులు మంజూరు కాకపోవడంతో ప్రస్తుతం గోదావరి నీరు వృథా అవుతోంది. దీంతో వేసవిలో పొలాలకు నీరందించే ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మారుతున్నాయి. పలు ఎస్సారెస్పీ కాలువల మరమ్మతులు లేకపోవడంతో పై ప్రాంతంలో నీరు వృథాగా వెళుతుండగా.. చివరి ఆయకట్టుకు నీరందక రైతులు అవస్థలు పడుతున్నారు.

**గుత్తేదారులకే ప్రయోజనం**

బీర్‌పూర్‌లోని రంగసాగర్, చిత్రవేణిగూడెం, తాళ్లధర్మారం గ్రామాల్లో 1988లో రూ.15 లక్షలతో ఎత్తిపోతల పథకాలను ప్రారంభించారు. ఏడాదికే పైపులైన్లు పగిలిపోయి పథకాలు నిలిచిపోయాయి. ఆ తరువాత పలుమార్లు నిధులు మంజూరు చేసినా గుత్తేదారులకు లాభం చేకూరిందే తప్ప రైతులకు ప్రయోజనం లేదు. ప్రస్తుతం ఆయా పథకాలకు మళ్లీ రూ.60 కోట్ల చొప్పున మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు.

**వేటికి ఎంతంటే..**

రంగపేట ఊరకుంటకు రూ.కోటి, బీర్‌పూర్‌లోని అరగుండాల ప్రాజెక్టు కాలువ లైనింగ్‌కురూ.2.75 కోట్లు, కమ్మునూర్ రావికుంటకు రూ.3.50 కోట్లు, సారంగాపూర్ చింతల చెరువులోకి ఎస్సారెస్పీ కాలువ నీటి మళ్లింపునకు రూ.20 కోట్లు, డీ–53, 12–ఎల్ పరిధిలో కాలువలు, తూముల మరమ్మతులకు 1.50 కోట్లు అవసరమవుతాయని అధికారులు నివేదించారు.

**రెండు మండలాలకు ఆదరువు**

గోదావరిపై రెండు బ్యారేజీలు నిర్మిస్తే బీర్‌పూర్, ధర్మపురి రైతులకు సాగునీటికి ఇబ్బంది లేకుండా ఉండనుందని అధికారులు సర్వే నిర్వహించారు. ఇందులో బీర్‌పూర్‌లోని చిన్నకొల్వాయి, రంగసాగర్ వద్ద మొసల్ల మడుగు ప్రాంతాలు బ్యారేజీ నిర్మాణాలకు అనువుగా ఉంటాయని ప్రతిపాదనలు తయారు చేశారు. ఆయా నిర్మాణాలకు రూ.275 కోట్ల చొప్పున నిధులు అవసరమని నివేదించారు. బ్యారేజీ నిర్మాణాలతో నీటి నిల్వతో పాటు గోదావరి తీరం వెంట ఉన్న ఎత్తిపోతల పథకాలకు నీటి సమస్య తొలగనుంది.

# ఇందిరమ్మ ఇళ్ల పేరు.. అక్రమార్కుల తీరు



పెద్దపల్లి : జిల్లాలో అవకాశం ఏదైనా సొమ్ము చేసుకోవడంలో అక్రమార్కులు ముందుంటున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్లకు అవసరమైన మొరం, ఇసుకను ఉచితంగా అందిస్తుండగా ఇదే అదనుగా దందాకు తెరలేపారు. నిన్నటి వరకు ఇసుక రవాణా చేసిన వారే మానేరులో ప్రవాహం పెరగడంతో మట్టి రవాణాపై కన్నేశారు. గుట్టుగా సాగుతున్న ఈ వ్యవహారంపై మైనింగ్ అధికారులు దృష్టిసారించారు. పెద్దపల్లి మండలంలోని తుర్కలమద్దికుంటలో గ్రామంలో గురువారం దాడులు నిర్వహించి రెండు పొక్లెయిన్‌లను సీజ్ చేయగా అక్రమం వెలుగులోకి వచ్చింది.

**రెండింటికే అనుమతి ఉండగా..**

జిల్లాలో ప్రస్తుతం పెద్దపల్లి మండలంలోని తుర్కలమద్దికుంట, ధర్మారం మండలంలోని మల్లాపూర్ క్వారీలకే అనుమతి ఉంది. కానీ జిల్లాలో పలు గ్రామాలలో అనేక అనధికారిక క్వారీలున్నాయి. ముఖ్యంగా గుట్టబోరు ప్రాంతాల్లోనే అక్రమ దందా జోరుగా సాగుతోంది. తాజాగా తుర్కలమద్దికుంటలో కూడా అనుమతించిన ప్రాంతంలోకాకుండా గుట్టకు మరోవైపు మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. రాఘవపూర్, అందుగులపల్లి, కన్నాల, కుమ్మరికుంట, భూపతిపూర్ ప్రాంతాల్లో మట్టి తవ్వకాలు అధికంగా జరుగుతున్నాయి. గత వేసవిలో పెద్దకల్వలలోని హుస్సేన్‌మియా వాగులోనూ మట్టి తవ్వకాలు చేపట్టారు. ఈ మట్టి యావత్తు రహదారులు, ఇళ్ల నిర్మాణాలు, స్థిరాస్తి వెంచర్లకు అధికంగా వినియోగిస్తున్నారు.


**రెండు పొక్లెయిన్‌లు సీజ్**

పెద్దపల్లి మండలంలోని తుర్కలమద్దికుంట వద్ద అనుమతి లేని క్వారీ నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న వ్యవహారంపై జిల్లా మైనింగ్ అధికారి శ్రీనివాస్ గురువారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. మట్టి రవాణాదారులు పొక్లెయిన్‌లు వదిలేసి పారిపోగా అధికారులు వాటిని స్వాధీనం చేసుకొని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు మైనింగ్ ఏడీ తెలిపారు.

**ఇసుకతోపాటు..**

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఉచితంగా లభిస్తున్న మానేరు ఇసుకను రహస్య ప్రాంతాల్లో నిల్వ చేసి దూర ప్రాంతాలకు తరలించగా ఇటీవల కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్ మండలాల్లో రెవెన్యూ అధికారులు తనిఖీలు చేసి పట్టుకోవడం తెలిసిందే. తాజాగా ఇందిరమ్మ ఇళ్లకు అవసరమైన మొరాన్ని తీసుకునేందుకు ప్రభుత్వం ఆంక్షలు తొలగించడంతో వివిధ అనధికారిక క్వారీల నుంచి మట్టిని జోరుగా తరలిస్తున్నారు.

# అందుబాటులోకి 'క్రిటికల్ కేర్' సేవలు



గోదావరిఖని : అత్యవసర వేళల్లో మెరుగైన వైద్య సేవలందించి ప్రాణాపాయ స్థితి నుంచి ప్రజలను కాపాడాలనే లక్ష్యంతో గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రి ఆవరణలో చేపట్టిన 'క్రిటికల్ కేర్' భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తికావచ్చాయి. జిల్లా పాలనాధికారి ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సంబంధిత అధికారులు, గుత్తేదారును ఆదేశిస్తుండడంతో పనులు వేగవంతమయ్యాయి. పక్కనే ఉన్న రాజీవ్ రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో ప్రాథమిక వైద్యం అందించి కరీంనగర్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు తరలించాల్సి వస్తోంది. దూరాభారంతో పాటు అక్కడికి వెళ్లేసరికి ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలున్నాయి. ఈ నేపథ్యంలో గోదావరిఖనిలో క్రిటికల్ కేర్ సేవలను అందుబాటులోకి తెస్తే ప్రాణాపాయ స్థితి నుంచి పలువురిని కాపాడవచ్చనే సంకల్పంతో తెలంగాణ ఆరోగ్య, మౌలిక వసతుల కల్పన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూ.23.75 కోట్లతో క్రిటికల్ కేర్ భవన నిర్మాణ పనులు చేపట్టారు.

**పడకలు 50.. విస్తీర్ణం 40 వేల చ.అడుగులు**

రెండంతస్తుల్లో 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో 50 పడకల సామర్థ్యంతో చేపట్టిన క్రిటికల్ కేర్ భవన నిర్మాణ పనులు తుదిదశకు చేరుకొన్నాయి. రూ.10 కోట్లతో భవన నిర్మాణ పనులు పూర్తికానుండగా మరో రూ.13.75 కోట్లతో ప్రమాదబాధితులతో పాటు ఇతరులకు అత్యవసరంగా అత్యాధునిక వైద్య సేవలందించేందుకు అవసరమైన వైద్య సామగ్రి, సదుపాయాలను అందుబాటులోకి తేనున్నారు. ఈ నెలాఖరులోగా భవన నిర్మాణ పనులు పూర్తికానుండగా సదుపాయాల కల్పనపై అధికారులు దృష్టి సారించారు. గోదావరిఖనిలో క్రిటికల్ కేర్ సేవలు అందుబాటులోకి వస్తే ప్రమాదబాధితులకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. ప్రాణాపాయ స్థితి నుంచి తప్పించుకునే అవకాశముండడంతో పాటు హైదరాబాద్, కరీంనగర్ తదితర ప్రాంతాలకు వెళ్లే భారం తప్పనుంది. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో గుండెపోటు మరణాలు సైతం అత్యధికంగా ఉన్న నేపథ్యంలో క్రిటికల్ కేర్ భవనం ఆవరణలో క్యాథ్‌ల్యాబ్ ఏర్పాటు చేసి అత్యవసర వైద్య సేవలను అందుబాటులోకి తేవడంతో మరణాలను కొంత మేరకు నివారించే అవకాశముంది.

# ప్రచార ఘనం.. ఆచరణ శూన్యం

గోదావరిఖని : రామగుండం నగరపాలికలో పారిశుద్ధ్య నిర్వహణ కొంత మెరుగైనప్పటికీ ఇంటింటికీ తడి, పొడి చెత్త సేకరణ మాత్రం ప్రచారానికే పరిమితమవుతోంది. చెత్త సేకరణ తరలింపు కోసం కొనుగోలు చేసిన అత్యాధునిక వాహనాలు తుప్పు పట్టిపోతున్నాయి. డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం కావడంతో సుమారు రూ.83 కోట్లతో 15 ఎకరాల విస్తీర్ణంలోని రామగుండం ఎరువుల కర్మాగారం స్థలంలో పనులు చేపడుతున్నారు. రికార్డుల ప్రకారంగా సుమారు 395 మంది వివిధ స్థాయిల్లో పారిశుద్ధ్య కార్మికులుండగా వందకు పైగా కార్మికులు ఇతర విధుల్లో ఉంటున్నారు.

**నిత్యం 120 మెట్రిక్ టన్నులు..**

నగరంలోని వివిధ కాలనీల నుంచి నిత్యం 120 మెట్రిక్ టన్నుల చెత్త వెలువడుతోంది. కేవలం కూరగాయల మార్కెట్ నుంచి వెలువడే దాదాపు 2 మెట్రిక్ టన్నుల తడి చెత్తను మాత్రమే గౌతమినగర్‌లోని చెత్త నిర్వహణ కేంద్రానికి తరలించి సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నారు.



**ఆటోలతోనే..**పారిశుద్ధ్య నిర్వహణకు రూ.5 కోట్లు వెచ్చించి వాహనాలను కొనుగోలు చేసినప్పటికీ అక్రమాలు నెలకొన్నాయనే ఆరోపణలపై విజిలెన్సుతో పాటు అంతర్గత విచారణ కొనసాగుతోంది. డీజిల్ వినియోగంలోనూ అక్రమాలు నెలకొన్నాయి. నగరపాలికలో 60 డివిజన్లుండగా కేవలం 53 ఆటో ట్రాలీలు మాత్రమే ఉండగా తరచూ ఒకటి రెండు మరమ్మతుల్లోనే ఉంటాయి. మొత్తం 13 ట్రాక్టర్లతో నగరంలో చెత్త సేకరణ కొనసాగుతోంది. చెత్త తరలించే వాహనాలను జీపీఎస్ విధానంతో పర్యవేక్షిస్తున్నారు.

**సేంద్రియ ఎరువు తయారీపై అవగాహన**

– జె.అరుణశ్రీ, జిల్లా అదనపు పాలనాధికారిణి

సేంద్రియ ఎరువు తయారీపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. డంపింగ్ యార్డులోనే తడి, పొడి చెత్త నిర్వహణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాం. దీంతో చెత్త నిర్వహణ మరింత మెరుగుపడుతుంది.

# కట్టలు బలహీనం.. తెగితే ప్రమాదం!

మంచిర్యాల : ఇది నెన్నెల మండలం కోనంపేట గ్రామంలోని కొత్తచెరువు. ఇటీవల కురిసిన వర్షాలకు కట్ట తెగి నీరు కిందికి పోయింది. కట్ట బలహీనంగా ఉండటంతో ఇలా జరిగింది. ప్రస్తుతం దీనికి తాత్కాలిక మరమ్మతులు కొనసాగుతున్నాయి.

చెరువుల మరమ్మతులు, పటిష్ఠతకు గతేడాది అంతంతమాత్రంగానే నిధులు విడుదలయ్యాయి. గతేడాది, ఈ సంవత్సరం కురిసిన భారీ వర్షాలతో జిల్లాలోని చెరువులకు అక్కడక్కడ గండ్లు పడ్డాయి. పలు చోట్ల కట్టలు బలహీనంగా ఉండటం, తూములు శిథిలమై మరమ్మతులు లేక ప్రమాదకరంగా మారాయి. తూములకు పక్కన నిర్మించిన రక్షణ గోడలు కూలిపోయాయి. నీటిని వదిలేందుకు, మూసేందుకు అవసరమైన రాడ్లు సైతం శిథిలమయ్యాయి. తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి నెట్టుకొస్తున్నారు. శాశ్వత పనులు చేయిస్తేనే ప్రయోజనకరంగా ఉంటుంది.

**ముందు జాగ్రత్తలు తీసుకుంటేనే..**

భారీ వర్షాలు పడితే కొన్ని చోట్ల చెరువులకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిర్వహించిన దృశ్య సమీక్షలో అధికారులు జిల్లాలోని చెరువుల పరిస్థితిని వివరించారు. కొన్నేళ్లుగా ఆధునికీకరణకు నిధులు రాక తూములు, అలుగులు, చెరువుల నుంచి పొలాలకు వెళ్లే కాలువలకు మరమ్మతులు చేపట్టలేదు. చాలా చోట్ల కాలువల్లో పూడిక తొలగించక ఆయకట్టు రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

**ప్రతిపాదనలు..**జిల్లాలో సుమారుగా 50 చెరువులకు మరమ్మతులు అవసరం ఉన్నా ఎక్కువగా ఇబ్బంది ఉన్న 8 చెరువులను గుర్తించి వీటి కోసం ప్రతిపాదనలు పంపారు. భీమిని మండలంలో 3, నెన్నెలలో 2, తాండూరు, కన్నెపల్లి, బెల్లంపల్లిలో ఒక్కోటి చొప్పున మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపారు. ఈ విషయంపై జిల్లా నీటి పారుదల శాఖ ఈఈ రామును సంప్రదించగా.. ప్రస్తుతం అవసరం ఉన్న దగ్గర తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టామని, నిధులు రాగానే శాశ్వత పనులు చేయిస్తామన్నారు.

ఇది దండేపల్లి మండల కేంద్రంలోని ఎర్రగుంట చెరువు. తూములు శిథిలమయ్యాయి. రక్షణ గోడలు శిథిలం కావడంతో వరదలు వస్తే ప్రమాదం పొంచి ఉంది.

**జిల్లాలో ఇదీ పరిస్థితి..**

జిల్లాలో చెరువులు : 634

పూర్తి ఆయకట్టు : 62,138

సాగవుతున్న ఆయకట్టు : 40 వేలు

# బీమా లేదాయె.. పరిహారం రాదాయె!

మంచిర్యాల : ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికందకుండానే పోతున్నాయి.. అయితే అతివృష్టి లేదా అనావృష్టి కారణంగా రైతులు ఏటా నష్టపోతున్నారు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేయాల్సిన పంటల బీమా పథకం పత్తా లేకపోవడంతో.. నష్టపరిహారం పైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. గతేడాది నష్టానికే ఇంతవరకు మంజూరు కాకపోవడంతో నిరీక్షణ తప్పడం లేదు. ఈ ఏడాది ఇప్పటికే 5.80 లక్షల ఎకరాల్లో పంటలు సాగుకాగా, ఇటీవల వరదలతో 20 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.. వరుస వర్షాలతో పంట ఎదుగుదల లోపించింది.. దీంతో దిగుబడి తగ్గుతుందని రైతులు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం అమలుచేసే ప్రధానమంత్రి పంటల బీమా యోజన గత ప్రభుత్వం అమలు చేయలేదు. పంటకు వాతావరణ ఆధారిత బీమా, సోయాకు గ్రామం యూనిట్ కింద పంట బీమా అమలయ్యేది.. ఎకరానికి నిర్ణయించిన ప్రీమియంలో రైతులు 50 శాతం చెల్లిస్తే కేంద్ర ప్రభుత్వం 25 శాతం, రాష్ట్రం 25 శాతం చెల్లించేంది.. అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలకు నష్టం జరిగితే నిబంధనల మేరకు మంజూరయ్యే పరిహారం నేరుగా రైతుల ఖాతాలో జమయ్యేది.

2018 నుంచి బీమా పథకం అమలు చేయకపోవడంతో రైతులు ప్రీమియం చెల్లించడం లేదు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తామే ప్రీమియం చెల్లించి పథకం అమలుచేస్తామని ప్రకటించింది. ఇప్పటివరకు పథకం అమలుకు నోచుకోవడం లేదు. పంట నష్టపోయిన సందర్భంలో ప్రభుత్వం సర్వే చేయించి రైతులకు నష్ట పరిహారం మంజూరు చేస్తోంది.

# ఏ ఛైర్మన్‌కు 'సహకారం'?

కరీంనగర్ : ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల ఛైర్మన్‌లలో గుబులు పట్టుకుంది. ఆర్నెల్లపాటు పాలకవర్గాల గడువు పెంపు చూసి మురువాలా.. తనకు అవకాశం దక్కుతుందో లేదా అని ఆందోళన చెందాలా అన్న సందిగ్ధం కొందరిలో నెలకొంది. ఉమ్మడి జిల్లాలో 131 పీఏసీఎస్ పాలకవర్గాల గడువును పెంచుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అందులో ఏదైనా సంఘం నష్టాల్లో ఉండటానికి పాలకవర్గం కారణమైనా.. లేదా నిధుల దుర్వినియోగం ఆరోపణలున్న చోట ఆ ఛైర్మన్‌కు అవకాశమివ్వకూడదని ఉత్తర్వుల్లో ఉంది. దీంతో ఇంకొన్నాళ్లు ఆ కుర్చీలో కూర్చోవచ్చని అనుకుంటే ఇదేం మెలిక అని కొందరిలో ఆందోళన మొదలైంది. గతంలో ఈ పదవిలో ఉన్న వారంతా భారాసకు చెందినవారే.. దీంతో వీరిలో కొందరు అధికార పార్టీ నేతలను కలిసి తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

**డీసీవోలదే నిర్ణయాధికారం**

సంఘాల పనితీరు, పారదర్శకత విషయంలో జిల్లా సహకారశాఖ




అధికారుల (డీసీవో)కే నిర్ణయాధికారాన్నిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులతో సహకారశాఖ కమిషనర్ జిల్లాల డీసీవోలకు ఆ ఉత్తర్వులను పంపిస్తూ ఇబ్బందులు లేనివారికే కుర్చీలో కూర్చునే అవకాశం కల్పించాలని ఆదేశించారు. దీంతో ఆయా సంఘాల తీరుతెన్నులపై జిల్లా అధికారులు దృష్టిపెట్టారు. అయితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న సంఘాల్లో దాదాపుగా 40- 50 సంఘాలపైన ఆరోపణలు వచ్చాయి. నిధుల దుర్వినియోగం జరిగిన సందర్భంలో కొందరిపై విచారణలు జరిపి నోటీసులివ్వడం, సస్పెన్షన్ వేటు వేసిన దాఖలాలున్నాయి. ఇలాంటి పీఏసీఎస్‌లు అన్నీ కలిపి రూ.30-40 కోట్ల మేర అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఇందులో కొందరు తమ తప్పిదం లేదని న్యాయస్థానాలను ఆశ్రయించగా ఇంకొన్ని చోట్ల విచారణల అనంతరం పక్కదారి పట్టిన సొమ్మును చెల్లించారు. దీంతో సహకార శాఖ యంత్రాంగం ఆయా సంఘాల్లో ఎవరు అర్హులు.. ఎవరు అనర్హులనే జాబితాను సిద్ధం చేసే పనిలో ఉంది. ఇదే సమాచారాన్ని రాష్ట్రస్థాయి అధికారులకు పంపించనున్నారు. వారిచ్చే ఆదేశాలతోనే అర్హులు ఛైర్మన్ కుర్చీలో కూర్చోనున్నారు. మరోవైపు అనర్హులని తేలిన చోట పర్సన్ ఇన్‌ఛార్జిల నియామకం చేపట్టి పాలకవర్గం సభ్యులతో కార్యకలాపాల్ని కొనసాగించనున్నారు.

# ఏ పనైనా 'మామూలుగా'గానే..!

సూర్యాపేట: ప్రజలకు పారదర్శక సేవలందించాల్సిన అధికారులు పట్టుకోల్పోతున్నారు. అమ్యామ్యాలు పుచ్చుకుంటూ అవినీతి నిరోధక శాఖ(అనిశా)కు అడ్డంగా దొరికిపోతున్నారు. అయినా వారిలో మార్పు రావడం లేదు. ఏ పనైనా 'మామూలు'గానే తీసుకుంటున్నారు. తాజాగా కోదాడలో చెట్ల వ్యాపారి నుంచి అటవీశాఖ బీట్ అధికారి వెంకన్న రూ.20 వేలు తీసుకుంటూ చిక్కాడు. జిల్లాలో గడిచిన ఏడున్నర నెలల వ్యవధిలో ఆరు అనిశా కేసులు నమోదయ్యాయి. ఇందులో పోలీస్‌శాఖకు చెందిన వారే ఎక్కువగా ఉండటం గమనార్హం.

**దొరికేది కొందరే**

అనిశా దాడులు జరుగుతున్నా కొన్ని శాఖల అధికారులు, సిబ్బంది భయపడటం లేదు. ధనార్జనే ధ్యేయంగా అవినీతికి కొమ్ముకాస్తున్నారు. శాంతి భద్రతలను పోలీస్‌శాఖలోని కొన్ని ఠాణాల్లో కింది నుంచి పైస్థాయి వరకు అందినకాడికి దోచుకుంటున్నారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్, రవాణా, పురపాలక, ట్రెజరీ కార్యాలయాల్లో అవినీతి జాఢ్యం వేళ్లూనుకుందనే విమర్శలున్నాయి. ప్రస్తుతం సర్కారు అమలు చేస్తోన్న ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు ఇప్పించటంలో, నూతన రేషన్‌కార్డుల మంజూరు చేయించటంలో ఆ శాఖల్లోని కొంతమంది అధికారులు, సిబ్బంది డబ్బులు ఇవ్వనిదే పనిచేయడం లేదనే ఆరోపణలున్నాయి. పాలకవీడు మండలం జాన్‌పహాడ్‌లో పంచాయతీ కార్యదర్శి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తేలడంతో జిల్లా కలెక్టర్ అతన్ని సస్పెండ్ చేశారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ వసూళ్లు అధికంగా జరుగుతున్న శాఖలపై దృష్టి సారించి ఆయా పనులకు కోసం వచ్చే వారికి ప్రయోజనం కలిగేలా



చూడాలంటూ జిల్లా ప్రజలు కోరుతున్నారు.

**ఈ ఏడాదిలోని ఘటనలు ఇలా..**

జనవరి 25న తిరుమలగిరి ఎస్సై సురేశ్, కానిస్టేబుల్ నాగరాజు ఇద్దరూ కలిసి ఓ వ్యక్తిని కేసు నుంచి తప్పిస్తానని రూ.లక్షల తీసుకొని పట్టుబడ్డారు. ఏప్రిల్ 11న చింతలపాలెం ఎస్సై నర్రా అంతిరెడ్డి ఓ బాధితుడి నుంచి రూ.10వేలు తీసుకుంటూ చిక్కాడు.

మే 12న డీఎస్పీ పార్థసారథి, సీఐ వీరరాఘవులు నకిలీ వైద్యుడిని రిమాండ్‌కు పంపించకుండా ఉండేందుకు అతని నుంచి రూ.16 లక్షలు డిమాండ్ చేస్తూ ఆధారాలతో సహ అనిశాకు చిక్కారు. జూన్ 26న పెన్‌పహాడ్ మండలం నాగులపాటి అన్నారం గ్రామపంచాయతీ కార్యదర్శి బొగ్గుబట్టీ నిర్వహణకు అనుమతి ఇచ్చేందుకు ఆ నిర్వాహకుడి నుంచి రూ.15 వేలు డిమాండ్ చేసి రూ.8 వేలు ఇస్తూ దొరికాడు. జూన్ 28న హుజూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలోని భూ భారతి(అవుట్‌సోర్సింగ్) ఆపరేటర్ విజేతారెడ్డి వారసత్వ భూమికి సంబంధించి ప్రొసీడింగ్ పత్రాలను అందించడానికి సంబంధిత వ్యక్తి నుంచి రూ.12 వేలు తీసుకుంటూ పట్టుబడ్డాడు.

# గణపయ్యా.. గండాలు దాటుతూ రావయ్యా



హైదరాబాద్: ఇటీవల ఓ భారీ వినాయక విగ్రహాన్ని ట్రాక్టర్‌పై తరలిస్తుండగా అత్తాపూర్ పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబరు 156 వద్ద ఉన్న ర్యాంపు గడ్డర్‌కు తగిలి ఇరుక్కుంది. రోడ్డు మధ్యలోనే ట్రాక్టర్ నిలిచిపోవడంతో ఒకవైపు వాహనాలు స్తంభించాయి. చివరికి పోలీసులు వచ్చి వాహనాన్ని పక్కకు తీశారు. వినాయక చవితి నేపథ్యంలో నగరం నుంచి మండపాలకు విగ్రహాలను తరలిస్తున్నారు. కేవలం నగరంలోనే కాకుండా చుట్టు పక్కల జిల్లాల నుంచి అనేకమంది వచ్చి విగ్రహాలను కొని ట్రాక్టర్లు, ట్రక్కులపై తీసుకెళ్తుంటారు. గ్రేటర్ వ్యాప్తంగా 35 వరకు ఫ్లైఓవర్లు ఉన్నాయి. వాటికి అనుసంధానంగా ర్యాంపులు ఉన్నాయి. ఈ ఫ్లైఓవర్ల కింద నుంచి భారీ విగ్రహాలను తరలించే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

**ఐఆర్‌సీ మార్గదర్శకాలు ఇలా...**

ఇండియన్ రోడ్డు కాంగ్రెస్(ఐఆర్‌సీ) మార్గదర్శకాల ప్రకారం సరాసరి 5.5 మీటర్ల ఎత్తులో ఫ్లైఓవర్ల స్లాబుండేలా జాగ్రత్తలు తీసుకుంటారు. అంటే రోడ్డుకు దాదాపు 18 అడుగుల ఎత్తులో నిర్మిస్తారు. అంతకంటే ఎక్కువ ఎత్తున్న వాహనాలు ఫ్లైఓవర్ల కింద నుంచి వెళ్లకుండా హెచ్చరిక బోర్డులు ఉంటాయి. సాధారణంగా నగరంలోకి భారీ వాహనాలు వచ్చే పరిస్థితి చాలా తక్కువ. వీటిపై ఆంక్షలు ఉండటం వల్ల అవుటర్ రింగ్‌రోడ్డు మీదుగా వెళ్తుంటారు. తాజాగా భారీ వినాయక విగ్రహాలను తరలించడం వల్ల అవి ఫ్లైఓవర్ల కిందకు వెళ్లి ఇరుక్కుంటున్నాయి.

చాలా విగ్రహాలు 18 అడుగుల కంటే తక్కువే ఉన్నప్పటికీ వాటిని ట్రక్కులు, ట్రాక్టర్లపై పెట్టి తీసుకెళ్లడం వల్ల ఆ ఎత్తు పెరుగుతోంది. 5.5మీటర్ల కంటే ఎక్కువ ఉండటం వల్ల ఫ్లైఓవర్ల కిందిగడ్డర్లకు తగులుతున్నాయి.

కొన్నిసార్లు విగ్రహాలు విరిగిపోవడం, కింద పడటం లాంటి సంఘటనలు జరుగుతున్నాయి. నిమజ్జనం రోజూ ఇదే పరిస్థితి. ఈ నేపథ్యంలో భారీ విగ్రహాలు తరలించే ముందు ఫ్లైఓవర్లు లేని మార్గాలను ఎంచుకోవడం ఉత్తమని అధికారులు సూచిస్తున్నారు.

కొన్నిసార్లు విగ్రహాలు ఇరుక్కున్న సందర్భంలో బలవంతంగా వాటిని ముందుకు నెట్టే ప్రయత్నం చేయడంతో విరిగి పడి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంటుంది. స్థానిక ట్రాఫిక్ పోలీసులను సంప్రదించాలి.

విగ్రహాలు తరలించేటప్పుడు వేలాడుతున్న విద్యుత్తు వైర్లను కర్రలతో పైకి నెట్టడం వల్ల విద్యుత్తు షాక్ తగిలే అవకాశం ఉంది. ఈ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# ఇల్లు బాగుంటే చాలు.. మనకెందుకు వీధులు?



హైదరాబాద్:నిర్లక్ష్యపు పౌరులు నగరాన్ని చెత్తమయం చేస్తున్నారు. ఇళ్లలోని మంచాలు, పరుపులు, దిండ్లు, సోఫాలు, పాత దుస్తులు, ప్లాస్టిక్ కవర్లు, సంచులను వీధుల్లో పడేస్తున్నారు. వారి నిర్వాకంతో కాలనీ రోడ్లు డంపింగ్ యార్డుల్లా మారుతున్నాయి. అలాంటి నిర్లక్ష్యపు పౌరులు.. సగటున వీధికి ఒకరిద్దరు ఉంటారు. వాళ్లతోపాటు మిగిలినవారినీ ప్రమాదంలోకి నెడతారు. యూసుఫ్‌గూడ శ్రీకృష్ణనగర్ వరద ముంపు సమస్య అలాంటిదే. యూసుఫ్‌గూడ మెట్రో పిల్లర్ నం.1540 ఎదురుగా ఉండే వీధిలో.. అరటిపండ్లు, కొబ్బరికాయల దుకాణం చౌరస్తాలో రోజూ టన్నుకుపైగా వ్యర్థాలు పోగవుతుంటాయి. మరింత బరి తెగించి.. ఓ కుటుంబం మంగళవారం రాత్రి 5 పరుపులను చెత్త కుప్పలో పడేసిందని, వర్షం వస్తే ఆ వ్యర్థాలు వరద నాలాలను పూడ్చేస్తాయని స్థానికులు 'ఈనాడు'కు ఫిర్యాదు చేశారు. తమ కాలనీలో ఏళ్ల తరబడి ఈ సమస్య ఉందని, అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదని వాపోయారు. ఫిర్యాదుపై అధికారులను వివరణ కోరగా.. కాలనీ వాళ్ల తప్పిదమే కృష్ణానగర్ ముంపునకు కారణమని సమాధానమిచ్చారు. స్థానికుల్లో ఐక్యత లేకపోవడం వల్ల.. రోడ్లపై కుప్పలు కుప్పలుగా చెత్త పడుతోందని, ప్రైవేటు హాస్టళ్లు, దుకాణాల నిర్వాహకులు మరీ దారుణంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు.

**ఇంటింటికి ఆటోలు వెళ్తున్నా..**

యూసుఫ్‌గూడ ప్రధాన నగరంలో ఉంటుంది. జూబ్లీహిల్స్‌లో గంటకు 4 సెంటీమీటర్లకు మించి వాన పడితే.. కృష్ణానగర్ ఏ, బీ, సీ బ్లాకులు, పలు కాలనీలు నీట మునుగుతుంటాయి. రోడ్లపై నడుముల్లోతున నీరు ప్రవహిస్తుంది. ప్రవాహం ధాటికి ద్విచక్ర వాహనాలు, తోపుడుబండ్లు, కార్లు కొట్టుకుపోతుంటాయి. అందుకు రోడ్లపై చెత్త కుప్పలు ప్రధాన కారణం. స్థానికంగా ఉండే బాధ్యతలేని నిర్లక్ష్యపు పౌరులు.. ఇళ్లలోని పాత వస్తువులను రోడ్లపై పడేస్తున్నారు. పరుపులు, మంచాలు, దిండ్లు, పాత వస్త్రాలు నాలాల్లోకి చేరి కల్వర్టుల వద్ద ప్రవాహానికి అడ్డుపడుతున్నాయి. దీంతో వరద నీరు రోడ్లపైకి చేరుతోంది. మ్యాన్‌హోళ్లు పొర్లుతున్నాయి. ఇళ్లలోకి నీరు చేరుతోంది. వర్షం వచ్చిన ప్రతిసారీ.. 100-200 ఇళ్లు మునుగుతున్నాయని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**2,500 చెత్త కుప్పలు..**

బస్తీల్లో 20 శాతం మంది ఇంట్లోని చెత్తను స్వచ్ఛ ఆటోలకు ఇవ్వట్లేదు. నెలకు రూ.100 భారంగా భావిస్తున్నారు. ఉదయం ఉద్యోగానికి వెళ్లేటప్పుడో.. సాయంత్రం లేదా రాత్రి వేళల్లోనో చెత్తను ప్లాస్టిక్ కవర్లలో నింపి రోడ్డుపై పడేస్తున్నారు. వారిని గుర్తించేందుకు సీసీకెమెరాలు ఏర్పాటు చేస్తామని, జరిమానాలు వేస్తామన్న జీహెచ్ఎంసీ ప్రకటనలు కాగితాలకే పరిమితమవడంతో.. సమస్య పరిష్కారం కావట్లేదనే విమర్శలొస్తున్నాయి.

# గదుల ఆధారంగా విద్యుత్ కనెక్షన్లు



హైదరాబాద్: గ్రేటర్‌లో విద్యుత్తు కనెక్షన్ల కనీస లోడ్‌ను ఎస్పీడీసీఎల్ గణనీయంగా పెంచింది. వినియోగం ఆధారంగా కాకుండా గదుల ఆధారంగా లోడ్‌ని అంచనా వేస్తోంది. దీంతో ఇకపై కరెంట్ కనెక్షన్ తీసుకోవడం భారంగా మారనుంది. అపార్ట్‌మెంట్లు, బహుళ అంతస్తుల భవనాలు, ఆకాశహర్మ్యాల్లో కనీస లోడ్ ఒక పడకగది(బీహెచ్‌కే)ఫ్లాట్‌కి 2 కిలోవాట్లు, 2 పడకల గదుల ఫ్లాట్‌కు 5 కిలోవాట్లు, 3 పడకల ఫ్లాట్‌కి 10కిలోవాట్లు, 4 పడకలు అంతకంటే ఎక్కువ ఉన్న వాటికి 15కిలోవాట్ల లోడ్ తీసుకోవాలని ఎస్పీడీసీఎల్ గతనెలలో ఆదేశాలు జారీ చేసింది. సమాచారం లేక వినియోగదారులెవరైనా దరఖాస్తు చేస్తే వాటిని క్షేత్రస్థాయిలో తిరస్కరించడమో లేదంటే పెండింగ్‌లోనో పెడుతున్నారు.

**3 బీహెచ్‌కేకి 10 కిలోవాట్లు తీసుకోవాల్సిందే: ఎస్పీడీసీఎల్**

అపార్ట్‌మెంట్లలో తక్కువ లోడ్ కనెక్షన్లు తీసుకుని అధిక లోడ్ వాడకంతో అగ్నిప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో మెట్రోజోన్ ఆపరేషన్ చీఫ్ ఇంజినీర్ కొత్త ప్రతిపాదనను సీఎండీ ఆమోదించారు. ఈ మేరకు ఆన్‌లైన్ ఎల్‌టీఎం దరఖాస్తులో మార్పులు చేశారు. అపార్ట్‌మెంట్లకు మాత్రమే ఇది వర్తిస్తుంది. ప్రస్తుతం కనీసం 2 కిలోవాట్లకు కనెక్షన్ ఇస్తున్నారు. అభివృద్ధి ఛార్జీలు రూ.2400, డిపాజిట్ రూ.200, దరఖాస్తు ఫీజు రూ.25 కలిపి రూ.2625 అవుతోంది. అలా 10 కిలోవాట్లకు రూ.12,225 వరకు అవుతుంది. ఇప్పుడు 10 ఫ్లాట్లున్న అపార్ట్‌మెంట్‌కు సైతం పెద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి.

**భూగర్భ కేబుల్ వేయాల్సిందే..**

అపార్ట్‌మెంట్ సమీపంలోనే 11కేవీ లైను లేకుంటే ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కొత్త లైను వేయాల్సి ఉంటుంది. ఇప్పటివరకు ఓవర్‌హెడ్ లైన్లు వేస్తున్నారు. కొత్త కనెక్షన్లు తీసుకునేవారు తప్పనిసరిగా భూగర్భ కేబుల్ వేసుకోవాల్సిందే. ఓవర్‌హెడ్ లైన్లతో పోలిస్తే భూగర్భ కేబుళ్ల వ్యయం ఎక్కువని, రోడ్డు తవ్వకాలకు అనుమతుల ఖర్చు కలిపితే తడిసి మోపెడవుతుందని వాపోతున్నారు.

# మెట్ట..ఎందుకిట్టా?

గరిడేపల్లి : సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు ప్రాంతంలో వరిసాగు నత్తనడకన సాగుతోంది. ముందస్తుగా నీరు విడుదలైనా, వర్షాలు సకాలంలో కురిసినా.. నాట్లు వేయడంలో ఆలస్యం తప్పడం లేదు. కూలీల కొరత, నారు పెరగకపోవడం వంటి అనేక సమస్యలతో రైతులు నాట్లు వేయడంలో ఇబ్బంది పడుతున్నారు. గతేడాది కంటే ఈసారి పంటల సాగులో వ్యత్యాసం కన్పిస్తోంది. పత్తితో పాటు ఇతర మెట్ట పంటలు సైతం తక్కువగానే సాగయ్యాయి. ప్రధానంగా నాన్ ఆయకట్టు ప్రాంతంలో జూన్‌లో అనుకున్నంత వర్షాలు లేకపోవడంతో పత్తి, కంది, మిర్చి పంటలు వేసినా మొలకెత్తలేదు. జులైలో అడపదడపా కురిసిన వర్షాలకు పత్తి, కంది, పెసర, మిర్చి, వేరుశనగ వేశారు.



జిల్లాలో వ్యవసాయ శాఖ అంచనాలకు భిన్నంగా మెట్ట పంటలు సాగయ్యాయి. కంది, పెసర, వేరుశనగ, మిర్చి పంటలు అనుకున్న దానికంటే రెండు, మూడు రెట్లు తగ్గాయి. ఆగస్టు 20 వరకు మెట్ట పంటల సాగు సమయం ముగిసింది. పత్తి, కంది, పెసర, వేరుశనగ వేయడం దాదాపు పూర్తయింది. మిగిలింది వరి ఒక్కటే. మరో పది రోజుల సమయం ఉంది. ఆ తర్వాత సాగయితే దిగుబడులు, తెగుళ్లపై ప్రభావం పడతుందని వ్యవసాయ శాఖ పేర్కొంటోంది.

సాగర్ ఎడమ కాల్వ పరిధిలో దాదాపు 80 శాతం రైతులు స్వల్పకాలిక రకాలు సాగు చేస్తున్నారు. వాటిలోనూ సన్నరకాలు ఎక్కువగా ఉంటున్నాయి. జులైలోనే నీటి విడుదల చేసినా నేటికీ నాట్లు పూర్తికాలేదు. బిహార్, మహారాష్ట్ర నుంచి 150 మంది కూలీలు వచ్చినా నీరు ఒకేసారి రావడం, రైతులు నార్లు ఒక్కసారిగా పోయడంతో ఒత్తిడి ఎక్కువగా వచ్చి నాట్లు ఆలస్యమవుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

# ఇచ్చేది బస్తా.. ఎంతో అవస్థ

నల్గొండ: వర్షాలు పడటం.. సాగు జోరందుకోవడంతో ఎరువుల వినియోగం అనూహ్యంగా పెరిగింది. దీంతో రైతులు సహకార సంఘాలు, ఆగ్రోస్ కేంద్రాలు, ఎరువుల దుకాణాల వద్ద తెల్లవారుజాము నుంచే పడిగాపులు కాస్తున్నారు. ఎరువులు అందుబాటులో ఉన్నాయని అధికారులు చెబుతున్నా.. దుకాణాల్లో మాత్రం 'నో స్టాక్' బోర్డులు దర్శనమిస్తున్నాయి. పంటల విస్తీర్ణం ఆధారంగా గరిష్ఠంగా మూడు యూరియా బస్తాలను ఇస్తున్నారు. మారుమూల గ్రామాల్లో బస్తా రూ.267లకే విక్రయించాల్సి ఉన్నా.. రూ.300 తీసుకుంటున్నారని రైతులు వాపోతున్నారు.

ఎరువుల కొరత సృష్టిస్తున్న వ్యాపారులపై నిఘా పెట్టేందుకు మండల, జిల్లా అధికారులతో టాస్క్‌ఫోర్సు బృందాలను ఏర్పాటు చేసినా.. అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. తనిఖీలు పెంచి వ్యాపారులపై చర్యలు తీసుకుంటేనే రైతులకు న్యాయం జరుగుతుందని పలువురు పేర్కొంటున్నారు.

సీజన్‌లో ఇప్పటి వరకు 10,60,650 ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేశారు. ఇందులో వరి-4,07,350, పత్తి-5,59,640, మిగిలిన 93,660 ఎకరాల్లో కంది, పెసర, ఇతర పంటలు వేశారు.

మొత్తం 70వేల మెట్రిక్ టన్నుల యూరియాను ప్రభుత్వం కేటాయించగా.. 44,500 మె.ట.లను జిల్లాకు సరఫరా చేశారు. సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల్లోని ఎరువును రైతులు వెంటనే కొనుగోలు చేయడంతో యూరియా నిల్వలు అడుగంటి కొరత ఏర్పడుతుంది. సాగర్ ఎడమకాల్వ పరిధిలో ఇప్పుడిప్పుడే నాట్లు వేస్తుండటంతో ఈ ప్రాంతాల్లో నెలాఖరు వరకు యూరియా వాడకం పెరగనుంది. **ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు** - పాల్వాయి శ్రవణ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జిల్లా వ్యాప్తంగా ప్రతి వారం 3,020 మె.ట. డిమాండ్ ఉండగా 550.98 మె.ట.లను విక్రయించారు. ఇంకా 1,134.91 మె.ట. అందుబాటులో ఉంది. నెలాఖరు వరకు మరో 4వేల మె.ట. యూరియా అందుబాటులోకి వస్తుంది. 40వేల లీటర్ల నానో యూరియా బాటిళ్లు ఉన్నాయి. రైతులు వీటిని విరివిగా వినియోగించుకోవచ్చు.

# ఖాళా జాగా.. వేసేస్తున్నారు పాగా

సిరిసిల్ల: ప్రభుత్వ భూముల్లో అక్రమంగా ఇంటి నిర్మాణాలు వెలుస్తున్నాయి. జిల్లా కేంద్రం సమీపంలో సిరిసిల్ల పురపాలికలో విలీన గ్రామాలుండగా.. జిల్లా ఆవిర్భావం తర్వాత సిరిసిల్ల-కామారెడ్డికి పట్టణానికి రెండో బాహ్య వలయ రహదారి ఏర్పాటైంది. ఈ ప్రాంతంలో గుంటకు సగటున రూ.30 లక్షలకుపైనే ధర పలుకుతుంది. ఇప్పటికే రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయి. ప్రభుత్వ కార్యాలయాలు, వైద్య కళాశాల, వీవింగ్ పార్కులు, పర్యాటకశాఖ హరిత హోటల్ నిర్మాణాలతో ఈ ప్రాంతం వేగంగా విస్తరిస్తోంది. రోజురోజుకు డిమాండ్ పెరుగుతుండటంతో ఇప్పుడు అక్రమార్కుల కన్ను ఈ ఖాళీ స్థలాలపై పడింది.

**రెండు వేల ఎకరాలు**

జిల్లా కేంద్రంలోని సర్దాపూర్, పెద్దూరు, చిన్నబోనాలలో పలు సర్వే నంబర్లలో రెండు వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీనిలో వీవింగ్, అపరెల్ పార్కులకు 229 ఎకరాలు.. వైద్య కళాశాలకు 100, హరిత హోటల్, కస్తూర్బా గాంధీ విద్యాలయం, వృద్ధుల ఆశ్రమం తదితరాలకు 25 ఎకరాల వరకు సేకరించారు. వీవింగ్, అపరెల్ పార్కుకు స్థల సేకరణ సమయంలో అసైన్డ్ పట్టాలు ఉన్నవారికి అప్పటి ప్రభుత్వం పరిహారం అందించింది.

**పంచాయతీల్లోనే ఇంటి నంబర్లు**

పురపాలికలో విలీనమైన గ్రామాల్లోని ప్రభుత్వ భూముల్లో చాలాచోట్ల చిన్న షెడ్లు, చదునుచేసిన ఖాళీ స్థలాల్లోనే ఇంటి నంబర్లు పొందారు. అప్పటి పంచాయతీ కార్యదర్శులు వీటిని రికార్డుల్లో నమోదు చేసి రశీదులు జారీ చేశారు. విలీనం తర్వాత పంచాయతీ రికార్డులు యధాతథంగా పురపాలిక స్వాధీనం చేసుకుంది. ప్రస్తుతం వాటిల్లో చాలావరకు నిర్మాణాలు జరుగుతున్నాయి. పురపాలిక అధికారులు సైతం పాత నంబర్లతోనే ఎలాంటి విచారణ లేకుండా అనుమతులు మంజూరు చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఆయా గ్రామాల నుంచి కలెక్టరేట్ ప్రజావాణిలో ఫిర్యాదులు సైతం వెల్లువెత్తుతున్నాయి.

**సంరక్షణ చర్యలు శూన్యం**

విలీన గ్రామాల్లో దాదాపు వందల ఎకరాల ప్రభుత్వ భూములు రికార్డుల్లో ఉంది. కొన్నిచోట్ల ప్రైవేటు, ప్రభుత్వ భూములను కలుపుకొని రియల్ వెంచర్లు కూడా వెలిశాయి. ఇటీవల చిన్నబోనాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కేటాయించిన భూమి ఆక్రమణకు గురైన తీరు వెలుగులోకి తీసుకొచ్చింది. దీనిపై స్పందించిన రెవెన్యూ అధికారులు ఆ స్థలంలో నాటువేసిన పొలాన్ని దున్నించారు. ఇలాంటివి విలీన గ్రామాల్లో వందల ఎకరాలున్నా.. సరైన సంరక్షణ చర్యలు చేపట్టడంలేదు.

# వసూళ్లు ఆగేనా!

గోదావరిఖని : గోదావరిఖని ప్రభుత్వాస్పత్రిలో ఒప్పంద కార్మికుల తీరు మారటం లేదు. రోగులకు ఉచితంగా అందించాల్సిన సేవలకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. పైగా ఇవ్వకపోతే వారినే దూషిస్తున్నారు. గర్భిణులు, రోగులను శస్త్రచికిత్సలకు సిద్ధం చేసేందుకు ఒక రేటు.. అనంతరం ఆపరేషన్ థియేటర్ నుంచి వార్డులోకి తరలించేందుకు మరో రేటు.. పడకలపై దుప్పట్లు మారిస్తే ఓ రేటు.. ఇలా ఖని ప్రభుత్వాసుపత్రిలోని ఒప్పంద పారిశుద్ధ్య కార్మికులు వసూళ్లకు పాల్పడుతున్నారు. డబ్బులు ముడితేనే పుట్టిన బిడ్డను చేతిలో పెట్టిన సంఘటనలున్నాయి. కొందరు పారిశుద్ధ్య కార్మికులు నెలల తరబడి ఆపరేషన్ థియేటర్‌కే పరిమితమై వసూళ్లకు పాల్పడుతున్నారు. రెండు రోజుల క్రితం అక్రమ వసూళ్లపై బాధితురాలి భర్త నేరుగా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్ ఆయావార్డుల్లోకి వెళ్లి బాలింతలు, రోగులతో మాట్లాడి అక్రమ వసూళ్లపై ఆరా తీశారు. ఆ సమస్యపై ఆయా వార్డుల్లోని వారంతా పాలనాధికారికి మొరపెట్టుకోవడంతో తక్షణమే ఇద్దరు పారిశుద్ధ్య కార్మికులను విధుల్లోంచి తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

**ఆది నుంచి అంతే**

ఆసుపత్రి ప్రారంభం నుంచి ఆపరేషన్ థియేటరులో అక్రమ వసూలు కొనసాగుతున్నాయి. మొదట్లో కొందరు వైద్యులు సైతం మామూళ్లకు ఆశ పడ్డారు. ఈ సమస్యపై అనేక సార్లు ఆసుపత్రి ముందు బాధితులు



ధర్నాలు చేశారు. అయినా ఆగకపోగా మరింత పెరుగుతూ వచ్చాయి. ఉచిత ప్రసవానికి ఆసుపత్రికి వస్తే డిశ్చార్జి నాటికి రూ.3వేలకు పైగా చెల్లించాల్సి వస్తోంది. ప్రసవమయ్యాక డబ్బులు ఇస్తేనే బిడ్డను ఇస్తామంటూ వేధించిన సంఘటనలున్నాయి. గత కొంతకాలంగా ఆసుపత్రి అభివృద్ధి, వైద్యసేవలు మెరుగుపరచటంపై శ్రద్ధ వహిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీహర్ష.. సదుపాయాల కల్పనకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నారు. తరచూ ఆసుపత్రిలో వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం ఆసుపత్రికి వచ్చిన ఆయన అక్రమార్జనకు పాల్పడుతున్న ఇద్దరు ఒప్పంద పారిశుద్ధ్య కార్మికులను విధుల్లోంచి తొలగించారు.

**వసూళ్లకు పాల్పడితే విధుల్లోంచి తొలగింపు**

రోగులు, బాలింతల నుంచి డబ్బులు వసూళ్లకు పాల్పడితే తక్షణమే విధుల్లోంచి తొలగిస్తామని గోదావరిఖని ప్రభుత్వాసుపత్రి రెసిడెంట్ మెడికల్ అధికారి రాజు హెచ్చరించారు. ఆసుపత్రిలో ఒప్పంద విధానంలో పనిచేసే పారిశుద్ధ్య, రక్షణ, రోగుల సహాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తే విచారణ లేకుండా విధుల్లోంచి తొలగిస్తామని స్పష్టం చేశారు. ఒప్పంద సిబ్బంది అక్రమ వసూళ్లతో ఆసుపత్రి ప్రతిష్ట దిగజారుతుందన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దయాల్‌సింగ్, ఒప్పంద పర్యవేక్షకులు, కార్మికులు పాల్గొన్నారు.

# స్టాంపు పత్రాల కొరత

ఖమ్మం : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో కొద్దిరోజులుగా నాన్ జుడీషియల్ స్టాంపు పత్రాల కొరత వేధిస్తోంది. ఖమ్మం, కొత్తగూడెం, ఇల్లెందు సహా వివిధ పట్టణాల్లో స్టాంపు వెండర్ల వద్ద నిల్వలు తగ్గాయి. ఇదే అదనుగా కొందరు వెండర్లు అధిక ధరకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆస్తుల క్రయవిక్రయాలు, మార్ట్‌గేజ్‌లు సహా వివిధ రకాల వ్యాపార సంబంధ లావాదేవీల సమయంలో స్టాంపు పత్రాలపై ఇరువర్గాల వారు ఒప్పందం రాసుకుంటారు. రూ.20, రూ.50, రూ.100 ముఖ విలువతో నాన్ జుడీషియల్ స్టాంపు పత్రాలను ప్రభుత్వం ముద్రించి విక్రయిస్తుంది. అఫిడవిట్ (ప్రమాణ పత్రం) కోసం రూ.20 పత్రం ఎక్కువగా ఉపయోగిస్తారు. ఇతరత్రా ఒప్పందాలకు అందుబాటులోని స్టాంపు పత్రాలు వాడుతుంటారు. రోజూ పెద్దమొత్తంలో లావాదేవీలు సాగుతుంటాయి.

**ఉభయ జిల్లాల్లో..**

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో స్టాంపు వెండర్లు 500 మందికి పైగా ఉన్నారు. రూ.100 ముఖ విలువ కలిగిన స్టాంపు పత్రాలు లేవని చెబుతున్నారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తున్నందున ఎవరి వద్ద ఎన్ని పత్రాలు ఉన్నాయనే వివరాలు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో తెలుస్తుంది. స్టాంపు




పత్రాల కొరత వల్ల వారం రోజులుగా ఖమ్మంలో వ్యాపార లావాదేవీలు నిలిచిపోయాయని పలువురు వాపోతున్నారు.

**ప్రత్యామ్నాయ పద్ధతులు**

స్టాంపు పత్రాలకు ప్రత్యామ్నాయ పద్ధతులు ఉన్నాయి. ఫ్రాన్‌కింగ్ యంత్రం ద్వారా కావాల్సిన విలువతో కాగితాలపై ముద్ర వేయించుకునే వీలుంది. ఇవి చెల్లుబాటవుతాయి. సహజంగా ఎక్కువ మొత్తం విలువ కావాల్సినవారు ఫ్రాన్‌కింగ్ యంత్రం ద్వారా ముద్రలు ఉపయోగిస్తారు. ఈ యంత్రాలు గతంలో కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే ఉండేవి. ఇటీవల కాలంలో ప్రైవేట్ స్టాంప్ వెండర్లకు సైతం కేటాయించారు. షార్ట్ లేబుల్స్ వంటి వాటిని కూడా ఉపయోగించవచ్చు. అయితే చాలామంది.. స్టాంపు పత్రాలపై రాసుకుంటేనే ఒప్పందంగా భావిస్తుంటారు. వాటిపైనే ఎక్కువ మందికి విశ్వాసంతో పాటు భరోసా కలుగుతుంది. మహారాష్ట్రలోని నాసిక్ ముద్రణాలయంలో నాన్ జుడీషియల్ స్టాంపు పత్రాలు ముద్రిస్తారు. ఆదివారం నాటికి హైదరాబాద్ చేరుకుంటాయి. అక్కడి నుంచి రెండు రోజుల్లో ఖమ్మం వస్తాయి. 2లక్షల స్టాంపు పత్రాలు కావాలని ప్రతిపాదన పంపించాం. ఎస్ఆర్ఓ కార్యాలయాలు, స్టాంప్ వెండర్లకు అందిస్తాం.
రవీందర్‌రావు, రిజిస్ట్రార్

# పట్టాలెక్కనున్న సౌర ప్లాంట్లు..!



కొత్తగూడెం : వ్యవసాయ క్షేత్రాల్లో సౌర వెలుగులు విరజిమ్మనున్నాయి. పీఎం-కుసుమ్ (ప్రధానమంత్రి కిసాన్ ఉర్జా ఏవం ఉత్థాన్ మహాభియాన్) పథకంలో భాగంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 42 ప్రాంతాల్లో సౌర ప్లాంట్ల ఏర్పాటుకు రెడ్కో అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. 2026 మార్చి 31 నాటికి ఈ పథకం గడువు ముగియనున్న నేపథ్యంలో వీలైనంత త్వరగా ప్లాంట్లు ఏర్పాటుచేయాలని భావిస్తున్నారు.

**అర్జీలు అధికంగా వచ్చినా..**

కేంద్రం ప్రవేశపెట్టిన పీఎం-కుసుమ్ పథకానికి ఉభయ జిల్లాల నుంచి దరఖాస్తులు భారీగా వచ్చినప్పటికీ.. అవన్నీ ప్లాంట్ల ఏర్పాటు దశ వరకు వెళ్లలేకపోయాయి. మొదట్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో సౌర ప్లాంట్లు నెలకొల్పాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. స్వయం సహాయక సంఘాలు దరఖాస్తు చేసుకున్నాయి. ఈపథకాన్ని కేవలం రైతుల పొలాల్లో మాత్రమే అమలుచేయాలని కేంద్రం నిర్ణయించటంతో మహిళా సంఘాల దరఖాస్తులను పక్కనపెట్టారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల నుంచి అందిన మొత్తం దరఖాస్తుల(251)లో 100 అర్జీలు మహిళా సంఘాలవే. మిగతా 151లో 80 దరఖాస్తులకు మాత్రమే ఈఎండీ(ఎర్నెస్ట్ మనీ డిపాజిట్)లు చెల్లించారు. ఇందులో 42 అర్జీలు.. 60.10 మెగావాట్లకు పీపీఏ(విద్యుత్తు కొనుగోలు ఒప్పందం) పూర్తయ్యి ప్లాంట్ల ఏర్పాటు దశకు చేరుకున్నాయి.

ఈఏడాది డిసెంబరు 31నాటికి సౌర ప్లాంట్లు ఏర్పాటుచేస్తాం. పీపీఏ పూర్తయిన దరఖాస్తుదారుల భూముల్లోకి విద్యుత్తు లైన్లు వేసేందుకు ఎన్‌పీడీసీఎల్ అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు. బ్యాంకు రుణాలు మంజూరవగానే ప్లాంట్ల ఏర్పాటు పనులు ప్రారంభిస్తాం.
– అజయ్‌కుమార్, టీజీ రెడ్కో మేనేజర్

**ఎదురైన ఇబ్బందులు..**

కేంద్ర ప్రభుత్వం రాయితీ కింద ప్లాంట్ల ఏర్పాటుకు అవకాశమిస్తుందనే అంచనాతో మొదట్లో చాలామంది అర్జీలు సమర్పించారు. ఒక మెగావాట్ ప్లాంట్ ఏర్పాటుకు నాలుగెకరాల భూమి, రూ.3కోట్లు వెచ్చించాలి. ఇందులో 70శాతం బ్యాంకు గ్యారంటీ, 30శాతం రైతు వాటా కింద చెల్లించాల్సి రావటంతో అధిక మంది ప్లాంట్ల ఏర్పాటుకు ఆసక్తి చూపలేదు. ప్లాంట్లు నెలకొల్పాలనుకునేవారు ఈఎండీల రూపంలో ముందుగానే మెగావాట్‌కు రూ.లక్ష చెల్లించాల్సి రావటంతో మరికొంతమంది వెనుకడుగు వేశారు.

విద్యుత్తు ఉపకేంద్రం నుంచి రైతు పొలం వరకు డెడికేటెడ్ లైన్‌ను దరఖాస్తుదారులే ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం సుమారు రూ.5-6లక్షలు ఖర్చవుతుంది. ఇదీ అవరోధంగా మారింది. అర్జీదారులు చెల్లించాల్సిన 30శాతం సొమ్మును ముందుగానే డిపాజిట్ చేయాలని బ్యాంకర్లు కోరుతున్నారు. సుమారు రూ.కోటి వరకు ముందస్తుగా బ్యాంకులో వేయటం రైతులకు కష్టంగా మారుతున్నట్లు తెలుస్తోంది.

పీపీఏలు పూర్తయినవి
ఖమ్మం: 32
భద్రాద్రి: 10
విద్యుత్తు సామర్థ్యం (మెగావాట్లలో)
48.60 11.50

# కరెంటు పోతే కష్టాలే!




కొత్తగూడెం : వర్షాకాలంలో అకాల విద్యుత్తు కోతలు తప్పవు. ముసురు వానలతో తడిచిన స్తంభాలు కూలడం, చెట్లు విరిగి పడటం వంటి ఆటంకాలతో సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. ఇలాంటి పరిస్థితుల్లోనూ ఆసుపత్రుల్లో వైద్యం అందించడానికి ప్రత్యామ్నాయంగా ఉపయోగించే డీజిల్ జనరేటర్ల సమస్య జిల్లా వ్యాప్తంగా వెంటాడుతోంది. 24 గంటల పాటు అందుబాటులో ఉండే ఆసుపత్రుల్లో జనరేటర్ వినియోగం అనివార్యం. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా డీఎంఈ పరిధిలోని పది ఆసుపత్రులు, తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీపీఎస్) పరిధిలో 97 ఆసుపత్రుల్లో డీజిల్ జనరేటర్లు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆయా ఆసుపత్రుల నుంచి ప్రతిపాదనలు పంపించారు. ఇందులో భాగంగా భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో 125 కేవీ సామర్థ్యం, బూర్గంపాడు, చర్ల సామాజిక ఆరోగ్య కేంద్రాల (సీహెచ్‌సీ)లో 58కేవీ సామర్థ్యం గల జనరేటర్లు అవసరమని ప్రతిపాదనలు పంపి నెలలు గడుస్తున్నా.. ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు.

**అత్యవసర వేళ అవస్థలే..** తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో ఇల్లెందు (100 పడకలు), అశ్వారావుపేట (100 పడకలు) భద్రాచలం (200 పడకలు), మణుగూరు (100 పడకలు) ఏరియా ఆసుపత్రులు, బూర్గంపాడు (30 పకడలు), చర్ల (30 పడకలు), పాల్వంచ (50 పడకలు) సీహెచ్‌సీలుఉన్నాయి. వీటిలో బూర్గంపాడు, చర్ల సీహెచ్‌సీల్లో పూర్తిస్థాయిలో జనరేటర్లు అందుబాటులో లేవు. సీహెచ్‌సీల్లో విద్యుత్తు సమస్యలు ఉత్పన్నమైనప్పుడు సమస్యలు తలెత్తుతున్నాయి. ఇన్ పేషంట్లు ఇబ్బందులకు గురవుతున్నారు. అత్యవసర సేవల సమయంలో ఆటంకాలు తలెత్తుతున్నాయి.

**ప్రధాన సేవలకు ఆటంకం..**

నిత్యం ప్రజలకు వైద్యసేవలు అందుబాటులో ఉండే సీహెచ్‌సీల్లో ప్రసవాలు జరుగుతున్నాయి. కాన్పుల సమయాలు, ఇతర శస్త్రచికిత్సలు, అప్పుడే పుట్టిన బిడ్డకు కామెర్లు ఇతరత్రా ఆరోగ్య సమస్యలున్నప్పుడు ఇంక్యుబేటర్లు, పిల్లలను వేడి బాక్సులలో పెట్టేందుకు చర్యలు తీసుకోవాల్సి వస్తుంది. ఇలాంటి సమయాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం తలెత్తితే అసౌకర్యాలు చోటుచేసుకుంటున్నాయి. ఒక్కోసారి పూర్తిస్థాయిలో వైద్య సేవలు నిలిచిపోతున్నాయి. నవజాత శిశువులకు పంకాలు లేక ఇబ్బందులు తప్పటం లేదు. ఈ విషయంపై డీసీహెచ్ఎస్ డాక్టర్ జి.రవిబాబు మాట్లాడుతూ.. ప్రతిపాదనలకు అనుగుణంగా నిధులు కేటాయించారని, టెండర్ ప్రక్రియ పూర్తవగానే జనరేటర్లు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అత్యవసర సమయాల్లో రోగులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.

# మీ ఆటకు కోటా ఉందా..!



ఖమ్మం : ఖమ్మం నగరానికి చెందిన ఓ సీనియర్ క్రీడాకారుడు తాను సాధన చేస్తున్న క్రీడాంశం స్పోర్ట్స్ కోటాలో ఉందని భావించారు. మిగిలినవారినీ ప్రోత్సహించటంతోపాటు తన ఇద్దరు పిల్లలనూ 17 ఏళ్లపాటు సాధన చేయించారు. ఎన్నో వ్యయప్రయాలను ఎదుర్కొన్నారు. ముంబై, దిల్లీ దేశంలో ఎక్కడ జాతీయ పోటీలు జరిగినా పిల్లల్ని తీసుకెళ్లారు. కొడుకు జాతీయ స్థాయి పోటీలో కాంస్యం సాధించారు. ఇటీవల హైదరాబాదులో కుమారుని ఎంసెట్ స్పోర్ట్స్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. అసలీ క్రీడాంశం కోటా జాబితాలోనే లేదని అధికారులు తిరస్కరించడంతో నోట మాటరాలేదు. తన పరిస్థితికి ఎవరికీ రావొద్దని ఆవేదన వెలిబుచ్చారు ఆటలు పిల్లల శారీరక ఎదుగుదలకు, మానసిక వికాసానికి దోహదపడే ఆరోగ్యకర ఔషధాలు. మార్కుల ప్రపంచానికి దూరంగా, పిల్లల ఆసక్తులను దగ్గరగా గమనించే తల్లిదండ్రులు చాలామంది విద్యార్థులు ఆడిపాడేలా ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలో వాళ్లలో దాగిఉన్న ప్రతిభ వెలుగుచూస్తుండటంతో ఆ దిశగా వెన్నుతడుతున్నారు. చదువుకు క్రీడా కోటా తోడైతే తమ పిల్లల జీవితం బాగుంటుందన్న ఆలోచననూ చేస్తున్నారు. వివిధ రకాల వ్యాపకాల్లో నిమగ్నమయ్యే తల్లిదండ్రులు స్పోర్ట్స్ కోటా జాబితాలో ఉన్న క్రీడాంశాలు ఏంటన్న దానిపై అవగాహన ఉండటం లేదు. తమకు నచ్చినవి, వాళ్లోవీళ్లో చెప్పారని వెళ్లి ఆ దిశగా ఊతమిస్తున్నారు. ఈ క్రమంలో కొందరు తీరా ఉన్నత విద్య ప్రవేశాల కౌన్సెలింగ్ సమయంలో 'మీ పిల్లవాడు ఆడే ఆటకు కోటానే లేద'ని చెబుతుండటంతో ఉసూరుమంటున్నారు. అప్పటికే రూ.వేలు, రూ.లక్షలు వెచ్చిస్తున్నారు. ఉద్యోగాలకు సంబంధించి క్రీడారిజర్వేషన్‌కు, ఉన్నత విద్యకు సంబంధించిన క్రీడా కోటాకు వైరుధ్యం ఉంటుందన్న విషయం తెలియకపోవటంతో ఇబ్బంది పడుతున్నారు..'స్పోర్ట్స్ కోటాను దృష్టిలో పెట్టుకొని క్రీడా రంగానికి వచ్చేవారు ముందుగా క్రీడాధికారులను సంప్రదించి, సలహా తీసుకోవాలి. స్టేడియం కార్యాలయంలో సంప్రదించవచ్చు. ఇక్కడి సీనియర్ శిక్షకులను సంప్రదిస్తే మరింత మేలు.'
– సునీల్‌రెడ్డి, డీవైఎస్ఓ

**వైద్య కోర్సులకు మినహాయించి..**

ఉన్నత విద్యకు క్రీడా కోటా 0.5 శాతం ఉంటుంది. జాబితాలో 31 అంశాలున్నాయి. విలువిద్య, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాల్‌బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, కానోయింగ్, కయాకింగ్, చెస్, క్రికెట్, సైక్లింగ్, ఫెన్సింగ్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్‌బాల్, హాకీ, జూడో, కబడ్డి, ఖోఖో, స్కేటింగ్, రోయింగ్, సెయిలింగ్, షూటింగ్, సాఫ్ట్‌బాల్, స్విమ్మింగ్, టీటీ, తైక్వాండో, టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, యోగా అంశాలు ఉన్నాయి. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులు మినహాయించి ఇంజినీరింగ్, అగ్రికల్చరల్, ట్రిపుల్ ఐ.టి, బీఫార్మసీ, ఐసెట్, ఇసెట్, బి.ఆర్క్, ఎంబీఏ, ఎడ్‌సెట్, పీసెట్, లాసెట్, డైట్ సెట్, పాలిసెట్, ఐ.టి.ఐ కోర్సుల్లో చేరేవారికి ఈ క్రీడా విభాగాల్లో చూపిన ప్రతిభ ఆధారంగా వెసులుబాటు ఉంటుంది.

**పారాహుషార్..!**స్పోర్ట్స్ కోటా వివరాలు ఆన్‌లైన్లో ఉంటాయి.

ఉద్యోగాల భర్తీలో కేంద్ర, రాష్ట్ర కోటాల మధ్య తేడా ఉంటుంది. కేంద్రం ఒలంపిక్ సంఘం గుర్తించిన క్రీడాంశాలు 28, రాష్ట్రం 31 క్రీడాంశాలను పరిగణలోకి తీసుకుంటాయి. కొలువుల భర్తీలో ఒక్కో శాఖ ఒక్కో విధంగా తమకు అవసరమైన క్రీడాంశాలు ఎంచుకుంటుంది.

చాలా అంచెలు అధిగమిస్తేనే ఉద్యోగ రిజర్వేషన్ల కోటాకు అర్హత సాధిస్తుంటారు. ఈ నేపథ్యంలో జిల్లాలో చాలామంది తల్లిదండ్రులు ఉన్నత విద్యలో క్రీడా రిజర్వేషన్‌పై ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. ఆ దిశగా పిల్లలను ప్రోత్సహిస్తున్నారు. ఇలాంటి వారు ఉభయ జిల్లాల్లో వేలమంది ఉన్నారు. వీరికి తప్పనిసరిగా ప్రాథమిక అవగాహన ఉండాలని క్రీడా నిపుణులు సూచిస్తున్నారు.

# పల్లెల్లో అభివృద్ధి బాటలు

ఖమ్మం: ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని పల్లెల్లో అంతర్గత రహదారులు, గ్రామాలను అనుసంధానించే రోడ్లను బలోపేతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వివిధ పథకాల ద్వారా నిధులు కేటాయిస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై), గ్రామీణ రహదారుల నిర్మాణం (సీఆర్ఆర్, సీఆర్ఆర్-ఎస్సీ సబ్‌ప్లాన్), ఫ్లడ్ డ్యామేజ్ రిపేర్(ఎఫ్‌డీఆర్), స్టేట్ డిజాస్టర్ రెస్పాండ్ ఫండ్(ఎస్డీఆర్ఎఫ్) కింద ఖమ్మం జిల్లాకు రూ.1,073.36 కోట్లు, భద్రాద్రి జిల్లాకు రూ.227.15 కోట్లు మంజూరయ్యాయి. ఆయా నిధులతో మొత్తం 1,764 పనులు చేపట్టాల్సి ఉంది.

**గుత్తేదారులు ముందుకొస్తే..**

పల్లెల అభివృద్ధికి బాటలు వేయటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేస్తున్నా.. గుత్తేదారుల వల్ల ఆలస్యమవుతున్నాయి. ఖమ్మం జిల్లాలో 1,041 రోడ్లకు గాను ఇప్పటివరకు 179 మాత్రమే పూర్తికాగా, 207 నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయి. భద్రాద్రి జిల్లాలో 723 రోడ్లకు 67 పూర్తయ్యాయి. 71 రహదారుల నిర్మాణాలు కొనసాగుతుండగా.. 585 పనులు పట్టాలెక్కలేదు. గుత్తేదారులు ముందుకొచ్చిన చోట అధికారులు త్వరగా నిర్మాణాలు పూర్తిచేయిస్తున్నారు.



కొన్ని రహదారులకు టెండర్లు పిలిస్తే గుత్తేదారులు రావటం లేదు. రెండు, మూడుసార్లు పిలుస్తున్నారు. ఒకసారి టెండర్ నిర్వహణకు 20 రోజుల నుంచి నెల వరకు సమయం పడుతుండటం, ఒప్పందం జరిగాక పనులు మొదలుపెట్టడానికి సమయం కోరుతుండటంతో నిర్మాణాలు సకాలంలో పూర్తికావటం లేదు.

**చర్చలతో సఫలం**

పాలేరు నియోజకవర్గంలో బీటీ, సీసీ రోడ్ల నిర్మాణాలను పూర్తిచేయడానికి రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇటీవల గుత్తేదారులతో సమావేశమైనట్లు తెలిసింది. పెండింగ్ బిల్లుల వివరాలు తెలుసుకొని రహదారుల నిర్మాణాలు త్వరగా పూర్తిచేస్తే బిల్లులు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని భరోసా ఇచ్చినట్లు సమాచారం. ప్రజాప్రతినిధులు చొరవ చూపిన చోట పనులు త్వరగా పట్టాలెక్కుతుండగా.. కొన్ని మాత్రం టెండర్ దశను దాటడం లేదు. 'గుత్తేదారులు ముందుకు రాకపోవడంతో పనులు ఆలస్యమవుతున్నాయి' అని పంచాయతీరాజ్‌శాఖ ఎస్ఈ వెంకట్‌రెడ్డి తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టాక టెండర్లు పూర్తిచేసి రహదారులు నిర్మిస్తామని చెప్పారు.

# బాల్యం.. బలహీనం..!

ముదిగొండ: చిన్నారులకు పోషకాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పోషక విలువలున్న ఆహారాన్ని అందిస్తున్నారు. అయినా జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల్లో పోషకాహార లోపం కనిపిస్తోంది. ఇది వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు వెళుతున్న చిన్నారుల్లో ఎత్తుకు తగిన బరువు, వయసుకు తగిన పొడవు ఉండటంలేదు. అంగన్‌వాడీ సిబ్బంది కేంద్రాలకు వచ్చే చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచినట్లు నమోదవుతున్నా పోషకాహార లోపంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు.

**జిల్లాలో ఇదీ పరిస్థితి..**

చిన్నారులకు ఆటపాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్య, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించే లక్ష్యంతో అంగన్‌వాడీ కేంద్రాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయి. జిల్లాలో మధిర, కల్లూరు, సత్తుపల్లి, కామేపల్లి, ఖమ్మం గ్రామీణం, ఖమ్మం అర్బన్, తిరుమలాయపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 1,840అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో



ఐదేళ్లలోపు చిన్నారులు 67,458 మంది ఉన్నాయి. ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 227 మంది చిన్నారులు అతి తీవ్రమైన పోషకాహార లోపంతో ఉన్నట్లు గుర్తించారు. మధ్యస్థ పోషకాహార లోపం ఉన్న చిన్నారులు 2094 మంది ఉన్నారు. నిర్ణీత ప్రమాణాలకంటే చాలా తక్కువ బరువు ఉన్న చిన్నారులు 654 మంది, మధ్యస్తంగా తక్కువ బరువున్న చిన్నారులు 3544 మంది ఉన్నారు. వీరిని అంగన్‌వాడీ కేంద్రాల వారీగా గుర్తించినప్పటికీ వారిపై ప్రత్యేక శ్రద్ధ కరవవుతోంది. ఉన్నాతాధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరిచి పోషకాహార లోపంతో ఉన్నవారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ప్రత్యేక దృష్టి**

రాంగోపాల్‌రెడ్డి, జిల్లా సంక్షేమాధికారి

పోషకాహారలోపం, తక్కువ బరువు ఉన్న చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. చిన్నారుల బరువు, ఆరోగ్య విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

# చిరు వ్యాపారులకు 'బెంగ'ళూరు

హైదరాబాద్: బెంగళూరులో కొన్ని రోజులుగా చిరు, వీధి వ్యాపారులు నగదు ఇవ్వాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం భాగ్యనగరంలోనూ కొన్ని హోటళ్లలో యూపీఐ స్కానర్‌లు అందుబాటులో ఉంచడం లేదు.నగదు ఇవ్వాలని స్పష్టంగా చెబుతున్నారు. సికింద్రాబాద్‌లోని ఓ ప్రధాన హోటల్‌లో కూడా ఇదే పరిస్థితి. ఇందుకు బెంగళూరులో చిరువ్యాపారులకు జీఎస్టీ చెల్లించాలని నోటీసులు ఇవ్వడమే కారణమని చెబుతున్నారు. రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ అధికారి ఒకరు మాట్లాడుతూ చిరు వ్యాపారులకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని అన్ని లావాదేవీలను పరిశీలిస్తుంటామన్నారు. **అక్కడ ఏం జరిగిందంటే..:** బెంగళూరుకు చెందిన సుమారు 14 వేలమంది చిరు వ్యాపారులకు ఆ రాష్ట్ర జీఎస్టీ శాఖ నోటీసులు ఇచ్చింది. వారు జరిపిన డిజిటల్ చెల్లింపుల లావాదేవీలు జీఎస్టీ మినహాయింపు పరిమితికి మించి ఉన్నాయని నోటీసుల్లో పేర్కొన్నారు. వస్తువుల విక్రయానికి సంబంధించి ఏడాదికి టర్నోవర్ రూ.40 లక్షలు, సేవలకు సంబంధించి ఏడాదికి రూ.20 లక్షలు మించితే జీఎస్టీ పరిధిలోకి వస్తారు.

చురకలు



## పుర పీఠమెక్కేదెవరు?

మార్కాపురం: మార్కాపురం పురపాలక సంఘం ఛైర్మన్ పీఠం గత రెండు నెలలుగా ఖాళీగా ఉండడం విమర్శలకు తావిస్తోంది. పట్టణంలో మొత్తం 35 వార్డులుండగా, గత ఎన్నికల్లో తెదేపా 5 వార్డుల్లో మాత్రమే గెలుపొందింది. అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పలువురు వైకాపా కౌన్సిలర్లు తెదేపా గూటికి చేశారు. దీంతో సంఖ్యాబలం పెరగడంతో జూన్ 11న కౌన్సిల్‌లో ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి నెగ్గడంతో ఛైర్మన్ పీఠం నుంచి వైకాపాకు చెందిన బాలమురళీకృష్ణ దిగిపోవాల్సి వచ్చింది. అయితే ఇది జరిగి రెండు నెలలకు పైగా కావస్తున్నా ఛైర్మన్ పీఠంపై కూటమి నేతలు కూర్చోవాల్సి ఉన్నా ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తు



తున్నాయి. దీనిపై తెదేపా నేతలు, కార్యకర్తల్లో అసహనం వ్యక్తమవుతోంది. అటు వార్డుల్లో కూడా ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదని కౌన్సిలర్లు బహిరంగంగా విమర్శిస్తున్నారు. సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో కూడా తెలియడం లేదని వాపోతున్నారు. మున్సిపల్ చట్టం సెక్షన్ 46 ప్రకారం నెలకొకసారి క్రమం తప్పకుండా కౌన్సిల్ సమావేశం నిర్వహించాల్సి ఉన్నా నిర్వహించక పోవడంతో పాలనా పరమైన వ్యవహారాలు స్తంభించిపోయాయి. ఛైర్మన్ ఎన్నికపై ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత లేకపోవడం గమనార్హం.

## అక్రమాలకు అడ్డుకట్ట!

ఒంగోలు :గ్రామాల సుస్థిరాభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తోంది. ఇందులో భాగంగా 'స్వర్ణ పంచాయతీ' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తద్వారా డిజిటల్ సేవలు విస్తరించాలని సంకల్పించింది. దీంతో ప్రపంచంలో ఎక్కడ నివాసం ఉంటున్నా సొంతూరులోని ఇంటితోపాటు ఇతరత్రా భవనాలకు ఇక నుంచి నేరుగా ఆన్‌లైన్‌లోనే ఆస్తిపన్ను చెల్లించొచ్చు. తాజాగా 'స్వర్ణ పంచాయతీ'ల్లో భాగంగా డిజిటల్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. గ్రామీణ ప్రాంతాల్లో నివాసగృహాలు, ఇంటి పన్నుల వివరాలు వంద శాతం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ ఆదేశించింది. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయాల సిబ్బంది అసెస్‌మెంట్ల వారీగా భవన వివరాలను నమోదు చేశారు. జిల్లాలో 729 గ్రామ పంచాయతీలు ఉండగా, నివాసాలు, ఇతరత్రా ఆస్తులకు సంబంధించి 4,73,447 అసెస్‌మెంట్లు ఉన్నాయి. 2025-26 సంవత్సరానికి ఇంటి పన్ను డిమాండు రూ.31.60 కోట్లు ఉంది. ఏటా గ్రామపంచాయతీలకు ఇంటి పన్నుల రూపంలో సమకూరే సాధారణ నిధులు దుర్వినియోగమవుతున్నాయి. ఇప్పటికే జిల్లాలోని సింగరాయకొండ, మద్దిపాడు, నాగులుప్పలపాడు, సంతనూతలపాడు మండలాల పరిధిలోని పంచాయతీల్లో లక్షలాది రూపాయలు దుర్వినియోగమయ్యాయి. అందుకు బాధ్యులైన వారిపై ఇప్పటికే చర్యలు తీసుకున్నా నిధుల వసూలుపై మీనమేషాలు




లెక్కిస్తున్నారు. ప్రతి రోజూ ఏదోక పంచాయతీ నుంచి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇంటి, నీటి పన్నుల వసూళ్ల నుంచే పారదర్శకత తీసుకురావాలన్న ఉద్దేశంతో గత వైకాపా ప్రభుత్వం డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా ప్రతి పంచాయతీలో డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించేందుకు స్కానర్‌ను కూడా ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో అమల్లోకి వచ్చేసరికి స్థానికులకు అవగాహన కల్పించకపోవడంతో డిజిటల్ లావాదేవీల విధానం అటకెక్కింది. తాజాగా కూటమి ప్రభుత్వం డిజిటల్ లావాదేవీల అమలుకు శ్రీకారం చుట్టింది. గ్రామాల్లోని నివాసాలతో పాటు ఇతర భవన నిర్మాణాలకు సంబంధించిన పన్ను వివరాలను స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. వ్యాపార లైసెన్స్‌లు, భవన నిర్మాణ అనుమతులు, వివాహ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు..ఇలా పలు సేవలను ఇక నుంచి ఆన్‌లైన్‌లోనే పొందొచ్చు.

## వైకాపా పాపం... వైద్యానికి శాపం!

ఒంగోలు : చిత్రంలో కనిపిస్తోంది దొనకొండ మండలంలో అర్ధంతరంగా నిలిచిపోయిన విలేజ్ హెల్త్‌క్లినిక్ భవనం. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణం చేపట్టిన గత వైకాపా ప్రభుత్వం నిధులివ్వకుండా గాలికొదిలేసింది. ఫలితంగా జిల్లాలోని 241 గ్రామాల ప్రజలకు వైద్యసేవలు దూరమయ్యాయి. గతంలో రెండు మూడు గ్రామాలకు కలిపి ఒక



ఆరోగ్య ఉపకేంద్రం ఉండగా, గత వైకాపా హయాంలో ఆ విధానం రద్దు చేసి విలేజ్ హెల్త్ క్లినిక్‌లను తెరపైకి తెచ్చింది. 2020లో చేపట్టిన భవనాల నిర్మాణం ఇప్పటికీ పూర్తికాలేదు. జిల్లాలో పాత భవనాలు 49 ఉండగా, కొత్తగా 489 మంజూరు చేసి నిర్మాణ బాధ్యతలు పంచాయితీరాజ్‌శాఖకు అప్పగించారు. ఒక్కో భవనానికి తొలుత రూ.17 లక్షలు మంజూరు చేశారు. సకాలంలో నిధులివ్వకుండా జాప్యం చేయడంతో అంచనాలు పెరిగిపోవడంతో రూ.20.50 లక్షలకు పెంచారు. నాలుగేళ్లలో 248 భవనాలు నిర్మించగా, మిగిలిన 241లో 65 అసలు ప్రారంభమే కాలేదు. మిగిలినవి వివిధ దశల్లో నిలిచిపోయాయి. వీటి నిర్మాణాలు పూర్తిచేసేందుకు సుమారు రూ.17.60 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు.

## మీ కోసమే 'న్యాక్'..!



గాజువాక : నిరుద్యోగ యువతకు తగిన వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడానికి నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్(న్యాక్) సంస్థ చర్యలు చేపడుతోంది. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శాఖ పరిధిలో ఈ సంస్థ విశాఖ నగరంలో మహారాణిపేట, పెదగంట్యాడలో శిక్షణ కేంద్రాలను నడుపుతోంది. 2021లో ఏర్పాటు చేసిన ఈ సంస్థ ద్వారా ఎందరో నిరుద్యోగులు స్వల్పకాలిక కోర్సుల్లో శిక్షణ పొంది ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకున్నారు.కూటమి ప్రభుత్వం ప్రతి జిల్లాలో రెండు నుంచి మూడు న్యాక్ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చింది. స్కిల్ అప్‌గ్రేడేషన్ కింద 10 రోజుల శిక్షణ కూడా ఇస్తోంది. ఉచిత శిక్షణతోపాటు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తోంది. ఏడాది కాలంలో వివిధ కోర్సుల కింద సుమారు వెయ్యి మంది అభ్యర్థులు లబ్ది పొందారు. నిపుణుల పర్యవేక్షణలో కోర్సు పూర్తి చేసే అవకాశం ఉంది. శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వ సర్టిఫికెట్ అందిస్తారు. వివిధ సంస్థల్లో ఉద్యోగాల కల్పనకు చర్యలు తీసుకుంటారు.

శిక్షణ వీటిలో...

అసిస్టెంట్ ప్లంబర్ జనరల్

సర్వేయర్, ఎలక్ట్రీషియన్

జూనియర్ టెక్నీషియన్ స్మార్ట్ ఎనర్జీ మీటర్ (3 నెలలు, 10 రోజులు)

షెడ్యూల్డ్ కులాల వారికి ప్రత్యేకంగా ఫ్రంట్ ఆఫీస్ అసిస్టెంట్ కోర్సు.

ఉపాధి పొందేందుకు ఈ కోర్సులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

విద్యార్హత: పదోతరగతి పాస్‌లేదా ఫెయిల్

వయసు: 15 నుంచి 45 ఏళ్ల వరకూ..

## జలవనరుల హననం..!



రాజమహేంద్రవరం: కొన్ని వేల ఎకరాలకు సాగునీటి భరోసా అందించే చెరువులవి.. అక్రమార్కుల కన్ను వాటిపై పడడంతో చూస్తుండగానే బక్కచిక్కిపోయాయి. కొన్ని చోట్ల పంటలు సాగు చేస్తుండగా ఇంకొన్నిచోట్ల నిర్మాణాలు చేపట్టారు. వీటిపై దృష్టిసారించిన కూటమి ప్రభుత్వం జలవనరులు, పంచాయతీరాజ్ పర్యవేక్షణలో ఉన్నవాటిపై సమగ్ర సర్వే చేపట్టింది. దీంతో అక్రమార్కుల బండారం వెలుగుచూస్తోంది. ఇప్పటికి రాజమహేంద్రవరం డివిజన్‌లో ఒకటి, కొవ్వూరు డివిజన్ పరిధిలో 11 చోట్ల మాత్రమే ఆక్రమణలు తొలగించారు. **అత్యధికంగా రాజానగరం, నల్లజర్లలోనే..**

రాజానగరం మండల పరిధిలో 250 చెరువులున్నాయి. 33 చోట్ల 271 మంది 101 ఎకరాలను ఆక్రమించారు. పంటలు, దుకాణాలు, ప్రార్థనా మందిరాలు కనిపిస్తున్నాయి. ఇంతవరకు కనీస చర్యలు లేవు. నల్లజర్లలో 110 చెరువులకుగాను 29 చోట్ల ముప్పై నాలుగు ఎకరాలను 111 మంది ఆక్రమించారు.

గోకవరంలో 120 వనరులుండగా ఆరు ప్రాంతాల్లో 42 మంది పదెకరాల్లో పాగా వేశారు.రాజమహేంద్రవరం గ్రామీణంలో 39 చెరువులు కనిపిస్తున్నాయి. వీటిలో 8 చోట్ల 489 మంది 12 ఎకరాలు కబ్జా చేశారు. అధికారులు 0.8 ఎకరాలను స్వాధీనం చేసుకున్నారు. చాగల్లులో 15 సాగునీటి వనరులుండగా అన్నిచోట్లా ఆక్రమణలే. 93 మంది దాదాపు 5 ఎకరాలు ఆక్రమించి దర్జాగా అనుభవిస్తున్నా పట్టడం లేదు. తాళ్లపూడి మండల పరిధిలో 46 వనరులకుగాను పది ప్రాంతాల్లో 6.15 ఎకరాలు ఆరుగురి చేతుల్లో ఉంది. అక్కడి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బిక్కవోలులో ఒక చెరువును 62 మంది ఆక్రమించి 1.03 ఎకరాలను సొంతానికి వినియోగిస్తున్నారు. ఉండ్రాజవరంలో 22 చెరువుల్లో ఇరవైరెండు మంది పాగా వేసి రెండెకరాలు, నిడదవోలులో 1.05 ఎకరాలను మరికొందరు కబ్జా చేశారు.

**సాగుకు కష్టాలు...**

గోకవరం మండలం అచ్యుతాపురంలో రాజు చెరువు గర్భం అన్యాక్రాంతమవడంతో నిల్వ సామర్థ్యం తగ్గి ఏటా నీటి కష్టాలు తప్పడం లేదు. 56 ఎకరాల్లోని చెరువు సగం మేర ఆక్రమణల్లో ఉంది. శివారులోని వీర్లంకపల్లి వద్ద ఉన్న రాజు చెరువు, గాదెలపాలెంలో ఇసుకపల్లివారి చెరువు, తంటికొండలోని బద్దిరెడ్డివారి చెరువులదీ ఇదే పరిస్థితి.

**తొలగించేందుకు చర్యలు..**

మండల స్థాయిలో సాగునీటి వనరుల ఆక్రమణలను గుర్తించి రెవెన్యూ అధికారులు ఆ జాబితాలను జలవనరులశాఖ అధికారులకు అప్పగించారని ఓ ఉన్నతాధికారి తెలిపారు. సంబంధిత శాఖల సమన్వయంతో కబ్జాలు తొలగించి, పూర్తి ఆయకట్టుకు నీరందేలా చర్యలు చేపడతామన్నారు.

**ఇదీ లెక్క**

తూర్పులో చెరువులు : 2,571

విస్తీర్ణం : 16 వేల ఎకరాలు

అక్రమార్కులు : 1210 మంది

కబ్జాకు గురైన చెరువులు : 143

అన్యాక్రాంతమైన విస్తీర్ణం : 200 ఎకరాలు

## పుష్కర.. ఆయకట్టుకు ఆసరా



కాకినాడ : జిల్లాలో మెట్ట ఆయకట్టుకు కీలకమైన పుష్కర ఎత్తిపోతల పథకానికి సంబంధించి రైతులకు తీపి కబురు అందింది. గత వైకాపా పాలకుల నిర్లక్ష్యంతో మూలకు చేరిన ఈ పథకాన్ని పట్టాలెక్కించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. 31 వేల ఎకరాలకు మేలు జరిగేలా అడుగులు వేసింది. రూ.52 కోట్ల అంచనాతో చేపట్టే కొత్త పైప్‌లైన్‌కు రాష్ట్ర మంత్రివర్గం గురువారం ఆమోదం తెలిపింది. త్వరలో కార్యరూపంలోకి తెచ్చి ఆయకట్టు రైతులకు సాగునీటి భద్రతను కల్పించేందుకు సిద్ధమవుతున్నారు.

గండేపల్లి మండలం తాళ్లూరు శివారు పోలవరం కాలువ గట్టుపై తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం ఉంది. దీని పైపులైన్లు పాడైపోవడంతో గత మూడు ఖరీఫ్ సీజన్లలో ఆయకట్టు రైతులకు నీరు అందించలేకపోయారు. గండేపల్లి, జగ్గంపేట మండలాల పరిధిలో సుమారు 3.56 కి.మీ మేర మూడు వరుసల్లో సిమెంటు పైపులున్నాయి. పథకం నుంచి నీటిని విడిచిపెట్టేటప్పుడు ఒత్తిడికి ఈ పైపులు ఎక్కడికక్కడ పగుళ్లు ఏర్పడి లీకేజితో నీరంతా వృథాగా పోతుంది. శివారు భూములకు చేరడం గగనంగా మారేది. కొన్నాళ్ల నుంచి ఈ పైపులైన్ల స్థానంలో ఇనుప పైపులు వేయాలని ప్రతిపాదనలు పంపిస్తున్నా ఫలితం లేకుండా పోయింది. వైకాపా హయాంలో సీఎస్సార్ నిధులతో కొంతమేర మరమ్మతులు చేసినా అవి మూన్నాళ్ల ముచ్చటగానే మారిపోయాయి. నాలుగు మండలాల పరిధిలో 31 వేల ఎకరాలకు సాగు ప్రశ్నార్థకమైంది.

**ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి..**

పుష్కర ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించాలని ఇటీవల జడ్పీ సర్వసభ్య సమావేశంలో జగ్గంపేట ఎమ్మెల్యే నెహ్రూ అధికారులను కోరారు. ప్రాజెక్టు దుస్థితిని, రైతుల అవస్థలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో నిధులు సాకారమయ్యాయి. ఈ నెలలోనే టెండర్లు పిలిచి గుత్తేదారులకు అప్పగించి పనులు త్వరితగతంగా అయ్యేలా చూస్తామని నెహ్రూ చెబుతున్నారు.

## అక్రమానికి.. అధికారిక అండ!

అమలాపురం : ఓడలరేవు రెవెన్యూ పరిధిలో 947/1, 947/2ఏ సర్వే నంబర్లలో 12 ఎకరాల వరకు సీఆర్‌జడ్ పరిధిలోకి వస్తుంది. ఇక్కడ తవ్విన చెరువులకు 939 సర్వే నంబరుపై తీసుకున్న మత్స్యశాఖ ధ్రువీకరణ పత్రం ద్వారా విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు దరఖాస్తు చేశారు. స్థానికులు వ్యతిరేకిస్తున్నా.. ఓ నాయకుడు అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకువస్తున్నట్లు సమాచారం. సఖినేటిపల్లి, మలికిపురం, మామిడికుదురు మండలాల సీఆర్‌జడ్ పరిధిలో 550 ఎకరాల్లో అనధికారిక ఆక్వా సాగు జరుగుతోంది. ఎన్జీటీ ఆదేశించినా పూర్తి స్థాయిలో తొలగించలేదు.ఓడలరేవులో ఒకరు ట్రాన్స్‌ఫార్మర్‌కు దరఖాస్తు చేశారు. ఇక్కడి చెరువులు సీఆర్‌జడ్‌కు 500 మీటర్లకు లోపల ఉన్నా.. 543 మీటర్లుగా అధికారులు తప్పుడు నివేదిక ఇచ్చారు. కోస్టల్ రెగ్యులేషన్ జోన్(సీఆర్‌జడ్) పరిధిలో రొయ్యల చెరువులు, ఇతర నిర్మాణాలు ఉండకూడదని జాతీయ హరిత ట్రైబ్యునల్ నిబంధనలు ఉన్నా.. కొంతమంది వీటిని తుంగలోకి తొక్కుతున్నారు. కొందరు అధికారులు అక్రమార్కులకు అండదండలు అందించడంతో వీరి ఆగడాలకు అడ్డుకట్ట పడటం లేదు.

**తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో..**

రొయ్యల చెరువుల సాగుదారులు అనుమతులకు దరఖాస్తు చేసుకున్న సర్వే నంబర్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలి. అవి సీఆర్‌జడ్ పరిధిలోకి



వస్తాయా..? జిరాయితీయా..? డి.పట్టా భూములా..? అనే విషయాలను పూర్తి స్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలి. కొందరు రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు మామూళ్లకు అలవాటుపడి తప్పుడు ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వీటిని పరిశీలించకుండానే ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చేస్తున్నారు.

**తనిఖీలు నామమాత్రం**

అక్రమ విద్యుత్తు వినియోగాన్ని అడ్డుకునేందుకు ట్రాన్స్‌కోలో విజిలెన్స్ విభాగం ఉంది. ఇక్కడి అధికారులు, సిబ్బంది ఫిర్యాదులు వచ్చిన ప్రతిసారీ నామమాత్ర తనిఖీలు నిర్వహించి అంతా సవ్యంగా ఉందని వెళ్లి పోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతంలో అక్రమార్కులకు అడ్డూఅదుపు లేకుండాపోతోంది.

**ఇతరులకు అమ్ముతూ..**

కొంతమంది ఇతర ప్రాంతాల్లోని సర్వే నంబర్లతో సీఆర్‌జడ్ పరిధిలో విద్యుత్తు కనెక్షన్లు ఏర్పాటు చేస్తున్నారు. వీరికి ప్రభుత్వం నుంచి విద్యుత్తు రాయితీ వస్తోంది. మళ్లీ వీరు పక్కన ఉన్న చెరువులకు యూనిట్ రూ.6 నుంచి రూ.9 వరకు విక్రయిస్తుండటం గమనార్హం.


**గుర్తించి చర్యలు తీసుకుంటాం**

సీఆర్‌జడ్ పరిధిలోని విద్యుత్తు కనెక్షన్లపై సర్వే నిర్వహిస్తాం. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో కనెక్షన్లు తీసుకున్నవారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం. అనధికారికంగా విద్యుత్తు అమ్ముతున్నట్లు విచారణలో తేలితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

రాజేశ్వరి, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్

## సేద్యపు కుంట.. ఉండదు నీటిచింత..!

రాజమహేంద్రవరం: నీటి వనరుల పునరుద్ధరణతో భూగర్భ జలాలు వృద్ధి, నీటి సంరక్షణపై కూటమి సర్కారు దృష్టి సారించింది. వర్షపు నీటిని సద్వినియోగం చేసుకునేలా సాగు భూముల్లో సేద్యపు కుంటల తవ్వకాలను ప్రోత్సహిస్తోంది. జిల్లాలోని మెట్టప్రాంతంలో ఎక్కువ శాతం వ్యవసాయం వర్షాధారంపైనే ఆధారపడి ఉంది. వర్షం కురిసినప్పుడు ఆ నీటిని సేద్యపు కుంటల్లోకి మళ్లించి సాగు అవసరాలకు వినియోగించుకునేలా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) ద్వారా ఈ ఏడాది జిల్లాలో 1,500 సేద్యపు కుంటలు తవ్వాలని లక్ష్యంగా నిర్దేశించింది. జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ఆధ్వర్యంలో ఎంపిక చేసిన 11 మండలాల పరిధిలోని 198 గ్రామాల్లో నీటి కుంటల తవ్వకానికి అనువుగా ఉన్న ప్రదేశాలు గుర్తించింది. ఉపాధి క్షేత్ర సహాయకులు (ఫీల్డ్ అసిస్టెంట్లకు) మండలాల



వారీగా శిక్షణ అందించారు. మొదట 1,229 సేద్యపు కుంటల తవ్వకాలకు పరిపాలన ఆమోదం కూడా లభించింది. ఏప్రిల్, మే నెలల నుంచి ఉపాధి కూలీలతో పంట భూములు, పండ్ల తోటల్లో పనులు ప్రారంభించి, ఇప్పటి వరకు 772 సేద్యపు కుంటల తవ్వకాలు పూర్తి చేశారు. మరో 200 చోట్ల పనులు పురోగతిలో ఉన్నాయి. ఇంకా 257 సేద్యపు కుంటల తవ్వకం పనులు ప్రారంభించాల్సి ఉంది. త్వరలోనే ఆ పనులు కూడా చేపట్టి లక్ష్యాన్ని పూర్తి చేస్తామని డ్వామా పీడీ నాగమల్లేశ్వరరావు చెబుతున్నారు.

తమ పొలాల్లో, పండ్ల తోటల్లో సేద్యపు కుంటలు ఏర్పాటుకు ముందుకొచ్చిన రైతులకు పైసా ఖర్చు లేకుండానే ఎన్ఆర్‌జీజీఎస్ నిధులతోనే వాటి తవ్వకాలు చేపడుతున్నారు. ఒక్కొక్కదానికి రూ.40 వేల నుంచి రూ.1.40 లక్షల వరకు నిధులు వెచ్చించి రూ.276 సగటు వేతనంతో ఉపాధి కూలీలతో తవ్వకాలు చేపడుతున్నారు.

## ప్రకృతి సాగు.. ఆదాయం బాగు!

అనంతపురం : ప్రకృతి సాగు పద్ధతిలో వ్యవసాయం రైతుల పాలిట కల్పతరువుగా మారుతోంది. కొద్దిపాటి విస్తీర్ణం.. తక్కువ పెట్టుబడులతో రైతులు స్వల్పకాలిక పంటలు సాగు చేస్తుండడంతో దిగుబడులతోపాటు రోజువారీగా ఆదాయం పొందుతున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో సుమారు 8,600 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. మొత్తం రైతులు 4,500 మందికి పైగా ఉన్నారు. వారిలో 80 శాతం మందికిపైగా మహిళలు ఉండటం విశేషం. పురుగు మందులు లేకుండా సేంద్రియ విధానంలో ఘన, ద్రవ జీవామృతం, పేడ, వేప నూనె.. తదితరాలు వినియోగించి కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నారు.

**కుటుంబానికి ఆసరా..** – భాగ్యమ్మ, మల్లిపల్లి



ఎకరాలో వేరుసెనగ, టమాటాతోపాటు 20 సెంట్లలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నా. రూ.5 వేలు పెట్టుబడి పెట్టా. 15 రోజులకే ఆకుకూరలు, 25 రోజులకు కూరగాయలు చేతికి వస్తున్నాయి. రోజుకు రూ.4,500 ఆదాయం వస్తోంది.


**రోజుకు రూ.5 వేల సంపాదన–** గంగమ్మ, భట్టువానిపల్లి

ఏడాదిగా ప్రకృతి పంటల సాగు చేస్తున్నాం. 25 సెంట్లల్లోనే కూరగాయల పంటలు వేశా. క్వింటాలు నుంచి రెండు క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. కళ్యాణదుర్గంతోపాటు బళ్లారి మార్కెట్లకు తీసుకెళ్లి విక్రయిస్తున్నాం. రోజుకు రూ.5 వేల వరకు ఆదాయం వస్తుంది.

## 'స్మార్ట్' రేషన్‌కార్డులొచ్చాయ్..!

పుట్టపర్తి, : కూటమి ప్రభుత్వం నిర్ణయంతో జిల్లాలోని రేషన్‌కార్డుదారులకు 'స్మార్ట్' రేషన్‌కార్డులు పంపిణీ చేసేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే జిల్లాకు అవసరమైన కార్డులు సహాయ పౌర సరఫరాల అధికారి (ఏఎస్‌ఓ), మండల కార్యాలయాలకు చేరాయి. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాగానే, పంపిణీ ప్రారంభిస్తారు.

**అర్హులందరికీ...:** ఇటీవల జిల్లా వ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల కోసం 45,582 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 43,101 మందిని అర్హులుగా తేల్చారు. 2481 దరఖాస్తులు విచారణ దశలో ఉన్నాయి.



కొత్తగా అర్హులైన వారికి, ఇప్పటికే కార్డులు ఉన్న వారందరికీ స్మార్ట్ కార్డులు అందిస్తారు. వైకాపా పాలనలో జగన్ ఫొటోతో కార్డులు జారీ చేశారు. ఇప్పుడు కొత్తగా ఇవ్వబోయే కార్డులపై ఏ నాయకుల ఫొటోలు ఉండవు. విశాఖ జిల్లాలో ప్రస్తుతం 5,24,989 రేషన్‌కార్డులు ఉన్నాయి. వాటి స్థానే 5,17,149 స్మార్ట్‌కార్డులు వచ్చాయి. మిగిలిన 7,840 కార్డులు సాంకేతిక పరమైన సమస్యల కారణంగా రాలేదు. ఆయా సమస్యల్ని పరిష్కరించిన తర్వాత వాటినీ జారీ చేస్తారు.

ప్రత్యేక యాప్ సిద్ధం: కార్డుల పంపిణీకి ప్రత్యేకంగా ఓ యాప్ సిద్ధం చేశారు. ఆ యాప్‌లో కార్డుదారుల పేర్లు నమోదు చేయాల్సి ఉంటుంది. గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా పంపిణీ చేయాలా..?, రేషన్ డిపోల వద్ద ఇవ్వాలా...? అనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. ఒకటి రెండు రోజుల్లో కార్డుల పంపిణీకి సంబంధించిన మార్గదర్శకాలు వచ్చే అవకాశం ఉందని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు తెలిపారు.

## లెక్కల్లో యూనిట్లు.. కానరాక ఇక్కట్లు

మయూరికూడలి : విజయనగరానికి చెందిన ఓ ఆటో చోదకుడు రాయితీ రుణం ద్వారా కొత్త వాహనం కొనుగోలు చేయాలని భావించాడు. బీసీ విభాగం కింద దరఖాస్తు చేశాడు. ముఖాముఖికి హాజరయ్యాడు. బ్యాంకు అధికారులు వివిధ రకాల ధ్రువపత్రాలు తీసుకున్నారు. అయితే ఇప్పటివరకు యూనిట్ మంజూరు కాలేదు. ఇటీవల అప్పు చేసి కొనుగోలు చేశాడు. పేద, మధ్యతరగతి వర్గాలను ఆదుకోవాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం వివిధ కార్పొరేషన్లను ప్రారంభించింది. వాటి ద్వారా స్వయం ఉపాధి కల్పించేందుకు యూనిట్లు మంజూరు చేస్తామని చెప్పింది. ఈమేరకు బీసీ, ఈబీసీ, ఎస్సీ, మైనార్టీ వర్గాల నుంచి అధికారులు దరఖాస్తులు ఆహ్వానించారు. బీసీ, ఈబీసీ వారికి ముఖాముఖిలు సైతం నిర్వహించారు. కానీ ఇప్పటివరకు ఒక్కరికీ లబ్ధి కలగలేదు.

**సాయం ఇలా..** రూ.3 లక్షల విలువైన యూనిట్ ఏర్పాటు చేసుకుంటే అందులో 50 శాతం(బీసీ వారికి) వరకు రాయితీ దక్కుతుంది. మిగిలిన సొమ్మును బ్యాంకుల నుంచి రుణంగా పొందవచ్చు. మిగిలిన వారు 40 శాతం నుంచి 50 శాతం వరకు సబ్సిడీ పొందవచ్చు. అయితే నిధులు రాకపోవడంతో బ్యాంకర్లు వెనకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది.

**ఒక్కటీ లేదు..**

బీసీ, ఈబీసీ, మైనార్టీ, ఎస్సీ వర్గాల్లో 21 సంవత్సరాలు దాటిన వారికి యూనిట్లు కేటాయించాలి. 150 రకాల జీవనోపాధులు పొందే అవకాశం కల్పించారు. విభాగాల వారీగా దరఖాస్తులు తీసుకున్నారు. రెండు జిల్లాలకు సంబంధించి 5,863 యూనిట్లు కేటాయించారు. ఈమేరకు రూ.137.52 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే సుమారు 49,850 దరఖాస్తులు అందాయి. తొలి విడతలో ఈబీసీ, బీసీ వారికి మౌఖిక పరీక్షలు చేపట్టారు. అందులో అర్హులైన వారిని గుర్తించి, ధ్రువపత్రాలను బ్యాంకర్లకు అందించారు. అనంతరం క్షేత్రస్థాయిలో పరిశీలించి, యూనిట్లు కేటాయించాలి. ఇంతవరకు ఆ ప్రక్రియ కానరావడం లేదు. **నాయకుల దోపిడీ..** దరఖాస్తుదారులకు యూనిట్లు మంజూరయ్యేలా చూస్తామని కొందరు ప్రజాప్రతినిధులు, నాయకులు దోపిడీ చేశారు. ఓ నియోజకవర్గంలో రూ.లక్షల్లో వసూలు చేశారనే ఫిర్యాదులు వెల్లువెత్తాయి. మరోవైపు మౌఖిక పరీక్షల సమయంలో కుల, ఆదాయ, ప్రాజెక్టు రిపోర్టు తదితర ధ్రువపత్రాలను ఇచ్చారు. వీటి కోసం కార్యాలయాల చుట్టూ తిరిగారు. దీంతో కొందరు అధికారులకు సైతం డబ్బులివ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏర్పాటుకు సంబంధించి ఇప్పటివరకు ఆదేశాలు రాలేదని, త్వరలోనే చర్యలు తీసుకుంటామని బీసీ, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు పెంటోజీరావు, వెంకటేశ్వరరావు తెలిపారు.

# బోలెడు దూరం.. రవాణా భారం



పాడేరు: వాహనం రోడ్డెక్కాలంటే సామర్థ్య ధ్రువీకరణ (ఫిట్‌నెస్ సర్టిఫికెట్) తప్పనిసరి. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో అత్యధిక మండలాల వాహనదారులు ఈ ధ్రువపత్రం తెచ్చుకోవడానికి ఆపసోపాలు పడాల్సి వస్తోంది. ఒకరోజు మొత్తం వెచ్చిస్తే తప్ప ఈ ధ్రువపత్రం చేతికిరాని పరిస్థితి.

సబ్బవరం హైవేకి సమీపంలో పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) పద్ధతిలో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. ఇక్కడ యంత్ర పరికరాలతో వాహనాలను తనిఖీ చేసి సామర్థ్యానికి అనుగుణంగా ఉందా.. లేదా అని ధ్రువీకరిస్తారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 22 మండలాలు, నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలోని 12 మండలాల వాహన యజమానులకు ఈ కేంద్రం చాలా దూరంలో ఉంది. అల్లూరి జిల్లాలోని గూడెంకొత్తవీధి, కొయ్యూరు, ముంచంగిపుట్టు మండలాల్లోని కొన్ని గ్రామాల ప్రజలు ముందురోజు రాత్రి బయలుదేరితే తప్ప సబ్బవరం ఉదయానికి చేరుకోలేని పరిస్థితి. ఒకవైపు ప్రయాణానికే 150 కిలోమీటర్లకు పైగా దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. అనకాపల్లి జిల్లాలోనూ నర్సీపట్నం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి 100 కి.మీ ప్రయాణించాల్సి వస్తోందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నర్సీపట్నం ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయం పరిధిలో 3400 ఆటోలు, సుమారు 800 మ్యాక్సీ క్యాబ్‌లు, 82 ప్రైవేట్ బస్సులు, 190 స్కూల్ బస్సులు, ఉన్నాయి. మిగిలిన వాహనదారులతో పోలిస్తే కంటే.. ఆటో యజమానులే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లకు ఎక్కువ ఇబ్బంది పడుతున్నారు. ఆటో కొనుగోలు చేసిన తర్వాత మొదటి నాలుగేళ్లు రెండేళ్లకు ఒకసారి, ఆ తర్వాత ప్రతి ఏడాది ఫిట్‌నెస్ చేయించుకోవాలి. రోజూ నర్సీపట్నం చుట్టుపక్కల నుంచి 80కిపైగా ఆటోలు సబ్బవరం ఏటీఎస్‌కి వెళ్తున్నట్లు ఆటో కార్మిక సంఘం నాయకులు చెబుతున్నారు. చలానాకు అయ్యే ఖర్చుతోపాటు అదనంగా మరో రూ. 1000 ఖర్చు అవుతోందని... దీనికితోడు ఒకరోజు ఆదాయం కోల్పోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నర్సీపట్నం చుట్టుపక్కల మరో ఏటీఎస్ ఏర్పాటు చేస్తే.. ఏజెన్సీ మండలాలకు, నర్సీపట్నం పరిసర గ్రామాల వాహనదారులకు మేలు జరుగుతుంది.

**కొరవడిన పర్యవేక్షణ..** ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీలో మధ్యవర్తుల ప్రమేయం, అవినీతి లేకుండా, పారదర్శకత కోసం ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ప్రభుత్వం ఆటోమేటేడ్ టెస్టింగ్ స్టేషన్ విధానాన్ని తీసుకొచ్చింది. కానీ.. వాహనాల సామర్థ్యాన్ని సరిగా తనిఖీ చేస్తున్నారా.. లేదా? అనేది ఎవరూ చెప్పలేని పరిస్థితి. వాస్తవానికి వీటి నిర్వహణపై జిల్లా రవాణా అధికారుల పర్యవేక్షణ ఉండాలి. కానీ వారికి దీంతో ఏ సంబంధం లేకుండాపోయింది. ఏటీఎస్ నిర్వహణ, దూరాభారంపై జిల్లా రవాణా శాఖ అధికారి మనోహర్‌తో మాట్లాడగా.. గతంలో వాహనాల సామర్థ్య పరిశీలన, ధ్రువపత్రాల జారీ తమ పరిధిలో ఉండేదని తెలిపారు. సబ్బవరం ఏటీఎస్ నిర్వహణతో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

# అసత్యం.. అసభ్యం



అనంతపురం : భావప్రకటన స్వేచ్ఛ కొందరి అనుచిత పోస్టుల కారణంగా దుర్వినియోగం అవుతోంది. సమాజాన్ని ప్రభావితం చేసేలా ఇతరుల వ్యక్తిగత విషయాలతో దూషణలు, తిట్లతో కూడిన వీడియోలను విపరీతంగా పోస్టు చేస్తున్నారు. తెలిసో, తెలియక చేసే పోస్టులు, లైకులు, షేర్ల కేసుల రూపంలో మెడకు చుట్టుకునే అవకాశం ఉంది.

**నేరపూరితం..**

ఉద్దేశపూర్వకంగా గానీ, దురుద్దేశంతో కానీ వ్యక్తిత్వ హననానికి పాల్పడే సమాచారాన్ని ప్రజలకు చేరవేయకూడదు. అసత్యాలు ప్రచారం చేయకూడదు. ఎదుటి వ్యక్తులు కుటుంబాలను ఉద్దేశించి దూషిస్తూ అసభ్యకరంగా పోస్టులు పెట్టరాదు. వీటికి లైకులు కొట్టడం ఇతరులకు ఫార్వర్డ్ చేయడం నేరం. ప్రజల మధ్య కులాలు, మతాల మధ్య విద్వేషాలు రగిల్చే పోస్టులు చేస్తే జైలుకు వెళ్లక తప్పదు. చదువులు, ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లే వారిపై కేసులు నమోదైతే పోలీసులు ఎన్‌వోసీ ఇవ్వరు.

**కొత్తచట్టాలతో కొరడా**

భారతీయ న్యాయసంహిత ఐటీ యాక్టు కింద నేరాల చట్టాలు ఉన్నాయి. వాటి వివరాలు క్లుప్తంగా..

ప్రముఖుల పేర్లతో కించపర్చే పోస్టులు పెడితే – 66 ఐటీయాక్ట్ కింద కేసు.. ( నేరం రుజువైతే మూడేళ్ల జైలు, రూ.లక్ష వరకు జరిమానా). అసభ్యకర పోస్టులు అప్‌లోడ్ చేస్తే – 67 ఐటీయాక్టు కింద కేసు (నేరం రుజువైతే ఐదేళ్ల జైలు, రూ.10 లక్షల జరిమానా) ఫిర్యాదు చేయవచ్చు..

డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.సైబర్‌క్రైమ్.జీవోవీ.ఇన్ వెబ్‌సైటులో ఫిర్యాదును రిజిస్టర్ చేయవచ్చు. వాటిని అధికారులు పరిశీలించి కేసులు నమోదు చేస్తారు.

**36 కేసులు..**

అనంతపురం జిల్లాలో ఈ ఏడాది.. ఇప్పటివరకు 36 మందిపై కేసులు నమోదు చేశారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్‌లపై విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టారు. ఇలాంటి వాటిపై పర్యవేక్షణకు జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్‌లో ప్రత్యేక విభాగం ఉంది. నలుగురు పోలీసు అధికారులు నిత్యం పరిశీలిస్తున్నారు.

# వైద్యసేవలు అరకొరే!




పుట్టపర్తి : రాష్ట్రంలోనే ఎక్కడా లేనివిధంగా కృత్రిమ పళ్లు ఇక్కడే తయారు చేసి రోగులకు అమర్చేవారు. ఇందుకుగాను 2019లో ఏర్పాటు చేసిన ఆధునిక ల్యాబ్ మూతపడింది. ప్రస్తుతం టెక్నీషియన్ ఒక్కరే ఉన్నారు. దీంతో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలోని జిల్లా ఆసుపత్రి ఎంతో కీలకమైంది. 200 పడకల సామర్థ్యం ఉన్న ప్రభుత్వ వైద్యశాలకు హిందూపురం, మడకశిర, పెనుకొండ, గోరంట్ల తదితర ప్రాంతాలతోపాటు కర్ణాటకలోని సరిహద్దు గ్రామాల నుంచి నిత్యం ఓపీ విభాగానికి 800 నుంచి 1000 మంది వస్తుంటారు. ఇక 50 మందికిపైగా ఇన్‌పేషెంట్లుగా ఉంటున్నారు. 42 మంది వైద్యులకుగాను 32 మంది, 47 మంది నర్సులకుగాను 36 మంది పనిచేస్తున్నారు. వైద్యులకు ఫేషియల్ అటెండెన్స్ అమలులో ఉన్నా కొందరు ఇలా వచ్చి.. హాజరు వేసి వెళ్లిపోతున్నారు. దీంతో దూరప్రాంతాల నుంచి వచ్చే రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఓపీ చీటీ కోసం గంటల తరబడి వరుసలో నిలబడాల్సిన పరిస్థితి. ప్రత్యేక ఓపీ కౌంటర్ల విభాగం పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. ఎమ్మెల్యే బాలకృష్ణ ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయించారు. గత ఐదేళ్లలో నిర్వహణపై వైకాపా ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో సేవలు మందగించాయి. గైనిక్ వార్డులో పలు కేసులను అనంతపురానికి సిఫార్సు చేస్తున్నారు.

సీటీ స్కాన్ అత్యవసరం. రూ.కోటి విలువచేసే యంత్రం మరమ్మతులకు నోచుకోవడం లేదు. శవపరీక్ష గది శిథిలావస్థకు చేరుకోవడంతో సమీపంలోని ధోబీ గదిలో తాత్కాలికంగా పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు.

**తగిన చర్యలు తీసుకుంటున్నాం**

– అన్నపూర్ణ, ఆసుపత్రి సూపరింటెండెంట్

వైద్యులు సమయపాలన పాటించేవిధంగా పర్యవేక్షిస్తాం. గైనిక్ వార్డుకు పరికరాలు వచ్చాయి. త్వరలోనే సేవలు అందుబాటులోకి తెస్తాం. దంత చికిత్స విభాగంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. రోగులకు ఇబ్బంది తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

## రూ.కోట్లు ఖర్చు.. తాగునీరొస్తే ఒట్టు!

విజయనగరం : గత ప్రభుత్వంలో జరిగిన జల్‌జీవన్ మిషన్ తొలి విడత పనుల్లో డొల్లతనం చోటుచేసుకుంది. 2020–2024 మధ్య నాలుగేళ్లపాటు దశలవారీగా వేసిన కుళాయిలు ఎక్కడా పనిచేయడం లేదు. మూణ్నాళ్లకే పైపులైన్లు పాడవడంతో నీరు రాని పరిస్థితి. ఇష్టారాజ్యంగా నాణ్యత లేకుండా పనులు చేశారు. ఏళ్లపాటు మన్నిక వచ్చేలా భూమి తవ్వి వేయాల్సిన పైపులైన్లు బయటే వేశారు. ఫలితంగా రూ.కోట్లు ఖర్చు చేసినా ఆశయం నెరవేరలేదు. నీరొస్తుందని సంబరపడ్డ పల్లె జనం ఇప్పుడు పాట్లు పడుతున్నారు.

**50 శాతం పాడై..**

బొబ్బిలి నియోజకవర్గంలో గతంలో రూ.22 కోట్లతో 176 పనులు చేపట్టారు. వీటిలో 40 శాతం వరకు పనులు పాడయ్యాయి. 50 శాతం కుళాయిలు మరమ్మతులకు గురయ్యాయి. ట్యాప్‌లు ఊడిపోవడం, పైపులైన్లు సక్రమంగా లేకపోవడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. మెట్టవలసలో రూ.30 లక్షలు, ఎం.బూర్జివలసలో రూ.15 లక్షలు, కోమటిపల్లిలో రూ.15 లక్షలు చొప్పున ఖర్చు చేసినా కుళాయిలు చాలా వరకు విరిగిపోయాయి.

గజపతినగరం నియోజకవర్గంలో రూ.7.6 కోట్లతో 162 గ్రామాల్లో ఇంటింటి కుళాయిలను ఏర్పాటు చేశారు. డోలపాలెం న్యూ కాలనీలో పైపులైన్లు సిమెంటు కట్టలు పాడవడంతో బయటకు కనిపిస్తున్నాయి. పైపులు మురుగు కాలువలో పడిపోగా స్థానికులు కర్రల సాయంతో పైకి తీసి, పెట్టారు. గజపతినగరం రైల్వే కాలనీలో నీరు సరఫరా కావడం లేదు. రెండోదశలో పాడైన కుళాయిలు సరిచేస్తామని గ్రామీణ నీటిసరఫరా విభాగం గజపతినగరం డీఈ తిరుపతినాయుడు అన్నారు.



**వైకాపా కార్యకర్తలకే అప్పగించి..**

జలజీవన్ మిషన్‌లో గత ప్రభుత్వం హయాంలో రూ.5 లక్షలలోపు పనులు నామినేషన్ పద్ధతిన గ్రామాల్లోని వైకాపా కార్యకర్తలకే అప్పగించారు. కార్యకర్తలకు లబ్ధి చేకూర్చాలన్న ఉద్దేశంతో పనులు అలా విభజించి ఇచ్చారు. ఆ సమయంలో అధికారులు ప్రశ్నించకపోవడంతో ఇష్టానుసారంగా నాసిరకం పైపులు, కుళాయిలు వేయడంతో తక్కువ కాలంలోనే పాడయ్యాయి.

**బాగుకు ప్రతిపాదనలు**

పాడైన పైపులు, కుళాయిలు సరిచేసేందుకు ఇప్పుడు రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. తెర్లాం మండలం నందబలగ, కుసుమూరు, నందిగాం గ్రామాల్లో వేసిన కుళాయిలు పనిచేయడం లేదు. వీటి మరమ్మతులకు అదనంగా మరో రూ.40 లక్షలు అవసరమని ప్రతిపాదనలు సిద్ధం చేయడం గమనార్హం. లోపాలు గుర్తిస్తున్నామని, సరిచేసేందుకు చర్యలు తీసుకుంటాని సంబంధిత బొబ్బిలి డీఈ ఢిల్లీశ్వరరావు అన్నారు.

**అరకొరగా జరిగాయి..– కవిత, పర్యవేక్షక ఇంజినీరు, గ్రామీణ నీటి సరఫరా విభాగం** గతంలో నిధులు తక్కువగా రావడంతో అరకొర పనులే జరిగాయి. కొన్ని పనులను పంచాయతీ నిధులతో చేయాలనుకున్నా అక్కడా లేకపోవడంతో వీలు కాలేదు.

## రైతులను కా'పాడి'కోవాలని..!

ఒంగోలు: ఒంగోలు డెయిరీని తెరిపించేందుకు జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. ప్రధానంగా పాడి పరిశ్రమపై ఆధారపడిన కుటుంబాలు పెద్దసంఖ్యలో ఉన్నందున డెయిరీ తెరచుకుంటే జిల్లా అభివృద్ధిలో ఎంతో కీలకంగా మారుతుంది. ఈ నేపథ్యంలో జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ (ఎన్‌డీడీబీ)కు డెయిరీని అప్పగిస్తే ఎలా ఉంటుందన్న ప్రతిపాదన తెరపైకి తీసుకొచ్చారు. ఎన్‌డీడీబీ అధికారులను రప్పించివారితో మాట్లాడిన తరువాత నిర్ణయానికి రావాలని జిల్లా ఉన్నతాధికారులు భావిస్తున్నారు. 'గత నలభై ఏళ్లుగా పాలు పోస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ వచ్చాను.. కళ్ల ముందు డెయిరీ నిర్జీవంగా మారడం చూడలేకున్నా.. తక్షణం చర్యలు తీసుకుని తెరిపించేందుకు చర్యలు తీసుకోండి.. అని ఓ పాడి రైతు సంయుక్త కలెక్టర్ గోపాలకృష్ణ ఎదుట ఆవేదన చూస్తే డెయిరీపై ఇక్కడి వారి ఆకాంక్షలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం పాల ఉత్పత్తిదారులు, డెయిరీ మాజీ పాలకవర్గ సభ్యులు, అధికారులతో జేసీ సమావేశం నిర్వహించారు. డెయిరీ తెరవడం ఎలా అనేదానిపై సమాలోచనలు జరపడాన్ని రైతులు స్వాగతిస్తున్నారు. ప్రస్తుతం డెయిరీకి రూ.43 కోట్ల బకాయిలు ఉన్నాయి. వాటిని తీర్చడంతోపాటు తెరిచేందుకు ప్రభుత్వపరంగా




చేయాల్సిన సాయంపైన చర్చ నడిచింది. ఎన్‌డీడీబీతో సంప్రదింపులు జరపాలని నిర్ణయానికి వచ్చారు.

**గతంలో నిర్వహించింది ఈ సంస్థే..**

గుజరాత్ రాష్ట్రం ఆనంద్ నగరంలో నెలకొన్న ఎన్‌డీడీబీ దేశంలోని పాడి పరిశ్రమకు కొండంత అండగా నిలుస్తోంది. మూతపడిన వాటిని తెరిపించి సొంతంగా నిర్వహణ చేపడుతోంది. సుమారు 18 ఏళ్ల కిందట ఇదే ఒంగోలు డెయిరీని ఈ సంస్థ ఐదేళ్ల పాటు నడిపి లాభాల్లోకి తీసుకొచ్చింది. తరువాత ఒంగోలు డెయిరీ పాలక వర్గం చేతుల్లోకి రావడంతో ఈ సంస్థ నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకుంది. పాలకవర్గం సభ్యులు ఇష్టానుసారం నిధులు దుర్వినియోగం చేసి నష్టాల పాల్జేసి మూతపడేలా చేశారు. 2021లో తీసుకున్న అమూల్ సంస్థ ఏడాదిన్నర పాటు నడిపి చేతులెత్తేసింది. ఇక అప్పటి నుంచి మూలకు చేరింది. తిరిగి ఎన్‌డీడీబీని ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు. ఆ సంస్థకు డెయిరీని నిర్ణీత సమయం పాటు లీజుకు ఇస్తే, వాళ్లే పెట్టుబడి పెట్టి నిర్వహిస్తారు. ఎన్‌డీడీబీ అధికారులతో మాట్లాడిన తరువాత సాధ్యాసాధ్యాలు ఎంత వరకు అనేది ఒక నివేదిక వస్తే గానీ స్పష్టత రాదు. జిల్లా ఉన్నతాధికారులు డెయిరీ విషయంలో మెరుగ్గానే వ్యవహరిస్తున్నారని, ఇదే ఊపుతో తెరిపించేందుకు శాయశక్తుల కృషి చేయాలని పాల ఉత్పత్తిదారులు కోరుతున్నారు.

# అవుకు ఆరో గేటు అధోగతి

అవుకు : రాయలసీమ జీవనాడి అవుకు జలాశయాన్ని నిర్లక్ష్యం నీడలు వెంటాడుతున్నాయి. కీలకమైన క్రస్ట్ గేట్లు మొదలు కట్టలు, కాల్వలకు నీటిని అందించే తూముల(గేట్ల) వరకు అన్నింటా సమస్యలు నెలకొన్నాయి. జలాశయంలో పూర్తిస్థాయి నీటిని నిల్వ చేయలేని దుస్థితి నెలకొంది. మరమ్మతుల విషయంలో అంతులేని జాప్యం కొనసాగుతోంది. నిధుల కోసం అధికారులు పంపిన నివేదికలను గత వైకాపా ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది.

**పలకల అమరికలో ఎప్పుడో**

జలాశయం గేట్లు బలోపేతం చేయడానికి వీలుగా పలకలు ఏర్పాటు చేయాల్సి ఉంది. జలాశయ ఆయకట్టు పరిధిలోని కాల్వలకు నీటిని విడుదల చేయాలన్నా.. ఆపివేయాలన్నా నిపుణులు వస్తేతప్ప పనులు సాగని పరిస్థితి దాపురించింది. తూములు తెరవడానికి వీలుగా పలకలకు అమర్చిన ఇనుప రాడ్డు తుప్పు పట్టి పలకతో సంబంధం తెగిపోయింది. తాత్కాలికంగా అప్పటికప్పుడు మరమ్మతులు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. తుప్పుపట్టిన పలకల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

**నిధులు సమకూరినా**

రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చొరవతో మరమ్మతులకు రూ.కోటి



మంజూరు చేయించారు. ప్రస్తుతం నిధులు ఉన్నా పనులు చేపట్టడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. గుత్తేదారు అవసరమైన సామగ్రిని సమకూర్చుకున్నా నత్తనడకన పనులు కొనసాగుతున్నాయి.

**నీటి ప్రవాహం మాటేంటి..**

గోరుకల్లు జలాశయం నుంచి గాలేరు-నగరి, ఎస్సార్బీసీ ద్వారా అవుకు జలాశయానికి సమకూరే నీటిని దిగువన ఉన్న మైలవరం కాల్వ, గండికోట కాల్వలకు అందించాల్సి ఉంది. గతేడాది గండికోట కాల్వ ద్వారా దిగువన ఉన్న జలాశయాలకు దాదాపు 60 టీఎంసీల నీటిని అందించారు. ప్రస్తుతం ఏ మేరకు అందిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. అవుకు జలాశయంలో 4.18 టీఎంసీల నిల్వ ఉంచడానికి వీలున్నా మరమ్మతుల కారణంగా 2 టీఎంసీలకు మించి నిల్వ చేయడానికి అధికారులు సాహసించడంలేదు.

**ప్రధాన గేట్ల వద్ద ఆగని లీకేజీ** జలాశయానికి ఆరు గేట్లు ఉండగా వాటి పలకలు తుప్పుపట్టి, రబ్బరు బీడింగ్ ఊడిపోయింది. ప్రత్యేకించి నాలుగు, ఆరు గేట్ల వద్ద అమర్చిన ఇనుప పలకలు తుప్పు పట్టడంతో చీలికలు ఏర్పడ్డాయి. నీటి మట్టం పెరిగితే గేట్ల నుంచి నీటి వృథా తప్పదు. గేట్ల నియంత్రణకు ఉద్దేశించిన మోటార్లు, ఇనుప తీగలు నిరుపయోగంగా మారాయి.జలాశయం పరిధిలోని తిమ్మరాజు కట్ట వద్ద ఏర్పడిన లీకేజీ ఆందోళన కలిగిస్తోంది. నిపుణులు పరిశీలించి ఇప్పటికిప్పుడు వచ్చిన ప్రమాదంలేదని చెబుతున్నారు. జలాశయంలో పూర్తి స్థాయిలో నీటిని నిలువరించలేక పోతున్నారు. ఇలాంటి పరిస్థితే పాలేరు కట్టవద్ద నెలకొంది.

# 'డ్రోనా'లీమణులు

నంద్యాల : డ్రోన్ చేతిలో ఉంటే.. ఎనిమిది నిమిషాల్లో ఎకరం పొలంలో 'విత్తు'కోవచ్చు.. ఐదు నిమిషాల్లో పురుగు మందు పిచికారీ చేయొచ్చు.. ఇప్పటికే పలువురు డ్రోనాస్త్రంతో ఉపాధి పొందుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని డ్వాక్రా మహిళల చేతికి డ్రోన్లు అందించాలని 'కూటమి' ప్రభుత్వం నిర్ణయించింది. సాగుబడిలో కీలకంగా ఉన్న మగువలు డ్రోన్ రాకతో మరింత ఉపాధి పొందడానికి వీలుంటుంది. ఉమ్మడి జిల్లాలో 61 డ్రోన్లు రానున్నాయి.. వీటి వినియోగంపై మహిళలకు ఇప్పటికే పది రోజులపాటు శిక్షణ ఇచ్చారు.

**80 శాతం రాయితీతో పంపిణీ**

'నమో డ్రోన్ దీదీ' పథకం కింద డ్రోన్లు 80 శాతం రాయితీతో అందజేయనున్నారు. డ్రోన్ ధర రూ.10 లక్షలు ఉంటే.. రూ.8 లక్షల రాయితీ ఇస్తారు.. మిగిలిన రూ.2 లక్షలు బ్యాంకు లింకేజీ లేదా స్త్రీనిధి రుణం అందించనున్నారు.

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవీవై), సబ్ మిషన్ ఆఫ్ అగ్రికల్చర్ మెకనైజేషన్ (ఎస్‌ఎంఏఎం) పథకాల ద్వారా 40 శాతం ఇస్తున్నారు. పది లీటర్ల సామర్థ్యం ఉన్న డ్రోన్ల వ్యయం సుమారు రూ.10 లక్షలు కాగా కేంద్రం రూ.4 లక్షల రాయితీ, బ్యాంకులు రూ.5 లక్షలు రుణంగా ఇస్తున్నాయి. పది శాతం రైతు సంఘాలు, లేదా స్వయం సహాయక సంఘాలు భరించాల్సి ఉంటుంది.

**61 మంది ఎంపిక**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 10 లక్షల హెక్టార్లలో 7.31 లక్షల మంది రైతులు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. వీరిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరికి మరింత చేయూత ఇవ్వాలన్న ఉద్దేశంతో డ్రోన్లు ఇవ్వనున్నారు. స్వయం సహాయక సంఘాల్లో సభ్యులై ఉండి.. పదో తరగతి పూర్తి చేసిన 'భూ' యజమానులైన మహిళలను ఎంపిక చేశారు. కర్నూలు జిల్లాలో 31 మంది, నంద్యాలలో 30 మందిని ఎంపిక చేశారు. వీరిలో కర్నూలుకు చెందిన ఐదుగురికి తాంద్రపాడులో శిక్షణ ఇచ్చారు.


**నిత్యం రూ.5 వేల ఆదాయం**

డ్రోన్‌లో ఉంటే కంటెయినర్ (డబ్బా) పది లీటర్లు/ పది కిలోల బరువు మోస్తుంది. అందులో విత్తనాలు నింపి చల్లొచ్చు.. 2 కి.మీ. వరకు ప్రయాణిస్తుంది. సుమారు 265 అడుగుల ఎత్తు ఎగురుతుంది. ఎకరా భూమికి సరిపడా విత్తనాలు ఎనిమిది నిమిషాల వ్యవధిలో చల్లుతుంది.

నిత్యం 75-100 ఎకరాల్లో మందులు పిచికారీ చేయొచ్చు. క్రిమిసంహారక మందు మొక్క అడుగు నుంచి పైవరకు తడుస్తుంది. ఎకరా పొలంలో 5-10 నిమిషాల్లోనే పూర్తవుతుంది. ఎకరాకు రూ.500 చొప్పున ఒక రోజులో 10 ఎకరాలు పిచికారీ చేస్తే రూ.5 వేలు సంపాదించొచ్చు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం వంద మంది వరకు ఇలా ఉపాధి పొందుతున్నారు.

**సాగులో ఖర్చులు తగ్గుతాయి** పది రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ఎక్కడెక్కడ వాడాలో వివరించారు. మాకు ఆరెకరాల పొలం ఉంది. డ్రోన్ వాడకంతో సాగు ఖర్చులు తగ్గి, పనులు వేగంగా చేసుకోవచ్చు. నీటి వినియోగం తగ్గుతుంది. మా పొలంలో వినియోగించుకున్న తర్వాత అవసరమైతే పక్క పొలాల వారికి అద్దెకిస్తాం. వీజీ భవాని, కప్పట్రాళ్ల, దేవనకొండ

# సాగాలి తోడుగా.. ఉండాలి నీడగా



విశాఖపట్నం :: నగరంలో నివాసముంటున్న ఓ యువకుడు (19) గతేడాదితో పాలిటెక్నిక్ పూర్తయ్యినా కొన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణుడు కాలేదు. ఇటీవల మరోమారు పరీక్ష రాసినా ఫెయిలయ్యాడు. తన అక్క, అన్నయ్య ఉన్నతంగా చదివి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. స్నేహితులు సైతం చదువులో రాణిస్తున్నారని, తాను వెనుకబడిపోతున్నానని తీవ్ర మనస్తాపానికి లోనై.. గత జనవరిలో ప్రాణాలు తీసుకున్నాడు.

అన్ని వయసులతో పోలిస్తే కౌమార దశ, వృద్ధాప్యంలో ఆత్మహత్యల రేటు ఎక్కువగా ఉంటుందని అధ్యయనాలు చెబుతున్నాయి. నగరంలో ఈ ఏడాది ఇప్పటివరకు దాదాపు ఆరుగురు విద్యార్థులు ప్రాణాలు తీసుకున్నారు. వారిలో అయిదుగురు 11 నుంచి 20 ఏళ్ల లోపు వారే కావడం గమనార్హం. పోటీ ప్రపంచంలో పాఠశాల స్థాయి నుంచే మార్కుల ఒత్తిడి మొదలవుతుంది. ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో మార్కులు, జేఈఈ, నీట్ తదితర పోటీ పరీక్షల్లో ర్యాంకుల కోసం పరుగులు పెట్టాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మార్కులు తగ్గిపోవడం, పాఠశాల, కళాశాలల్లో కలిగే ఇబ్బందులు, ప్రేమ సంబంధిత వ్యవహారాలు తదితర కారణాలతో కొన్నేళ్లుగా కౌమార దశ, యుక్తవయసులచి ఆత్మహత్యలకు పాల్పడుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. అలాంటి వారిని తల్లిదండ్రులు సరైన సమయంలో గుర్తించి చికిత్స చేయిస్తే.. మామూలు స్థితికి వస్తారని నిపుణులు సూచిస్తున్నారు.

**నిత్యం పుస్తకాలతోనే కుస్తీ..**

కౌమార దశలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సామాజిక మాధ్యమాల ప్రభావంతో తమకంటూ కొన్ని లక్ష్యాలు నిర్దేశించుకుంటున్నారు. మరికొందరు వాస్తవ పరిస్థితికి దూరంగా విద్యార్థులకు తల్లిదండ్రులే లక్ష్యాలు నిర్దేశిస్తున్నారు. పిల్లల జ్ఞాపకశక్తి తక్కువగా ఉన్నప్పటికీ.. ఇంజినీరింగ్, వైద్య విద్య చదవాలని చెబుతున్నారు. తల్లిదండ్రుల సంతోషం కోసం ఎలాగైనా మంచి మార్కులు తెచ్చుకోవాలని ప్రయత్నించినా.. ప్రయోజనం లేకపోవడంతో మానసిక సంఘర్షణకు లోనవుతున్నారు. వాస్తవానికి ఆ ఒత్తిడి తగ్గాలంటే యోగా, ధ్యానం, క్రీడలకు సమయం కేటాయించాలి. మార్కులు తగ్గిపోతాయనే భయంతో ఉదయం నుంచి రాత్రి పడుకునేవరకు పుస్తకాలతోనే కుస్తీ పడుతుంటారు.

**టెలీ మానస్'తో భరోసా**

1.మానసిక సమస్యలతో బాధపడే వారి కోసం టెలీ మెంటల్ హెల్త్ అసిస్టెన్స్ అండ్ నెట్‌వర్కింగ్ ఎక్రాస్ స్టేట్స్ (టెలీ మానస్) సేవలు అందుబాటులో ఉన్నాయి. విశాఖలోని ప్రభుత్వ మానసిక ఆసుపత్రిలో టెలీ మానస్ సెల్ ఉంది.

2.ఏదైనా మానసిక సమస్య ఉంటే 14416 లేదా 18008914416 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయొచ్చు. ప్లే స్టోర్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఏ సమయంలోనైనా కౌన్సెలర్ సహాయం పొందొచ్చు. తెలుగు, ఇంగ్లిషు, హిందీ తదితర భాషల్లో మాట్లాడొచ్చు.

3.విద్య, కుటుంబ సమస్యలతో ఒత్తిడి, ఆత్మహత్య ధోరణి తదితర సమస్యలపై ఫోన్ చేయొచ్చు. అనుభవజ్ఞులైన కౌన్సెలర్లు బాధితులకు సలహాలు అందిస్తారు. సమస్య తీవ్రత దృష్ట్యా అవసరమైతే మానసిక వైద్య నిపుణులతో అనుసంధానం చేస్తారు.

**అప్రమత్తత తప్పనిసరి:** పిల్లలు ఒక లక్ష్యం సాధించలేకపోతే మరొకటి చేసేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. వారిని ఒత్తిడి చేస్తే ఎటూ తేల్చుకోలేరు. నిద్ర, తిండి లేకుండా, రోజుల తరబడి ఎవరితోనూ మాట్లాడకుండా ముభావంగా ఉంటున్నవారి విషయంలో అప్రమత్తం కావాలి. వారిని పట్టించుకోకుండా అలాగే వదిలేస్తే ఒత్తిడికి గురై.. ఆత్మహత్యకు దారి తీసే ప్రమాదముంది. వైద్యుల వద్దకు తీసుకెళ్తే విద్యార్థుల్లో అలాంటి ఆలోచనలకు కారణాలేంటో గుర్తిస్తారు. ఆలోచన సరళి మారడానికి, చురుకుదనం పెరిగేందుకు చికిత్స చేస్తారు.డా?? ప్రసన్నకుమార్, మానసిక వైద్య నిపుణులు

# పెట్టుగోళ్లపల్లి నుంచి దిల్లీ



ఎస్.రాయవరం : ఎర్రకోటలో ఆగస్టు 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవానికి ఎస్.రాయవరం మండలం పెట్టుగోళ్లపల్లి సర్పంచి అల్లు వెంకట ప్రశాంతికి ప్రత్యేక అతిథిగా ఆహ్వానం అందింది. ఈ ఏడాదిలో సుపరిపాలన, క్లీన్ అండ్ గ్రీన్ అంశాల ప్రాతిపదికన పెట్టుగోళ్లపల్లిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రకృతి వ్యవసాయం, ప్రతిరోజూ చెత్త సేకరణ, జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు సరఫరా, కేంద్ర ప్రభుత్వ పథకాల వినియోగం తదితర అంశాల ప్రాతిపదికతోపాటు మహిళా ప్రజా ప్రతినిధిగా పెట్టుగోళ్లపల్లి పంచాయతీని ఎంపిక చేశారు. రాష్ట్రం నుంచి పదిమంది సర్పంచులకు ఆహ్వానం అందగా.. అందులో జిల్లా నుంచి ఒక్క ప్రశాంతికి అవకాశం దక్కింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం.. గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు కావడంతో సర్పంచి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. **ప్రగతి పరుగులిలా:** 460 కుటుంబాలు కలిగిన పెట్టుగోళ్లపల్లి గ్రామంలో 1,890 మంది జనాభా నివసిస్తున్నారు ఈ ఏడాది ఉపాధి హామీ పథకం, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 14 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు నిర్మించారు. మరో రూ.ఆరు లక్షల నిధులతో డ్రైన్లు నిర్మించి, మురుగు సమస్యను పరిష్కరించారు. దీంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ. 1.05 కోట్లతో జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నారు. వైకాపా పాలనలో అయిదేళ్లపాటు పక్కన పెట్టేసిన సంపద తయారీ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకొచ్చారు. ముగ్గురు క్లాప్ మిత్రలతో గ్రామంలో తడి, పొడి చెత్తలను సేకరించి, సంపద తయారీ కేంద్రానికి తరలిస్తున్నారు. సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా రూ.6 లక్షలతో పాఠశాల ప్రహరీ నిర్మించారు. గ్రామంలో ఎక్కడ చెత్త నిల్వకుండా పరిశుభ్రమైన వాతావరణాన్ని ఏర్పాటు చేశారు. పెట్టుగోళ్లపల్లిని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దుతామని ఇటీవల ప్రకటించారు.

**సంతోషంగా ఉంది**

స్వాతంత్ర్య దినోత్సవానికి దిల్లీ నుంచి ఆహ్వానం రావడం సంతోషంగా ఉంది. మండలస్థాయి అధికారులు, గ్రామస్థుల సహకారంతో ఏడాదిలో పలు అభివృద్ధి పనులు చేపట్టాం. రోడ్లు, డ్రైన్లు నిర్మించి, సంపద తయారీ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకువచ్చాం. దీంతో గ్రామంలో చెత్త సమస్య పరిష్కరించాం. చెరువు గట్లపై కొబ్బరి మొక్కలు పెంపకానికి కృషి చేస్తున్నాం. అల్లు వెంకట ప్రశాంతి, సర్పంచి, పెట్టుగోళ్లపల్లి

# సాగునీటి కాలువలకు మహర్దశ!



అనకాపల్లి : పంటకాలువలకు మహర్దశ పట్టనుంది. జాతీయ ఉపాధి హామీ నిధులతో ఇప్పటికే జిల్లాలోని పలు మండలాల్లో సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మరికొన్ని కాలువల్లో పనులు చేపట్టేందుకు కలెక్టర్ చొరవ తీసుకున్నారు. జిల్లా మినరల్ ఫండ్ (డీఎంఎఫ్) నుంచి రూ. 2.93 కోట్లు కాలువల అభివృద్ధికి కేటాయించారు. ఈ పనులు పూర్తయితే శివారు పంటపొలాలకు సైతం సాగునీరు అందుతుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


**పనులు ముమ్మరంగా..** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత కాలువల మరమ్మతులకు ప్రత్యేక నిధులు విడుదల చేసింది. చాలా మండలాల్లో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. తాజాగా కలెక్టర్ విజయకృష్ణన్ అనకాపల్లి, ఎలమంచిలి నియోజకవర్గాల పరిధిలోని సాగునీటి కాలువల్లో పూడికతీత పనులకు రూ. 2.93 కోట్ల డీఎంఎఫ్ నిధులను కేటాయించారు. అనకాపల్లి, సబ్బవరం పరిధిలో ఉన్న పోతుకొండగెడ్డకు అనుసంధానంగా ఉన్న పంటకాలువలో పొక్లెయిన్ సహాయంతో పూడికతీత పనులు చేస్తున్నారు. పోతుకొండ గెడ్డ నుంచి అనకాపల్లి మండలం బొజ్జన్నకొండ, అనకాపల్లి ఆవఖండం, అచ్చెన్న కాలువ, ఎల్లయ్యపల్లి కాలువ, చెర్లోపాలెం మీదుగా ఆవఖండం వరకు కాలువలు బాగు చేస్తున్నారు. అలాగే.. అనకాపల్లి మండలం సిరసపల్లిలోని ఆవ కాలువ నుంచి మునగపాక మండలం ఉమ్మలాడ మీదుగా కొండకర్ల ఆవ వరకు 6 కి.మీ పొడవున పూడికతీత పనులు జరుగుతున్నాయి. గత ప్రభుత్వంలో కొండలను పిప్పిచేయడం, జేబులు నింపుకోవడం తప్పిస్తే.. సాధారణ ప్రజలకు కావల్సిన ఏ అవసరాన్ని కూడా వైకాపా నేతలు తీర్చలేదు. కనీసం పంట కాలువల్లోని తుప్పలు, గుర్రపుడెక్క కూడా తీయించలేదు. దీంతో జలవనరులు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. రిజర్వాయర్లు నిండి.. నీటిని విడుదల చేసినా కాలువలు సక్రమంగా లేకపోవడంతో శివారు రైతులకు నీరందేది కాదు. ఫలితంగా గెడ్డలు, కాలువలు పొంగి పంటపొలాలు నీటమునిగేవి. ఈ సమస్యలపై గత ప్రభుత్వంలో ఎన్నోసార్లు అన్నదాతలు వినతులు ఇచ్చినా కనీసం చర్యలు తీసుకోలేదు. శివారు భూములకూ నీరందిస్తాం... పంటకాలువల్లో మొక్కలు, తుప్పలు, గుర్రపుడెక్క తొలగించకపోవడంతో.. అన్నదాతలు ఏటా అవస్థలు పడుతున్నారు. శివారు భూములకైతే కనీసం చుక్కనీరు కూడా వెళ్లడంలేదు. దీంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతులను ఆదుకోవాలనే ఉపాధి హామీ నిధులు, డీఎంఎఫ్ నిధులతో పంట కాలువల్లో పూడికలు తీయిస్తున్నాం. ఈ ఏడాది శివారు భూములకు కూడా సాగునీరు అందిస్తాం. విజయకృష్ణన్, కలెక్టర్, అనకాపల్లి

# సగం ధరలకే పనులు

కర్నూలు : ఉమ్మడి కర్నూలు జిల్లాలో సమగ్ర రక్షిత నీటి పథకాల పనితీరు(సీపీడబ్ల్యూఎస్) అగమ్యగోచరంగా మారుతోంది. జిల్లా పరిషత్ ఇష్టారాజ్యంగా పథకాలకు అనుమతి ఇవ్వడంతో నిర్వహణ అధ్వానంగా మారుతోంది. 15వ ఆర్థిక సంఘం ద్వారా జడ్పీకి ఏటా రూ.25 కోట్ల బడ్జెట్ సమకూరుతోంది. కానీ రూ.46 కోట్ల విలువైన పనులకు జడ్పీ అనుమతి ఇవ్వడంతో.. నిధుల కొరత, నాణ్యత లేని తాగునీటి పథకాలతో పల్లె ప్రజలకు శుద్ధి జలం అందని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు సీపీడబ్ల్యూఎస్ పథకాలను దక్కించుకొనేందుకు గుత్తేదారులు పోటీపడుతున్నారు. తక్కువ ధరలకు దక్కించుకోవడంతో పనులు మరింత అధ్వానంగా మారే పరిస్థితి నెలకొంది. కర్నూలు జిల్లాలో పథకం నిర్వహణ విలువలో 40శాతానికి తక్కువగా టెండర్లు దాఖలు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి జిల్లాలో రూ.82 కోట్ల వరకు గుత్తేదారులకు బిల్లులు చెల్లించాల్సి ఉంది.

**అదనపు డిపాజిట్ రూ.50.37 లక్షలు**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 59 సీపీడబ్ల్యూఎస్ పథకాలున్నాయి. ఈ పథకాల ద్వారా 362 గ్రామాల్లోని 17.70 లక్షల జనాభాకు తాగునీటిని సరఫరా చేయాలి. 2025-26లో రూ.85కోట్ల విలువైన పనులు చేపట్టేందుకు జడ్పీ అనుమతి ఇచ్చింది. వీటిలో రూ.45 కోట్లు పథకాలకు, రూ.40 కోట్లు విద్యుత్తు బిల్లులకు కేటాయించింది. 15వ ఆర్థిక సంఘం ద్వారా కేంద్రం రూ.25 కోట్లు కేటాయిస్తే.. జడ్పీ అత్యుత్సాహంతో రూ.45 కోట్లతో అనుమతి ఇచ్చింది. కొందరు గుత్తేదారులు పోటీపడి 40శాతం తక్కువ ధరతో టెండర్లు దక్కించుకున్నారు. నిబంధనల మేరకు 25శాతానికి తక్కువైతే అదనంగా డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన కర్నూలు జిల్లాలో 7 పథకాలకు రూ.50.37లక్షలు, 33 పథకాలకు మరో రూ.42.50 లక్షలు కలిపి



రూ.92.87 లక్షల డిపాజిట్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సేకరించారు. ఆదోని మండలం పెసలబండ సీపీడబ్ల్యూఎస్ పథకం విలువ రూ.81.21 లక్షలు. 40శాతం తక్కువకు పనులు దక్కించుకుంటే ఎంత మేరకు నాణ్యతగా పనులు చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రజలకు ఎంత వరకు తాగునీరు ఇస్తారనే అంశంపై అధికారులు విచారణ చేయకుండా ఒప్పందం చేస్తున్నారు. 2004లో పూర్తయిన ఈ పథకం కింద 24గ్రామాలకు తాగునీరు ఇవ్వాల్సి ఉంది.

కుప్పగల్, హెబ్బటం, కౌతాళం, శాతనూరు, మండగిరి సీపీడబ్ల్యూఎస్ పథకాలకు 40శాతం తక్కువకు టెండర్లను దక్కించుకున్నారు.

రూ.67 లక్షల విలువగల ఆలూరు పథకానికి 35శాతం తక్కువకు టెండర్ దక్కించుకున్నారు. 2018లో పూర్తయిన ఈ పథకం కింద 10 గ్రామాలకు తాగునీరు విడుదల చేయాలి.

**తేడాలొస్తే నిధులు రికవరీ**

తక్కువకు టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులు పల్లె ప్రజలకు తాగునీటి విడుదల చేయడంలో ఏమాత్రం తేడాలొచ్చినా.. ఫిర్యాదులు అందినా.. గుత్తేదారులు ముందుగా చెల్లించిన అదనపు డిపాజిట్ సొమ్ము నుంచి రికవరీ చేస్తాం. అయితే గత మూడేళ్లుగా ఎటువంటి రికవరీలు చేయలేదు. అంతా సవ్యంగా జరిగింది. బి.నాగేశ్వరరావు, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి

# 'అద్దె'రువు

నంద్యాల: ఓ ప్రైవేటు గోదాము ప్రతినిధులు, పౌర సరఫరాలశాఖ అధికారులు కుమ్మక్కై ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టారు. గోదాము విస్తీర్ణాన్ని పెంచి భారీ ఎత్తున అద్దెను (స్టోరేజీ రుసుములు) దండుకొన్నారు. ప్రతి నెలా రూ.1,68,640 చొప్పున నాలుగున్నరేళ్లలో సుమారు రూ.కోటి వరకు అదనంగా చెల్లింపులు జరిగాయి. జిల్లా అవసరాల నిమిత్తం పౌరసరఫరాలశాఖ గోపవరంలోని 'శ్రీ సాయిరామ్ రూరల్ ఫార్మర్స్ వేర్‌హౌస్'ను 2019లో అద్దెకు తీసుకుంది. దానిని నేరుగా వేర్‌హౌస్ యాజమాన్యం నుంచి కాకుండా రాజ్‌కుమార్ నుంచి తీసుకోవడం గమనార్హం. ఆ గోదామును రాజ్‌కుమార్ లీజుకు తీసుకుని పౌరసరఫరాలశాఖకు అద్దెకు ఇచ్చారు. దాని సామర్థ్యం 13 వేల మెట్రిక్ టన్నులని చెప్పి అద్దె ఒప్పందం చేసుకొన్నారు. సుమారు నాలుగున్నరేళ్లపాటు ఎలాంటి సమస్య తలెత్తలేదు. అక్కడ తాజాగా కొలతలు తీయడంతో ప్రతి నెలా 1984 టన్నులకు అదనంగా అద్దె వసూలు చేశారన్న విషయం వెలుగులోకి వచ్చింది.

**1,800 సంచుల బియ్యం మాయం**గోపవరం బఫర్ గోదాములో ఉండాల్సిన 1,800 సంచుల బియ్యాన్ని పక్కదారి పట్టించారు. లెక్క ప్రకారం ఉండాల్సిన బియ్యం సంచులు లేకపోవడంతో ఆయా వివరాలు దస్త్రాల్లో మళ్లీ రాయాల్సిన పరిస్థితి నెలకొంది. వివరాలు రాస్తే అక్రమాల విషయం బయటపడుతుందన్న ఉద్దేశంతో గోదాములో సరకు మొత్తం ఖాళీ చేసిన తర్వాతే గిడ్డంగుల సంస్థ స్వాధీనం చేసుకున్నట్లు చూపారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. **లీజు మార్పుతో వెలుగులోకి**

: అద్దెకు తీసుకొన్న ప్రైవేటు గోదాముల (ఇన్వెస్టర్ గోదాము) విషయంలో భారీ అక్రమాలు జరిగినట్లు 'కూటమి' ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ' (ఏపీఎస్‌డబ్ల్యూసీ) గోదాములను తీసుకోవాలని నిర్ణయించింది. దీంతో ఏపీఎస్‌డబ్ల్యూసీ గోదాముల్లో రేషన్ బియ్యాన్ని నిల్వ చేయాల్సిన పరిస్థితి వచ్చింది. సదరు సంస్థకు జిల్లాలో సొంత గోదాములు లేకపోవడంతో ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించక తప్పని పరిస్థితి నెలకొంది. తాము అద్దెకు తీసుకున్న 'శ్రీ సాయిరామ్ రూరల్ ఫార్మర్స్ వేర్‌హౌస్'ను గిడ్డంగుల సంస్థకు బదలాయించాలని పౌరసరఫరాల శాఖ అధికారులు నిర్ణయించారు. ఆ మేరకు గిడ్డంగుల సంస్థ ఉన్నతాధికారులకు లేఖ రాశారు. దీంతో గిడ్డంగుల సంస్థ అధికారులు పరిశీలించి దాని కొలతలు తీసుకోవడంతో తేడాలొచ్చాయి. అందులో 13 వేల టన్నులు సరకు పట్టదని.... 11,016 టన్నులు నిల్వ చేసేందుకే సరిపోతుందని తేల్చారు. అంత విస్తీర్ణానికే అద్దె చెల్లిస్తామని తేల్చి చెప్పారు. ఆమేరకు ఏపీఎస్‌డబ్ల్యూసీ అధికారులు పౌరసరఫరాలశాఖ అధికారులకు లేఖ రాయడంతో అక్రమాల గుట్టు రట్టయింది.

# పరదా కట్టారు... గోతులు తవ్వారు!

నర్సీపట్నం : బ్రిటిష్ సైనికాధికారుల సమాధులకు సమీపంలో ప్రధాన రహదారిని ఆనుకుని కట్టిన ఆకుపచ్చ మ్యాట్ని మున్సిపల్ కమిషనర్ సురేంద్ర గురువారం తొలగించినప్పటికీ శనివారం ఉదయం మళ్లీ కట్టారు. స్తంభాల కోసం పునాదుల తవ్వకం మొదలు పెట్టారు. ఇది పురావస్తు భూమి అంటూ మూడు రోజుల కిందట హడావుడి చేసిన అధికారులెవరూ ఇటువైపు కన్నెత్తి చూడలేదు. ప్రధాన రహదారి విస్తరణ సమయంలో రెండేళ్ల కిందట అప్పటి ఎమ్మెల్యే గణేష్ ఆదేశాల మేరకు ఇక్కడి దుకాణాలను వాటి యజమానులు స్వచ్ఛందంగా తొలగించారు. అప్పట్లో హడావుడిగా తొలగించినా ఇక్కడి వరకు రోడ్డును విస్తరించలేదు. విస్తరణకు మళ్లీ ప్రయత్నించినా అల్లూరి స్మారక ప్రాంతాల పరిరక్షణ సమితి సభ్యులు ఇది పురావస్తు భూమి అంటూ కలెక్టర్‌కు, ఇతర అధికారులకు ఫిర్యాదులు పంపడం, అధికారులొచ్చి హెచ్చరికలు చేస్తుండంతో ఇన్నాళ్లూ నిర్మాణాలు చేపట్టలేదు. సమితి ప్రతినిధులు మండల న్యాయసేవాధికార కమిటీ ద్వారా కోర్టు దృష్టికి తీసుకురావడంతో సీనియర్ సివిల్ జడ్జి పటాన్ షియాజ్‌ఖాన్ ఈ ప్రదేశాన్ని ఇటీవల అధికారులతో కలిసి పరిశీలించి వెళ్లారు. మూడు రోజుల కిందట కొందరు ఆకుపచ్చ మ్యాట్ కట్టడంతో కమిషనర్ సురేంద్ర సిబ్బందితో వచ్చి తొలగించారు. సమాధుల ప్రాంతాన్ని తామేమీ ఆక్రమించలేదు. దశాబ్దాలుగా తాము వ్యాపారాలు సాగిస్తున్న దుకాణాలను రోడ్డు విస్తరణ కోసం తొలగించాం. ఇప్పుడు అదే ప్రదేశంలో కట్టుకుంటామని కమిషనర్‌కు పలువురు తెలియజేశారు. ఏదైనా ఉంటే తహసీల్దారు మాట్లాడండి అంటూ వ్యాపారులకు స్పష్టం చేసి కమిషనర్ వెళ్లిపోయారు పనులు జరుగుతున్నా అల్లూరి స్మారక ప్రాంతాల పరిరక్షణ సమితి సభ్యులు, ఆయా శాఖల అధికారులు



ఇటువైపు రాలేదు.

**పురావస్తు సంపదగా నోటిఫికేషన్**

ఈ స్థలానికి సంబంధించి స్పష్టమైన స్కెచ్‌మ్యాప్, సరిహద్దుల సమాచారం పంపాలని పురావస్తు, మ్యూజియంల శాఖ సహాయ సంచాలకులు ఆర్.ఫల్గుణరావు పదిరోజుల కిందట తహసీల్దారు రామారావుకు లేఖ పంపారు. రెవెన్యూ అధికారుల నుంచి ఈ వివరాలు అందిన తర్వాత స్మారక చిహ్నాలు, పురావస్తు చట్టం-1960 ప్రకారం చర్యలు చేపట్టాల్సి ఉంది. పురావస్తు సంపదగా 2011 జనవరి 5న నోటిఫికేషన్ ఇచ్చినా ఆచరణపై అప్పటి అధికారులు శ్రద్ధ చూపలేదు. 1922-24 నడుమన బ్రిటిష్ పాలకులను సవాల్ చేస్తున్న మన్యం పితూరీని అణచి వేయడానికి అప్పటి ప్రభుత్వం గెరిల్లా యోధులైన సైనికాధికారులు లియోనెల్ నెవెల్లీ హైటర్, క్రిస్టోఫర్ విలియం స్కాట్ కవర్డ్‌లను రప్పించింది. వీరిని 1922 సెప్టెంబరు 24న దామనాపల్లి ఘాట్‌లో అల్లూరి వీరిని హతమార్చారు. మృతదేహాలను నర్సీపట్నం ఆర్‌అండ్‌బీ బంగ్లాకు సమీపంలో కేటాయించిన భూమిలో ఖననం చేసిన బ్రిటిష్ పాలకులు పాలరాతి సమాధులు నిర్మించారు. కాలక్రమేణా ఇక్కడ ఇళ్లు, దుకాణాలు వెలిశాయి. కొందరికి అప్పట్లో పట్టాలిచ్చారని చెబుతున్నారు.

# 'వారధి' వణుకుతోంది

కర్నూలు : గుజరాత్ రాష్ట్రం వడోదరా సమీపంలోని ముజ్‌పూర్‌లో ఈనెల 9వ తేదీన వంతెన కుప్పకూలి పలు వాహనాలు నదిలో పడిపోయి 11 మంది మృతి చెందిన.. నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. దేశవ్యాప్తంగా ఉన్న పలు కీలకమైన వంతెనల సామర్థ్యానికి సంబంధించి వివరాలు సేకరిస్తున్నారు. ప్రస్తుతం వాటి పరిస్థితేంటి? అత్యవసరంగా ఏమైనా మరమ్మతులు చేయాలా అన్న వివరాలు విశ్లేషిస్తున్నారు. ఇందులో భాగంగా శ్రీశైలం జలాశయం ఆనకట్ట ముందున్న వంతెన వాహనాల రాకపోకలకు సురక్షితమా కాదా అన్న విషయాన్ని తెలుసుకునేందుకు శనివారం ఇంజినీరింగ్ నిపుణులు పరీక్షలు నిర్వహించారు. ఇది ఎంత లోడ్‌ను తట్టుకోగలదో తెలుసుకునేందుకు సామర్థ్య పరీక్షలు చేపట్టారు.



ఒక టిప్పర్‌ను తెచ్చి వేర్వేరు లోడ్‌లతో వంతెనపై నడిపారు. ఆ సమయంలో వంతెనలో వస్తున్న కదలికలను నిశితంగా పరిశీలించారు. కదలికల ఆధారంగా ఎంత లోడ్‌తో వెళ్లినప్పుడు వంతెన సురక్షితంగా ఉంది? ఎంత బరువు వద్ద కట్టడంలో ప్రమాదకరమైన కదలికలు వస్తున్నాయన్న అంశాలను శాస్త్రీయ పద్ధతిలో అంచనా వేశారు. ఇందుకోసం నిపుణులు ఒక ప్రత్యేకమైన క్రేన్‌ను కూడా తెచ్చారు. ఆ క్రేన్‌కు ఉన్న తొట్టెలో నిల్చుని వంతెన కింది భాగాల్లో ప్రకంపనలను నమోదు చేసుకున్నారు.

**దెబ్బతిన్న బేరింగులు**

వంతెనకు ఉన్న కొన్ని బేరింగులు దెబ్బతిన్నట్లు సమాచారం. అధిక లోడ్ వాహనాలు వెళ్తున్నప్పుడు ప్రకంపనలు వస్తున్నట్లు నిపుణులు గుర్తించారని తెలుస్తోంది. వారిచ్చే నివేదిక ఆధారంగా అధికారులు తగిన మరమ్మతులు చేపట్టనున్నారు. వంతెన కారణంగా ప్రమాదాలు జరగకుండా ఎలాంటి మరమ్మతులు చేయాలన్న విషయాన్ని అధికారులు త్వరలో ఖరారు చేయనున్నారు.

**కాలం చెల్లి మూడేళ్లు**

శ్రీశైలం డ్యాం ముందున్న వంతెనను 1972లో నిర్మించారు. ఇది ఎన్‌హెచ్ 765లో అంతర్భాగంగా ఉంది. వంతెనకు ఒకవైపు ఆంధ్రప్రదేశ్, మరోవైపు తెలంగాణ రాష్ట్రాలు ఉన్నాయి. రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలకు కీలకమైన వారధిగా ఇది గుర్తింపు పొందింది. 530 మీటర్ల పొడవున్న ఈ కీలక వంతెనకు పలుచోట్ల రెయిలింగ్స్ దెబ్బతిన్నాయి. ఆ లోపాలు కనిపించకుండా అక్కడక్కడ చిన్నపాటి పిట్టగోడలను నిర్మించారు. దీనిపై రహదారికి ఇరువైపులా నిర్మించిన ఫుట్‌పాత్‌లకు పగుళ్లు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. బ్రిడ్జి కింద చూస్తే పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. పలుచోట్ల కాంక్రీటు పెచ్చులు ఊడిపోతున్నాయి. దీని నిర్మాణ సమయంలో 50 ఏళ్ల పాటు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా వినియోగించేందుకు వీలుగా పలు జాగ్రత్తలు తీసుకున్నారు. ఆ 50 ఏళ్ల గడువు ముగిసి మూడేళ్లు దాటింది. చిన్నపాటి మరమ్మతులతో దాన్ని కొనసాగిస్తున్నారు. దాని స్థానంలో కొత్త వంతెన నిర్మించాలని అధికారులు గతంలోనే ప్రతిపాదన పంపారు. ఇప్పటికీ వాటికి ఆమోద ముద్ర పడలేదు.

# తక్షణ రక్షణ.. విశేష స్పందన




కర్నూలు : అత్యవసర సేవలందించేందుకు పోలీసుశాఖ ఏర్పాటు చేసిన డయల్ 100/112 సేవలను ప్రజలు విరివిగా ఉపయోగించుకుంటున్నారు. గొడవలు, అల్లర్లు, దాడులు, హత్యలు ఇతర ఏ నేరాలు జరిగినా.. రహదారి ప్రమాదాలు చోటుచేసుకున్నా.. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తించినా.. అక్రమ రవాణా జరిగినా.. తమకు ఏదైనా ముప్పు పొంచి ఉన్నా ప్రజలు వెంటనే ఈ నంబర్లకు ఫోన్ చేస్తున్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రక్షణ కల్పిస్తున్నారు. ప్రజలకు భరోసా కల్పిస్తున్నారు. దీంతో ఈ నంబర్లకు ఫోన్లు చేసే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.

**సాంకేతికతను జోడించి సేవలు**

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి డయల్ 100/112 సేవలను పోలీసు ఉన్నతాధికారులు మరింత అభివృద్ధి చేశారు. సిగ్నళ్ల ఆధారంగా ఫోన్ చేసిన వ్యక్తి ఉన్న స్థలానికి చేరుకుంటున్నారు. ఒకవేళ తమకు సంబంధం లేని అంశమైతే సంబంధిత శాఖలకు సమాచారం చేరువేస్తున్నారు. పోలీసుశాఖతో పాటు అగ్ని మాపకశాఖ, అంబులెన్స్, ఎస్డీఆర్ఎఫ్ సేవలు అందుతున్నాయి. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతున్నారు.

**బాధితులకు బాసట**

కర్నూలులో ఓ యువకుడు తన తల్లిదండ్రులతో కలిసి ఇంట్లో భార్య, అత్త, మామలను కత్తులతో విచక్షణారహితంగా పొడిచాడు. ఈ ఘటనలో భార్య, అత్త ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన మామ ఇంట్లోంచి బయటకు రాగా స్థానికులు డయల్ 100కు ఫోన్ చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అతన్ని ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాలు దక్కాయి. ఆయన కోర్టులో సాక్ష్యం చెప్పడంతో ముగ్గురు నిందితులకు శిక్ష పడింది. ఆదోని పట్టణంలోని కొనిమాళ్లలో తాగుబోతు భర్త తన భార్యను తీవ్రంగా కొడుతుండగా కొందరు డయల్ 100కు ఫోన్ చేయడంతో పోలీసులు వెళ్లి ఆమెను రక్షించారు. భర్తను స్టేషన్‌కు తీసుకెళ్లి మంత్రణం చేశారు.

**సమాచారం చేరవేస్తున్నారు**

శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణలోనూ ఈ ఫోన్ నంబర్లు కీలకపాత్ర పోషిస్తున్నాయి. రాష్ట్ర పోలీసు శాఖకు సంబంధించిన డయల్ 100తో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన డయల్ 112ను అనుసంధానం చేశారు. రాష్ట్ర డీజీపీ మొదలుకొని జిల్లా ఎస్పీల వరకు ఆయా నంబర్లకు వచ్చే ఫోన్‌కాల్స్‌ను పర్యవేక్షిస్తున్నారు. ఆయా ఫోన్ కాల్స్‌పై స్థానిక పోలీసుస్టేషన్ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకున్నారో నివేదికలను తెప్పించుకుని పరిశీలిస్తున్నారు. కమాండ్ కంట్రోల్‌లో ఫోన్‌కాల్స్ స్వీకరించే సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ స్థానిక పోలీసులకు తక్షణమే సమాచారం చేరవేస్తున్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది సైతం తక్షణం స్పందిస్తున్నారు. ప్రతినెలా వేలాదిమంది ప్రజలు ఈ నంబర్లకు ఫోన్ చేసి సాయం పొందుతున్నారు.

ఈ ఏడాది జనవరి నుంచి జులై 22వ తేదీ వరకు 7,834 ఫోన్‌కాల్స్ రాగా 96 కేసులు నమోదు చేశారు. అధికశాతం మంది సమాచారం ఇచ్చేందుకే ఫోన్లు చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఆయా నంబర్లకు ప్రజలు ఇచ్చే సమాచారాన్ని బట్టే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టి ఎంతో మందిని కాపాడుతున్నారు.

# బఫర్‌లో నోట్ల'కట్ట'డాలు



నంద్యాల : నంద్యాల-ఆత్మకూరు రహదారి మార్గంలో కొత్తపల్లె గ్రామ సమీపంలో మద్దెల వాగును ఆనుకొని రెండు వైపులా ప్లాట్లు వేశారు. ఏకంగా బహుళ అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నాయి. అధికారులు గుర్తించినా చర్యలు తీసుకోవడం లేదు.

నల్లమల అటవీ ప్రాంతంలో కురిసే వర్షాలు బండిఆత్మకూరు నుంచి రామాపురం వెళ్లే మార్గంలో ఉన్న వంతెన వద్ద వాగుగా మారుతుంది. దీనినే మద్దెల వాగుగా పిలుస్తారు. ప్రస్తుతం దీని సమీపంలోనే బహుళ అంతస్తుల నిర్మాణం జరుగుతుండటం గమనార్హం.

నంద్యాల పట్టణం.. జిల్లా కేంద్రంగా మారడంతోపాటు 167కే జాతీయ రహదారి నిర్మాణంతో స్థిరాస్తి వ్యాపారం పుంజుకుంది. పలు నూతన సంస్థలు రావడం ప్రారంభించాయి. ఉపాధి నిమిత్తం జనం పట్టణానికి వలస వస్తున్నారు. దీంతో స్థలాలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఇదే అదనుగా కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారు. సాగునీటి కాలువలు, కుంటలు, చెరువుల సమీపంలో వెంచర్లు వేసి సొమ్ము చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

**వాగుల పక్కనే**

నంద్యాల సమీపంలోని బఫర్ జోన్ ప్రాంతాల్లో పెద్దఎత్తున స్థిరాస్తి వ్యాపారం జరుగుతోంది. బఫర్ జోన్‌గా ప్రకటించిన మద్దిలేరు, పాలేరు, చామకాల్వ తదితర ప్రాంతాల్లో అక్రమాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రధానంగా నంద్యాల పట్టణ శివారులో కొత్తపల్లె, బిల్లలాపురం, సూర్యనంది, మహానందికి వెళ్లే మార్గంలోని బొల్లవరం.. నంద్యాల పట్టణంలో బఫర్ జోన్‌గా ప్రకటించిన ఎస్బీఐ కాలనీ పెద్ద చెరువు సమీపం, సరస్వతినగర్, హనీఫ్‌నగర్, శ్యాంనగర్, సలీంనగర్ ప్రాంతాల్లో అక్రమ వెంచర్లు వెలిశాయి. వీటిలో కొన్నింటికి అనుమతులు లేవు. మరికొన్నింటికి కొంతమేర అనుమతులున్నాయి. జిల్లా కేంద్రంలో ఆక్రమణలు పెరిగిపోవడంతో చామకాల్వ పిల్ల కాలువలా మారుతోంది.

**బఫర్ జోన్ అంటే...**

వాగులు, వంకలు, సాగునీటి కాలువలు 10 మీటర్ల వెడల్పు ఉంటే వాటికి ఇరువైపులా 2 మీటర్లు బఫర్ జోన్‌గా పరిగణిస్తారు. 10 మీటర్ల కంటే ఎక్కువ వెడల్పు ఉంటే 9 మీటర్ల పొడవునా.. వాగులు, చెరువులు, నదులకు ఇరువైపులా 50 మీటర్లు బఫర్ జోన్‌గా గుర్తిస్తారు. జిల్లా కేంద్రం నంద్యాల నుంచి మహానంది వెళ్లే మార్గంలో, ఆత్మకూరు వైపు వెళ్లే మార్గంలో వాగులు, నదులను ఆనుకునే వెంచర్లు వేశారు. తాము కొనుగోలు చేసిన భూములను మాత్రమే చూపుతూ అక్రమాలకు పాల్పడుతున్నారు. వాగులకు సమీపంలో ప్రహరీ నిర్మిస్తున్నారు. మరికొన్నిచోట్ల వాగుకు ఇరువైపులా ఎత్తు పెంచుతూ పూడ్చేస్తున్నారు.

**నిబంధనలు ఏం చెబుతున్నాయ్**

వెంచర్లకు అనుమతులు రావాలంటే పురపాలిక, గ్రామ పంచాయతీ, రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలించి డీటీసీపీ అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. వెంచర్లలో 10 శాతం భూమిని పార్కులకు కేటాయించి సంబంధిత పురపాలిక, గ్రామ పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేయాలి. ఈ నిబంధనలు పాటించకుండా వెంచర్లు వేసి స్థలాలు విక్రయిస్తున్నారు. కొందరు అధికారుల అండదండలతోనే స్థిరాస్తి వ్యాపారులు ప్లాట్లు వేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

**వివరాలు సేకరించి చర్యలు-ప్రతాప్, ఎస్ఈ, జలవనరుల శాఖ**

బఫర్ జోన్ పరిధిలో నిర్మించిన కట్టడాలపై మున్సిపల్, పంచాయతీ అధికారులకు సమాచారం అందజేస్తాం. నిబంధనలు ఉల్లంఘించిన వేసిన ప్లాట్లు, జరిగిన నిర్మాణాలపై ముందుగా వివరాలు సేకరిస్తాం. అనంతరం తగిన చర్యలు తీసుకుంటాం.

# నక్కల గుట్టను నొక్కేశారు



అనంతపురం: నగర శివారులో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గుట్టపై కన్నేసిన వైకాపా నాయకులు నకిలీ పట్టాలు సృష్టించి ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకున్నారు. రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై పాసుపుస్తకాలు సైతం పొందారు. పంటలు సాగు చేయకపోయినా గత ప్రభుత్వ హయాంలో బ్యాంకు రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం పొందుతూ వచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ ప్రాంతంలో భూముల ధర పెరగడంతో గుట్టను అమ్మేందుకు సిద్ధమయ్యారు. అధికార పార్టీకి చెందిన కొందరు స్థానిక నాయకులు సహకరిస్తున్నట్లు తెలుస్తోంది.

**దస్త్రాలు కాలిపోవడంతో..**

కూడేరు తహసీల్దార్ కార్యాలయంలోని దస్త్రాలకు 1998లో నక్సలైట్లు నిప్పు పెట్టడంతో కాలి బూడిదయ్యాయి. గ్రామ వీఆర్వోల వద్ద అడంగల్, 10(1) రికార్డులు మాత్రమే మిగిలాయి. దీన్ని ఆసరాగా చేసుకుని అక్రమార్కులు మండలంలోని మిగులు భూములకు నకిలీ పట్టాలు సృష్టించి కాజేస్తూ వస్తున్నారు. గతంలో పనిచేసిన తహసీల్దార్ల సంతకాలు ఫోర్జరీ చేసి పాత తేదీలతో అసైన్‌మెంట్ పట్టాలు సృష్టించారు. వాటిని చూపి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని రిజిస్ట్రేషన్లు సైతం చేసుకున్నారు. అధికారుల అవినీతి కారణంగా వందలాది ఎకరాలు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిపోయాయి.

**విచారణ చేపట్టాం..- కేశవనాయుడు, ఆర్డీవో, అనంతపురం**

కమ్మూరు సర్వే నంబరు 547, 564లో సాగుపట్టాలు ఇచ్చినట్లు రికార్డుల్లో లేదు. నకిలీ పట్టాలు సృష్టించినట్లు ఫిర్యాదులు రావడంతో విచారిస్తున్నాం. త్వరలోనే క్షేత్రస్థాయిలో పరిశీలిస్తా. నకిలీ పట్టాలు అని తేలితే ఆన్‌లైన్‌లో పేర్లు తొలగించి పాసుపుస్తకాలు రద్దు చేస్తాం.

**విలువ పెరగడంతో..**

కూడేరు మండలం కమ్మూరు అనంతపురం-బళ్లారి జాతీయ రహదారికి ఆనుకుని సర్వే నంబరు 547లో 24 ఎకరాలు, 564లో 32 ఎకరాల్లో రాళ్ల గుట్ట విస్తరించి ఉంది. స్థానికులు నక్కలగుట్ట అని పిలుస్తారు. అరవకూరుకు చెందిన ఓ వైకాపా నాయకుడు 564 సర్వే నంబరులోని గుట్టను బంధువుల పేర్లతో ఆన్‌లైన్‌లో నమోదు చేయించాడు. ప్రస్తుతం సదరు ప్రాంతంలో స్థిరాస్తి వ్యాపారం ఊపందుకోవడంతో గుట్టను చదును చేసి అమ్మేందుకు బేరం పెట్టినట్లు తెలుస్తోంది. ఓ వీఆర్వో సైతం కుటుంబసభ్యుల పేరుతో నకిలీ పట్టా సృష్టించి ఆన్‌లైన్‌లో ఎక్కించారు. రెండు సర్వే నంబర్లలో కలిపి 40 ఎకరాలకు పైగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై సబ్‌డివిజన్లు చేసి ప్రభుత్వం నుంచి పథకాలు పొందుతున్నారు.

# వడివడిగా ఉక్కు అడుగులు

నక్కపల్లి : పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న మండలంలో ప్రస్తుతం అందరి దృష్టి ఆర్సెలార్ మిత్తల్ ఉక్కు పరిశ్రమపైనే ఉంది. ఇది ఏర్పాటైతే వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలతోపాటు, దీని పరిసర ప్రాంతాలన్నీ ఆర్థికాభివృద్ధి దిశగా పరుగులు పెట్టనున్నాయి. తాజాగా రైల్వే లైను కోసం 111 ఎకరాలు కేటాయిస్తూ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం ఎంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందనేది తెలుస్తోంది.

తెదేపా హయాంలోనే సిద్ధంచేసిన సుమారు 4,300 ఎకరాల భూముల్లో ఇప్పటికే 1800 ఎకరాల వరకు బల్క్ డ్రగ్ పార్కుకు ఇచ్చారు. ఈ ఏడాది జనవరిలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబునాయుడు ఈ పనులు ప్రారంభించారు. అప్పటి నుంచి ఇవి శరవేగంగా సాగుతున్నాయి. మరోవైపు ఉక్కు పరిశ్రమను రాష్ట్రానికి రప్పించడంలోనూ ప్రభుత్వం సఫలీకృతమైంది. దీనికోసం నక్కపల్లి మండలంలోనే రెండు వేల ఎకరాలకు పైగా కేటాయించడంతోపాటు దీని పనులు ప్రారంభానికి సంబంధించి అవసరమైన అనుమతులు ఇవ్వడానికి కేబినెట్‌లోనూ తీర్మానించారు. దీని తర్వాత నుంచి ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు వేగమయ్యాయి. ఇప్పటికే టౌన్‌షిప్ నిమిత్తం సుమా రు 500 ఎకరాలు, రెండో విడతలో అదనపు భూములకోసం మూడు వేల ఎకరాలకు పైగా అవసరం కాగా, ఆ దిశగా అధికార యంత్రాంగం చర్యలు




చేపట్టింది. కొద్దిరోజుల క్రితం రెండోవిడత సేకరణ పనులు మొదలు పెట్టారు. ప్రస్తుతం రైతుల నుంచి దీనిపై అభ్యంతరాలు వస్తున్న నేపథ్యంలో వారితో చర్చించి ముందుకెళ్లేలా మంత్రి వంగలపూడి అనిత చర్చలు ప్రారంభించారు. మరోవైపు మిత్తల్ పరిశ్రమను వీలైనంత వేగంగా మొదలు పెట్టేలా మరో అడుగు ముందుకు వేసింది. ఆ మేరకు రైల్వే స్లైడింగ్‌కు (ప్రధాన లైను నుంచి పరిశ్రమలకు వేసే లైను) 111 ఎకరాలు కేటాయిస్తూ ఉత్తర్వులు వచ్చాయి.

గుల్లిపాడు నుంచే! ఉక్కు పరిశ్రమ ఏర్పాటైతే ఎగుమతులు, దిగుమతుల నిమిత్తం కచ్చితంగా అవసరమైన రవాణా సదుపాయం కావాలి. ప్రస్తుతం కేటాయించిన భూములు తీరప్రాంతాన్ని ఆనుకుని ఉండటంతో క్యాప్టివ్ పోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. దీంతో పాటే ఇప్పుడు రైల్వే లైను ఏర్పాటుకు ముందుకు వచ్చింది. ఆ మేరకు 111 ఎకరాలను కేటాయించారు. ప్రస్తుతం నక్కపల్లి మండలానికి సంబంధించి గుల్లిపాడు రైల్వేస్టేషన్ ఉండగా, ఇక్కడ ప్యాసింజర్ రైళ్లు మాత్రమే ఆగుతాయి. ఈ స్టేషన్ అభివృద్ధి పనులు మూడేళ్ల క్రితం చేపట్టారు. ఇవన్నీ తుదిదశకు చేరుకుంటున్నాయి. ఉక్కు పరిశ్రమ ఏర్పాటైతే... దీనికి పది కిలో మీటర్ల లోపే ఈ స్టేషన్ ఉంటుంది. దీని ద్వారా ప్రత్యేక లైనువేసే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. స్టేషన్ నుంచి లైను వేస్తే చినదొడ్డిగల్లు, వేంపాడు రెవెన్యూల పరిధిలోనే దాదాపుగా తీసుకోవచ్చని తెలిసింది. ఇప్పటికే ఈ ప్రాంతంలో దీనికి సంబంధించిన భూముల పరిశీలించినట్లు తెలియవచ్చింది. కాగా మధ్యలో జాతీయ రహదారి ఉండటంతో దీన్నెలా దాటిస్తారనేది సందేహంగా మారింది. జాతీయ రహదారి దాటే ప్రాంతంలో వాహనాల కోసం పై వంతెన వేస్తారని రైల్వే ఇంజినీర్ ఒకరు తెలిపారు.

# అడ్డేదెవరు.. ఆపేదెవరు!

అనకాపల్లి : జిల్లాలో అక్రమ మైనింగ్‌కు హద్దు, అదుపూ లేకుండా పోతోంది. సహజ వనరులు ఎక్కడ కనిపించినా.. వాటిని పిప్పి చేసేంతవరకు అక్రమార్కులు వదలడం లేదు. అధికారులు అడ్డుకున్నా.. లెక్కచేయడం లేదు. ముఖ్యంగా సాగుకు ఆధారమైన చెరువుల రూపురేఖలు మార్చేస్తున్నారు. దీంతో వాటిపై ఆధారపడి జీవిస్తున్న అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. అక్రమార్కులు బరితెగిస్తున్నా.. అధికారులు మాత్రం కొరడా ఝుళిపించడం లేదు. ఫిర్యాదులొచ్చినా తూతూమంత్రం చర్యలతోనే సరి పెడుతున్నారు.

రోలుగుంట మండలం రాజన్నపేట గ్రామంలో సర్వే నెంబర్ 57-2లో భూపతి చెరువు ఉంది. దీనికింద 40 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. చెరువు ఆధారంగా కొన్ని సంవత్సరాల నుంచి రైతులు సాగు చేసుకుంటున్నారు. ఈ చెరువు గర్భాన్ని చదును చేసి రోడ్డుగా మార్చేశారు ఓ మైనింగ్ నిర్వాహకుడు. కొండలను పేల్చి బండరాళ్లను ఈ దారిమీదుగా తరలించేందుకు సిద్ధం చేసుకున్నారు. దీనిపై కొన్ని రోజుల క్రితం స్థానికులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు స్పందించి దీనిపై విచారణ చేపట్టారు. జలవనరులు, రెవెన్యూ అధికారులు రెండేసిసార్లు నిర్వాహకులకు నోటీసులిచ్చారు. ఇటీవల దారికి అడ్డంగా పొక్లెయిన్ గండ్లు తీసి..



రవాణాకు వీలులేకుండా చేశారు. అయినా అక్రమార్కులు దానిని ఏమాత్రం లెక్కచేయలేదు. చక్కగా గండ్లుపూడ్చేసి.. మళ్లీ రోడ్డు వేసి దర్జాగా మైనింగ్ సాగిస్తున్నారు.

**చెరువుల చిక్కిపోతున్నాయి..** జిల్లాలో సుమారు 2,890 వరకు చెరువులు, సాగునీటి వనరులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటిపై ఆధారపడి 2.5లక్షల ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు. గత ప్రభుత్వ కాలం నుంచి సాగునీటి వనరులు క్రమంగా ఆక్రమణలకు గురవుతున్నాయి. పాయకరావుపేట మండలం పెదరామభద్రపురంలో ఎనిమిదెకరాల్లో లేఅవుట్ వేస్తున్నారు. దీనికి ఆనుకుని ఉన్న పంటకాలువలను కలిపేసుకున్నారు. రావికమతం మండలం మేడివాడలో ఓ స్థిరాస్తి వ్యాపార సంస్థ వేసిన లేఅవుట్‌లో భారీగా ప్రభుత్వ భూములు, గెడ్డలు ఆక్రమించుకున్నట్లు ఫిర్యాదులొచ్చాయి. కానీ అధికారులు వాటిని పట్టించుకోలేదు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం...-** వి.వి.రమణ, ఆర్డీవో, నర్సీపట్నం

రాజన్నపేట చెవులో అక్రమంగా వేసిన రోడ్డును అడ్డుకున్నాం. మళ్లీ రోడ్డు వేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. పరిశీలిస్తాం.. అతిక్రమించినట్లు తేలితే చర్యలు తీసుకుంటాం. రెవెన్యూ పరిధిలో భూ అక్రమాలను సహించేదే లేదు. సహజవనరుల దోపిడీకి పాల్పడితే చర్యలు తప్పవు.

## స్టేజ్‌పై తెగ ఊపేస్తూ డాన్స్ చేసిన అంజలి

సోషల్ మీడియా ఫాలోవర్స్‌కి అంజలి అరోగా గురించి ప్రత్యేకంగా పరిచయం చేయనక్కర్లేదు. గతంలో టిక్‌టాక్, ఆ తర్వాత ఇన్‌స్టాగ్రామ్‌లో అంజలి అరోరా చేసిన సందడి, చేస్తున్న సందడి అంతా ఇంతా కాదు. ఆమె షార్ట్ వీడియోస్ వల్ల స్టార్ హీరోయిన్స్ రేంజ్‌లో గుర్తింపు దక్కించుకుంది. ఒకప్పుడు ఆమె చేసిన కచ్చబాదాం సాంగ్ డాన్స్ రీల్‌కి మిలియన్స్‌లో వ్యూస్, లక్షల్లో లైక్స్ వచ్చాయి. దాంతో ఓవర్ నైట్‌లో ఈ అమ్మడు స్టార్‌గా మారి పోయింది. అంతే



కాకుండా అంతకు ముందు చేసిన వీడియోలు సైతం బాగా వైరల్ అయ్యాయి. ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో పాపులారిటీ దక్కగానే బాలీవుడ్‌లో అడుగు పెట్టే ప్రయత్నాలు చేస్తూ ఉన్నారు.

ఈ అమ్మడు సైతం బాలీవుడ్‌లో అడుగు పెట్టేందుకు తెగ ప్రయత్నాలు చేస్తుంది. ఒకటి రెండు సినిమా ఆఫర్లు సైతం వచ్చాయనే వార్తలు ఆ మధ్య కాలంలో వచ్చాయి.

**అంజలి అరోరా సోషల్ మీడియా ఫాలోయింగ్...** కచ్చ బాదాం పాటకు చేసిన డాన్స్‌తో వైరల్ కావడంతో కంగనా రనౌత్ హోస్ట్‌గా చేసిన రియాల్టీ షో లాక్ అప్ లో కంటెస్టెంట్ గా చేసింది. 2022 లో ఆ షో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ షో అంజలి అరోరాను మరింతగా ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చింది. దాంతో ఆమె హీరోయిన్స్ స్థాయిలో సోషల్ మీడియాలో పాపులారిటీ సొంతం చేసుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో అంజలి అరోరాకి దాదాపుగా 13.3 మిలియన్‌ల ఫాలోవర్స్ ఉన్నారు. ఇండస్ట్రీలో ఉన్న చాలా కొద్ది మంది హీరోయిన్స్‌కి మాత్రమే 10 మిలియన్‌లు అంతకు మించి ఫాలోవర్స్ ఉన్నారు. అలాంటిది ఈ కచ్చబాదం బ్యూటీకి ఏకంగా 13 మిలియన్‌ల ఫాలోవర్స్ ఉండటం అంటే మామూలు విషయం కాదు. సోషల్ మీడియాలో ఈ అమ్మడి యొక్క ఫాలోయింగ్‌తో హీరోయిన్‌గానూ ఆఫర్లు వస్తున్నాయని తెలుస్తోంది.

## చిరుత పిల్లలా సమంత కూడా షాక్!

చిరుత లో హీరోయిన్ గా నటించిన నేహాశర్మ డైరెక్టర్ గా కెప్టెన్ కుర్చీ ఎక్కి షాక్ ఇచ్చింది. బాలీవుడ్ లో ఏ కంగా సిద్దాంత్ చతుర్వేది, మోహిత్ రైనా నే డైరెక్ట్ చేయడానికి రెడీ అయింది. నిన్న మొన్నటి వరకూ ఇన్ స్టాలో హీటెక్కించే భంగిమలతో అలరించిన బ్యూటీ ట్రాన్సపర్మేషన్ చూసి నెటి జనులు సైతం షాక్ అయ్యారు. అదీ భారీ పీరియాడిక్ కథనే డీల్ చేయడానికి సంకల్పించింది. ఈ చిత్రాన్ని స్టార్ హీరో అజయ్ దేవగణ్ నిర్మించడం మరో విశేషం. ఇలా చిరుత పిల్ల విషయంలో ప్రతీది సర్ ప్రైజింగ్ గానే అనిపిస్తుంది.

**లవ్ స్టోరీతో ముందుకా:** ఇదే తరహాలో సమంత కూడా ప్లాన్ చేస్తోందా? అంటే అవుననే లీకులందుతున్నాయి. ఖుషీ తర్వాత సమంత హీరోయిన్ గా సినిమా చేయని సంగతి తెలిసిందే. బాలీవుడ్ లో ఓ రెండు సిరీస్ లు కమిట్ అయినా? అవి ఇప్పుడే రిలీజ్ అయ్యేవి



కాదు. ఇప్పటికే తాను కూడా ట్రాలాలా పేరుతో స్వయంగా నిర్మాణ సంస్థను స్థాపించింది శుభం చిత్రాన్ని నిర్మించింది. ఈ నేపథ్యంలో తాజాగా సమంత కూడా దర్శకు రాలిగా కొత్త టర్నింగ్ తీసుకుంటుందనే ప్రచారం మొదలైంది. సామ్ సొంతంగా ఓ బ్యూటీఫుల్ లవ్ స్టోరీ సిద్ధం చేసుకుదని వినిపిస్తోంది.

**కొత్త నటీనటులతో:** కొంత మంది యువ నటీనటులతో ఈ కథను తెరకెక్కించాలని ప్లాన్ చేసుకుంటున్నట్లు తెలిసింది. దర్శ కురాలిగా అనుభవం లేకపోవడంతో? శుభం చిత్రానికి పని చేసిన టీమ్ సహాయకులుగా నియమిం చుకుని కెప్టెన్ కుర్చీ ఎక్కాలనే ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ఎలాగూ సొంత నిర్మాణ సంస్థలోనే కాబట్టి? తనదే అంతిమ నిర్ణయం అవుతుంది. మరి ఈ ప్రచారంలో నిజమెంతో తెలియాలి. రెండేళ్లగా సమంత సినిమాలకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే అవకాశాలు రాక నటించలేదు ? అన్న ప్రచారాన్ని ఇటీవలే ఖండించింది.

**కొత్త ప్రయాణం నిజమేనా:** అంతకు ముందే నిర్మాతగానూ అవతరించింది. ఇప్పుడేమో క్రియేటివ్ రంగంలో ఎంటర్ అవుతుందనే ప్రచారం ఇంట్రెస్టింగ్. ఇదే సాధ్యమైతే గనుక సమంత కెరీర్ కొత్త టర్నింగ్ తీసుకున్నట్లే. హీరోయిన్లు దర్శకులు అయింది సినిమా చరిత్రలో పెద్దగా లేదు. చాలా మంది హీరోయిన్లగానే రిటైర్మెంట్ తీసుకు న్నారు. మరికొంత మంది నిర్మాణం సహా ఇతర రంగాల్లో రాణించినా? పీక్స్ కి చేరిన వారంటూ ఎవరూ లేరు. నిర్మాణం పరంగా సమంత జర్నీ కూడా సీరియస్ గానే సాగుతుంది. ప్రస్తుతం నిర్మాతగా కొత్త ప్రాజెక్ట్ లు ప్లాన్ చేసుకుంటోంది.




## 2026 సంక్రాంతి.. ఆల్మోస్ట్ ఫిక్స్ అయినట్లేనా?



టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో సంక్రాంతి సీజన్ కు ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. కచ్చితంగా అప్పుడే తమ సినిమాలు రిలీజ్ అవ్వాలని అంతా కోరుకుంటారు. అందుకే ముందుగానే బెర్తులు ఖరారు చేసుకుంటారు. కొన్ని అనుకున్నట్లు విడుదల కాగా, మరికొన్ని లాస్ట్ లో తప్పుకుంటాయి. ఇంకొన్ని సడెన్ లో రేసులోకి వస్తుంటాయి. అయితే ఇప్పుడు 2026 సంక్రాంతి సీజన్ బెర్తుల విషయంలో కొన్ని నెలలుగా మార్పులు చేర్పులు జరుగుతూనే ఉన్నాయి. కానీ దాదాపు క్లారిటీ వచ్చేసినట్లే. మరికొన్ని రోజుల్లో కంప్లీట్ గా ఫిక్స్ అవ్వనున్నట్లు అర్థమవుతోంది. తెలుగు హీరోల సినిమాలు మూడు కాగా.. మరో కోలీవుడ్ మూవీ రిలీజ్ అయ్యేలా రంగం సిద్ధమవుతున్నట్లు టాక్. పొంగల్ సీజన్ కు మెగాస్టార్ చిరంజీవి వస్తున్నట్లు ఎప్పుడో ప్రకటన వచ్చిన విషయం తెలిసిందే. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న మన శంకర వరప్రసాద్ గారు మూవీ సంక్రాంతి సీజన్ లోనే విడుదల అవ్వనుంది. రీసెంట్ గా సమ్మర్ కు వాయిదా వేస్తారని టాక్ వినిపించినా.. అదేం లేదు. కచ్చితంగా పొంగల్ కు రానున్నట్లు క్లారిటీ ఇచ్చారు. ఆ తర్వాత యంగ్ హీరో నవీన్ పోలిశెట్టి నటిస్తున్న అనగనగా ఒక రాజు మూవీ కూడా పెద్ద పండక్కి రానున్నట్లు ఇప్పటికే మేకర్స్ అనౌన్స్ చేశారు. నిజానికి చిన్న సినిమా అయినా కంటెంట్ మీద నమ్మకంతో సంక్రాంతికి తీసుకొస్తున్నట్లు అర్థమవుతోంది. రేసు నుంచి తప్పుకుంటుందని వార్తలు వచ్చినా.. అదేం నిజం కాదు. ఇక రీసెంట్ గా పాన్ ఇండియా స్టార్ ప్రభాస్.. రాజాసాబ్ మూవీ కూడా పొంగల్ కు రిలీజ్ కానున్నట్లు కొద్ది రోజుల నుంచి వార్తలు వస్తున్నాయి. డిసెంబర్ 5న వాయిదా పడుతుందని టాక్. నిజానికి నిర్మాత టీజీ విశ్వప్రసాద్ కూడా పరోక్షంగా అదే చెప్పారు. త్వరలోనే మేకర్స్.. ఆ విషయాన్ని అధికారికంగా అనౌన్స్మెంట్ చేయనున్నారని వినికిడి. అయితే సంక్రాంతికి మాస్ మహారాజా రవితేజ వస్తారని ఇప్పటికే అనౌన్స్మెంట్ వచ్చింది. కిషోర్ తిరుమల దర్శకత్వం వహిస్తున్న మూవీ రిలీజ్ అవుతుందని అంతా అనుకున్నారు. కానీ ఆ చిత్రం రేసు నుంచి తప్పుకున్నట్లు సమాచారం. కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ దళపతి జన నాయగన్ మాత్రం సంక్రాంతికే రిలీజ్ అవుతుందని తెలుస్తోంది. తెలుగులోనూ భారీగా రిలీజ్ చేయనున్నారట. మొత్తానికి 2026 సంక్రాంతి లైనప్ దాదాపు ఫిక్స్ అయినట్లే.

## మధరాసి వరధల్లే సాంగ్.. మరోసారి అనిరుధ్ - శివకార్తికేయన్ మ్యాజిక్




టాలీవుడ్ ఆడియన్స్‌లో సౌత్ సినిమాలపై క్రేజ్ పెరిగిపోతున్న ఈ సమయంలో, హీరో శివకార్తికేయన్ కొత్తగా చేస్తున్న మధరాసి సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. స్టార్ డైరెక్టర్ ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో వస్తున్న ఈ మూవీకి మొదటి నుంచే పాజిటివ్ బజ్ క్రియేట్ అయ్యింది. యాక్షన్, ఎమోషన్ కలబోతగా ఉండబోతుందన్న టాక్ వచ్చింది. ఇప్పటికే రిలీజ్ అయిన టీజర్, ఫస్ట్ సాంగ్ సినిమాపై హైప్ ని పెంచాయి. ఇప్పుడు ఆ క్రేజ్‌ని మరింత పెంచుతూ వరధల్లే అనే రెండో సింగిల్ ని రిలీజ్ చేశారు. ఈ పాటను అనిరుధ్ రవిచందర్ కంపోజ్ చేయగా, లేటెస్ట్ యూత్ టేస్ట్‌కి తగ్గట్టు కంప్లీట్ ట్రెండీగా తీశారు. అనిరుధ్ శివకార్తికేయన్ కాంబినేషన్ ఎప్పుడూ మ్యాజికల్ హిట్స్ ఇచ్చింది. ఇప్పుడు కూడా అదే మ్యాజిక్ రిపీట్ అయింది. సాంగ్ స్పెషల్‌గా ఉండటానికి కారణం వీడియోలో అనిరుధ్ స్వయంగా కనిపించడం. శివకార్తికేయన్‌తో కలిసి చేసిన డాన్స్ స్టెప్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. ఇద్దరి ఎనర్జీ ఫుల్ స్క్రీన్ పై కనిపిస్తూ, యూత్ కి బాగా కనెక్ట్ అవు తున్నాయి. శివకార్తికేయన్ తన స్టైలిష్ లుక్స్, స్వాగ్‌తో ఫ్రెష్ వైబ్ తీసుకొచ్చాడు. ఈ పాట ద్వారా సినిమా యూత్ ఆడియన్స్ లో మరింత బజ్ తెచ్చుకుంది. మధరాసి సినిమాకి హీరోయిన్ గా రుక్మిణి వసంత్ నటిస్తోంది. విలన్ పాత్రలో యాక్షన్ స్టార్ విద్యుత్ జామ్వాల్ కనిపిం చనున్నారు. భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను ఎన్. శ్రీలక్ష్మి ప్రసాద్ నిర్మిస్తున్నారు. మాస్, క్లాస్ కలిపిన యాక్షన్ ఎంటర్టైనర్‌గా ఉండబోతుందన్న టాక్ తో అంచనాలు రెట్టింపయ్యాయి. మురుగదాస్ కెరీర్ లో ఈ మూవీ చాలా కీలకమని చెప్పాలి. గతంలో బాక్సాఫీస్ వద్ద పెద్ద సక్సెస్ ఇవ్వకపోయినా, ఇప్పుడు మళ్లీ కమర్షియల్ బ్లాక్ బస్టర్ కొట్టాలన్న దృష్టితో మధరాసిని ప్లాన్ చేశారు. ఇప్పటివరకు రిలీజ్ చేసిన ప్రతి అప్‌డేట్‌కి సూపర్ రెస్పాన్స్ రావడం కూడా అదే చెప్పేస్తోంది. సెప్టెంబర్ 5న ఈ మూవీ తెలుగు సహా ఐదు భాషల్లో గ్రాండ్ రిలీజ్ కానుంది.

## మహానటి ఆ గ్యాప్ ను ఎలా మ్యానేజ్ చేస్తుందో?

పెళ్లి తర్వాత హీరోయిన్ల కెరీర్, హీరోల కెరీర్ లానే ఉండదు. ఎన్నో సవాళ్లుంటాయి ఎప్పటికప్పుడు తమను తాము ప్రూవ్ చేసుకుంటూ కెరీర్లో సక్సెస్‌లు అందుకుంటూ ఉంటేనే కొత్త అవకాశాలు వస్తాయి. లేదంటే పెళ్లైంది కదా అని దర్శకనిర్మాతలు లైట్ తీసుకుంటూ ఉంటారు. అయితే మహానటి కీర్తి సురేష్ మాత్రం పెళ్లి తర్వాత తన జోష్ ను బాగా పెంచింది.

**పెళ్లి తర్వాత నెమ్మదించిన కెరీర్...** గతేడాది డిసెంబర్ లో తన ప్రియుడు ఆంటోనీ తట్టిల్ ను పెళ్లి చేసుకున్న కీర్తి సురేష్, పెళ్లి తర్వాత తన యాక్టింగ్ కెరీర్ ను ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్లాన్ చేసుకుందని ఆమె చేసే పనుల ద్వారా అందరికీ అర్థమయ్యేలా



చేసింది. అందుకే ఫ్యాన్స్, ఇండస్ట్రీ వర్గాలు కీర్తి త్వరలోనే కొత్త ప్రాజెక్టులకు సైన్ చేస్తుందని ఆశించారు. అలా అందరూ అనుకునేలా చేసింది కూడా కీర్తినే.

**సోషల్ మీడియాలో యాక్టివ్‌గా...** పెళ్లి ముందు కంటే తర్వాతనే సోషల్ మీడియాలో ఎక్కువగా యాక్టివ్ గా ఉంటూ ఆడియన్స్ తో టచ్ లో ఉండటానికి రెగ్యులర్ గ్లామరస్ ఫోటోషూట్స్, అప్డేట్స్ ను షేర్ చేస్తూ వచ్చింది. ఆమె సోషల్ మీడియా ద్వారా ఇస్తున్న అప్డేట్స్ చూసి కీర్తి చాలా స్ట్రాంగ్ కంబ్యాక్ ఇవ్వబోతుందని వార్తలు కూడా వచ్చాయి. అయితే కీర్తి పెళ్లి చేసుకుని 9 నెలలవుతున్నా ఇప్పటికీ తెలుగులో ఒక్క కొత్త సినిమాను కూడా ఆమె అనౌన్స్ చేసింది లేదు. స్టార్‌డమ్, క్రేజ్, ఫాలోయింగ్ ఇవన్నీ ఉన్నప్పటికీ కీర్తికి ఆశించిన రాలేదు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్య హీరోగా తెరకెక్కుతున్న సినిమాలో కీర్తిని హీరోయిన్ గా తీసుకోవడానికి డిస్కషన్స్ జరుగుతున్న ట్టు వార్తలొచ్చాయి. ఆ తర్వాత నితిన్ తో కలిసి ఎల్లమ్మ కోసం అడిగా రని కూడా అన్నారు. కానీ వాటిలో ఏ అవకాశం కూడా కీర్తిని వరించలేదు. మరి ఈ గ్యాప్ ను కీర్తి ఫ్యూచర్‌లో ఎలా మ్యానేజ్ చేస్తుందో చూడాలి.

## ఒక్క చుక్క కన్నీటి కోసం 28 టేకులు

బాలీవుడ్ లోని ఆర్టిస్టుల్లో పర్ఫెక్షనిస్ట్ గా పేరు తెచ్చుకున్న సీనియర్ నటి విద్యాబాలన్. ప్రతి సన్నివేశంలో ప్రతి చిన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుని జాగ్రత్తగా నటిస్తుంది గనుకనే బాలన్ గొప్ప పెర్ఫామర్ గా వెలిగిపోతోంది. అయితే తనలోని ఈ పర్ఫెక్షన్ ఎలా వచ్చింది? అంటే అందుకు పునాది వేసింది తన దాదా అని చెబుతోంది. దాదాగా పిలుపందుకున్న దివంగత దర్శకుడు ప్రదీప్ సర్కార్ తమకు ఈ విషయాలన్నిటినీ కెరీర్ ఆరంభమే నేర్పించారని బాలన్ వెల్లడించింది. తామంతా ఆయన బాటలో నడుస్తామని తెలిపింది. 2005లో విడుదలైన పరిణీత చిత్రాన్ని రీమాస్టర్ చేసి తిరిగి 2025 ఆగస్టు 29న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా తన గురువు, %-%పరిణీత%-% దర్శకుడు ప్రదీప్ సర్కార్ గురించి బాలన్ గుర్తు చేసుకున్నారు. నా ప్రారంభ రోజుల్లో ప్రతిదానికి దాదా పునాది వేసారు. నా చిన్నతనంలోనే ప్రతిదీ ఆయన నుంచి నేర్చుకున్నాను. సీన్ తీసేప్పుడు ప్రతి డీటెయిల్‌పైనా ఆయనకున్న శ్రద్ధ అసమానమైనది. అతడు నటుల ప్రదర్శనల కోసం మాత్రమే కాదు.. సరైన సమయంలో పావురాలను ఎగురవేయడానికి .. సరైన సమయంలో కిటికీ వెలుపల ఆకులు పడేలా చేయడానికి కూడా వంద టేకులు తీసుకోగలడు.



ప్రతిదానిలోనూ లయ ఉందని అతను నమ్ముతాడు! అని తెలిపింది విద్యా. ప్రతి సన్నివేశంలో కచ్చితత్వాన్ని కోరుకుంటాడని సర్కార్ ని ఆకాశానికెత్తేసారు. ఒకసారి నేను పాటలోని ఒక లైన్‌కు కన్నీటి చుక్కను సరైన టైమ్‌కి రాబట్టడానికి 28 టేకులు తీసుకున్నాను. అతడు కోరిన కచ్చితత్వం వచ్చేవరకూ ఎవరైనా ఆర్టిస్టు అలా చేయాల్సిందే. ఆయన మార్గదర్శకత్వం నాకు క్రాఫ్ట్‌లోని ప్రతి వివరం ఎలా గమనించాలో నేర్చుకున్నాను. 20 సంవత్సరాలుగా నాతో ఉన్న నా హెయిర్ స్టైలిస్ట్ శలక కూడా దాదా నుండి ప్రతిదీ నేర్చుకున్నాడు. అది మా అందరికీ ఆయన ఇచ్చిన బహుమతి అని బాలన్ చెప్పారు. ఇద్దరు ప్రేమికుల మధ్య స్నేహితుడి ప్రవేశం తర్వాత తలెత్తిన అపార్థాలేమిటనే దానిపై ఎమోషనల్ రైడ్ గా %-%పరిణీత%-% సినిమాని రూపొందించారు. 1960లో కోల్ కతా నేపథ్యంలో కథ సాగుతుంది. ఇందులో విద్యా బాలన్‌తో పాటు సైఫ్ అలీ ఖాన్, సంజయ్ దత్ కూడా నటించారు . విధు వినోద్ చోప్రా నిర్మించారు. శరత్ చంద్ర చటోపాధ్యాయ 1914లో రాసిన ప్రఖ్యాత బెంగాలీ నవల నుండి ఈ సినిమా కథను స్వీకరించారు. ఈ చిత్రం మొదట 10 జూన్ 2005న విడుదలైంది. ప్రసాద్ లాబ్స్ లో డెవలప్ చేసిన సినిమాను ఇప్పుడు మళ్లీ రీరిలీజ్ చేస్తున్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536